

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఐవిఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు 03

సంపుటి 29, సంచిక: 138 | శనివారం | 07-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

గడువులోగా ఆదాయం కోసం

భూములు వేలం



- ఆదాయ వనరుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన
- ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి
- దరఖాస్తుల సత్వర పరిష్కారానికి వారాల వారీగా లక్ష్యాలు
- పారదర్శక విధానాలు, వనరుల సమర్థ వినియోగంతో భవిష్యత్ ఆదాయాన్ని పెంచాలి: డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఈ ప్రక్రియలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తరువాయి 8లో

తల్లిదండ్రుల జీతం ప్రాతిపదికన

ఒబిసి క్రీమీలేయర్ నిర్ణయించొద్దు



- వారు పనిచేసిన ఉద్యోగ హోదా, పోస్ట్ కేటగిరి కూడా కీలకమే
- మార్చి 11 నాటి తీర్పును పునరుద్ఘాటించిన సుప్రీంకోర్టు
- గత నియామకాలు, పదోన్నతుల్లో ఎలాంటి ఇబ్బందులుండవని స్పష్టీకరణ
- తీర్పును భవిష్యత్తుకు మాత్రమే వర్తింపజేయాలన్న కేంద్రం అభ్యర్థన తిరస్కరణ

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ సంస్థ లేదా ప్రైవేట్ రంగంలో పనిచేసే తల్లిదండ్రుల వేతనం లేదా ఆదాయాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ఇతర వెనకబడిన తరగతుల (ఓబిసి) వారికి, 'క్రీమీలేయర్' వర్తిస్తుందో లేదో నిర్ణయించకూడదని, శుక్రవారం సుప్రీం కోర్టు మార్చి 11న ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తీర్పు అమలును వాయిదా వేయడానికి 'ఎటువంటి నమ్మకమైన లేదా సహేతుకమైన కారణం లేదు' అని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఆ తీర్పును భవిష్యత్తుకు మాత్రమే వర్తింపజేయాలన్న కేంద్రం అభ్యర్థనను జస్టిస్ పిఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. 2026 మార్చి 11 నాటి తీర్పు ఈ కోర్టు ముందు పార్టీల హక్కులను నిర్ధారిస్తుంది. ప్రతివాది అభ్యర్థులు ఓబిసి కేటగిరీలోని నాన్– క్రీమీలేయర్‌కు చెందినవారని, వారు పాల్గొన్న ఎంపిక ప్రక్రియలలో రిజర్వేషన్ ప్రయోజనంతో పాటు, తత్ఫలితంగా పోస్టుల కేటాయింపు , నియామకానికి అర్హులని ఇది పేర్కొంటున్నది. అటువంటి ప్రయోజనాన్ని మంజూరు చేయడమనేది, దానంతట అదే ఏ ఇతర వ్యక్తి సీనియారిటీకి నష్టం కలిగించకూడదు. లేదా, ఇప్పటికే ముగిసిన ఎంపికలు లేదా తరువాయి 8లో



మహత్తర అక్టోబర్ విప్లవ 109వ వార్షికోత్సవం నేడే
ప్రత్యేక వ్యాసం 2వ పేజీలో

మెట్రో–ఆర్‌టిసి పాస్‌ల ధర తగ్గింపు

రోజువారీ పాస్ రూ.275, నెలవారీ పాస్ రూ.4 వేలు

కొత్త ధరలు 8 నుంచి అమల్లోకి : మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్



దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. మెట్రో ఆర్‌టిసి ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి పాస్‌ను రూ.275కు తగ్గించారు. ఇందులో రూ.200 మెట్రో, రూ.75 ఆర్‌టిసి ప్రయాణానికి కేటాయించారు. ఈ పాస్‌తో రోజుకు నాలుగు సింగిల్ జర్నీలు చేసుకోవచ్చు. అదేవిధంగా రూ.8,500గా ఉన్న నెలవారీ పాస్‌ను రూ.4 వేలకు తగ్గించారు. ఇందులో రూ.3 వేలు మెట్రో, రూ.1 వెయ్యి ఆర్‌టిసి ప్రయాణానికి కేటాయించారు. నెలకు గరిష్టంగా 50 సింగిల్ ట్రిప్పులకు మెట్రోలో అనుమతి ఉంటుంది. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణానికి ఎలాంటి పరిమితి ఉండదు. ధరల తగ్గింపుతో నెలవారీ పాస్ వినియోగదారులకు తరువాయి 8లో

జిపి ఆదాయం

ఇక నేరుగా ఖాతాల్లోకి

గతనెల 9 నుంచి అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు..

గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఇకపై ట్రెజరీలో జమ కాకుండా నేరుగా గ్రామపంచాయతీల ఖాతాల్లోనే జమ అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం2026 అమలుకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జి.ఓ నెంబర్ 43ను శుక్రవారం విడుదల చేసింది. ఈ చట్ట సవరణ అక్టోబర్ 9 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటివరకు గ్రామపంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయం ట్రెజరీ ద్వారా వినియోగించాల్సి రావడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావడంలో జాప్యం ఏర్పడేదని అధికారులు తెలిపారు. దీంతో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులు తదితర అత్యవసర అవసరాలకు గ్రామపంచాయతీలు నిధుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామాల తరువాయి 12లో

జాబితాలో పేర్లు గల్లంతు...

ఓటర్లకు మరో అవకాశం

తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల వారికే చాన్స్ : ఇసి



న్యూఢిల్లీ : కోట్లాది మంది ఓటర్ల ఓటు హక్కును హరించివేస్తోందన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎన్నికల సంఘం, కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో గైర్హాజరు, స్థానభ్రంశం, మరణం, ఇతర (ఎఎస్‌డిడి)గా గుర్తించబడి, ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడని ఏడు రాష్ట్రాల ఓటర్లకు మరో అవకాశం కల్పించింది. జాబితాలో లేని ఓటర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సహకరించాలని ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ఇసి ఒక లేఖలో ఆదేశించింది. ఈ నిర్ణయం, ఓటర్ల లెక్కింపు ఫారాలు జారీ చేయబడినప్పటికీ, అవి తిరిగి అందకపోవడంతో ముసాయిదా జాబితా నుండి మినహాయించబడిన ఓటర్లకు కూడా వర్తిస్తుంది. బిజెపి ఆదేశాల మేరకు కోట్లాది మంది అర్హులైన పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఇసి తొలగిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. సుప్రీం కోర్టు దీనిని ధ్రువీకరించిందని పేర్కొంటూ, ఎన్నికల సంఘం ఈ సవరణను సమర్థించుకుంది. జాబితాలో తరువాయి 8లో



ఉన్నత విద్యలో కుల వివక్షకు అడ్డుకట్ట ఎప్పుడు?

భారతదేశంలో విద్యాసంస్థలు జ్ఞానాన్ని అందించే కేంద్రాలు. అంతేకాదు, సామాజిక మార్పుకు, సమానత్వానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పునాదులుగా నిలవాల్సిన ప్రదేశాలు. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అయితే, రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్ష పూర్తిగా తొలగిపోలేదన్నది చేదు నిజం. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాల్లో కుల ఆధారిత వివక్షను అరికట్టేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తీసుకొచ్చిన తాజా నిబంధనలపై నెలకొన్న వివాదం, కేంద్ర ప్రభుత్వం వాటిపై పునరాలోచన చేయాలన్న తాజా నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా, యుజిసి ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహానికి సంబంధించిన నిబంధనలను పునఃసమీక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నిబంధనలను పునఃసమీక్షించడమా, లేక వాటి అసలు లక్ష్యమైన కుల వివక్ష నిర్మూలనను నీరుగార్చడమా? అన్నది ప్రధాన ప్రశ్న. ఈ ఏడాది జనవరిలో నోటిఫై చేసిన యుజిసి నిబంధనల్లో, ప్రతి ఉన్నత విద్యాసంస్థలో సమాన అవకాశాల కేంద్రం, ఈక్విటీ కమిటీ, ఈక్విటీ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడం, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారానికి 24 గంటల ఈక్విటీ హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచడం, ఈక్విటీ అంబాసిడర్లను నియమించడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. నిబంధనలను అమలు చేయని విద్యాసంస్థలపై యుజిసి చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు, ఇతర ప్రయోజనాలను నిలిపివేసే అవకాశం కూడా కల్పించారు. విద్యార్థులు కుల వివక్షకు గురికాకుండా చూడటం, బాధితులకు ఫిర్యాదు చేసే వేదికను కల్పించడం, విద్యాసంస్థలను జవాబుదారీగా మార్చడం వీటి ప్రధాన ఉద్దేశంగా కేంద్రం ప్రకటించింది. అయితే, ఈ నిబంధనలపై అగ్రవర్ణాలకు చెందిన కొందరు విద్యార్థులు, సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. వీటివల్ల జనరల్ కేటగిరీ విద్యార్థులు అనవసర వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉందని, క్యాంపస్‌లలో కుల విభజనలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు వాదించారు.

మరోవైపు, దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పనిచేసే సంఘాలు మాత్రం ఈ నిబంధనలు కూడా సరిపోవని అభిప్రాయపడుతున్నాయి. కుల వివక్షకు గురైన విద్యార్థులకు నిజమైన న్యాయం జరగాలంటే మరింత పటిష్టమైన రక్షణ వ్యవస్థ అవసరమని కోరుతున్నాయి. ఈ రెండు వాదనల మధ్య కేంద్ర ప్రభుత్వం నిబంధనలను ఉపసంహరించుకోవడం, ఇప్పుడు వాటిపై పునరాలోచనకు సిద్ధపడటం అనేక సందేహాలకు తావిస్తోంది.

వాస్తవానికి భారతీయ సమాజంలో కుల వివక్ష అనేది కేవలం సామాజిక సంబంధాలకు మాత్రమే పరిమితం కాలేదు. అది విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, వ్యక్తిగత గౌరవం వంటి అనేక అంశాలను సైతం ప్రభావితం చేస్తోంది. ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందినంత మాత్రాన అణగారిన వర్గాల విద్యార్థులకు సమానమైన వాతావరణం లభిస్తోందని చెప్పలేం. తరగతి గదుల్లో అవమానకర వ్యాఖ్యలు, కులపరమైన వివక్ష, వసతి గృహాల్లో అసమాన ప్రవర్తన, అధ్యాపకుల పక్షపాత ధోరణి, సహ విద్యార్థుల నుంచి ఎదురయ్యే అవహేళనలు వంటి సమస్యలు విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి. ముఖ్యంగా గ్రామీణ, పేద కుటుంబాల నుంచి వచ్చిన మొదటి తరం విద్యార్థులు ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతుంది. కాబట్టి కుల వివక్షను అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయడం అనవసర చర్య కాదు. రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కును ఆచరణలోకి తీసుకురావడానికి అత్యవసరం. అదే సమయంలో జనరల్ కేటగిరీ విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా పూర్తిగా తోసిపుచ్చడం ప్రజాస్వామ్యబద్ధమైన విధానం కాదు. ఏ చట్టం లేదా నిబంధన అయినా నిర్దోషులను అన్యాయంగా వేధించడానికి సాధనంగా మారకూడదు. కుల వివక్షపై వచ్చే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించాలి. తప్పుడు ఫిర్యాదులకు అవకాశం లేకుండా స్పష్టమైన విచారణ విధానం, ఆధారాల పరిశీలన, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తమ వాదన వినిపించే అవకాశం ఉండాలి. అయితే తప్పుడు ఫిర్యాదుల భయాన్ని చూపించి నిజమైన బాధితులకు రక్షణ కల్పించే వ్యవస్థను బలహీనపరచడం కూడా అంతే ప్రమాదకరం. ఒక వర్గం ఆందోళనలను పరిష్కరించే పేరుతో మరో వర్గం హక్కులను దెబ్బతీయకూడదు. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ బాధ్యత అత్యంత కీలకమైనది. యుజిసి నిబంధనలను రూపొందించే సమయంలో అన్ని వర్గాల విద్యార్థులు, విద్యావేత్తలు, సామాజిక న్యాయ నిపుణులు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించి ఉండాల్సింది. నిబంధనల అమలులో ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. ఒకవైపు కుల వివక్ష నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని ప్రకటిస్తూ, మరోవైపు నిరసనల ఒత్తిడితో నిబంధనలను వెనక్కి తీసుకోవడం ప్రభుత్వ విధాన స్థిరత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతుంది.


సామాజిక న్యాయం విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు రాజకీయ ఒత్తిళ్లకు కాకుండా రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలి. ప్రస్తుతం ఏర్పాటు చేయాలని భావిస్తున్న కమిటీ కేవలం నిబంధనల్లోని పదజాలాన్ని మార్చే పనికే పరిమితం కాకూడదు. విద్యాసంస్థల్లో కుల వివక్ష ఏ రూపాల్లో కొనసాగుతోంది? బాధితులు ఫిర్యాదు చేయడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? ఇప్పటికే ఉన్న ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు ఎందుకు సమర్థంగా పనిచేయడం లేదు? బాధితులకు న్యాయం అందించడంలో ఎదురవుతున్న అడ్డంకులేమిటి? అనే అంశాలను లోతుగా అధ్యయనం చేయాలి. కమిటీలో అణగారిన వర్గాల ప్రతినిధులకు, విద్యార్థి సంఘాలకు, స్వతంత్ర సామాజిక న్యాయ నిపుణులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. విచారణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి, అప్పీల్ అవకాశం, బాధితుల గోప్యత, ప్రతీకార చర్యల నుంచి రక్షణ వంటి అంశాలకు చట్టబద్ధమైన ప్రాధాన్యతనివ్వాలి. కేవలం కమిటీలు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినంత మాత్రాన కుల వివక్ష అంతరించిపోదు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బందిలో రాజ్యాంగ విలువలు, మానవ హక్కులు, సమానత్వ భావనపై అవగాహన పెంచాలి. విద్యాసంస్థల్లో సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించాలి. కులపరమైన వివక్షకు పాల్పడేవారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిరాధార ఆరోపణలతో ఎవరికీ అన్యాయం జరగకుండా తగిన రక్షణ కల్పించాలి. ప్రతి విద్యార్థి ఎలాంటి భయం, అవమానం, వివక్ష లేకుండా చదువుకునే వాతావరణాన్ని నిర్మించాలి. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో కేంద్రం చేపట్టే పునఃసమీక్ష సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సాగాలి. విద్యాసంస్థ లు కుల గోడలను నిర్మించే కేంద్రాలుగా కాకుండా, వాటిని కూల్చివేసే జ్ఞాన మందిరాలుగా మారినప్పుడే రాజ్యాంగం ఆశించిన సమానత్వ భారతం సాకారమవుతుంది.



జ్ఞానేశ్ కుమార్ అవినీతిపై విచారణ మొదలైంది

కేరళలో పిడబ్ల్యుడి కార్యదర్శిగా జ్ఞానేశ్ కుమార్(ప్రస్తుత కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్) పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి చాలా తీవ్రమైన అంశం. పిఎటిఐ–ఐబిఇఎల్ కంపెనీతో జరిపిన లావాదేవీల్లో అవినీతికి సంబంధించి ఒక సమగ్ర ఫిర్యాదు అందింది. కాంట్రాక్టర్ ఆత్మహత్యకు జ్ఞానేశ్ కుమారే కారణమని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు విభాగం (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్) విచారణను ప్రారంభించింది.

రమేశ్ చెన్నితల, కేరళం హోం మంత్రి



‘కవి కేసరి’ కపిలవాయి లింగమూర్తి

కపిలవాయి లింగమూర్తి గొప్ప మేధావి. వీరు మార్చి 31, 1928 అప్పటి మహబూబ్ నగర్‌లో జన్మించారు. ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చాడు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లాలోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి. 2016లో తెలంగాణ ప్రభుత్వం నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారం అందుకున్నాడు కపిలవాయి లింగమూర్తి.

వీరు అచ్చంపేట దగ్గర ఉన్న బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928న జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగాడు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశాడు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద పత్రాన్ని సంపాదించాడు. వీరి సతీమణి మీనాక్షి. కుమారులు కిషోర్ బాబు, అశోక్ బాబు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా చేరాడు. ఆ తర్వాత 1972లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగవిరమణ పొందాడు. లింగమూర్తి నడిచే విజ్ఞానసర్వస్వంగా పేరుపొందాడు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. వీరు గవర్నర్లు కృష్ణకాంత్, ఇ.ఎస్.ఎల్.నరసింహన్, ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో సన్మానాలు అందుకున్నారు. వీరికి వివిధ సంస్థలు, వ్యక్తుల ద్వారా వచ్చిన పురస్కారాలు 87 వరకు వున్నాయి. సన్మానాలు అనేకం కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13 స్నాతకోత్సవంలో చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ వీరికి గౌరవ డాక్టరేట్‌ను అందించారు.

తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 130 రచనలు చేశారు

రచనలలో శతకాలు 13, సంకీర్తనలు 9, ఉదాహరణలు 5, వచన గేయ పద్య కృతులు 7, కావ్యాలు 7, ఆధ్యాత్మిక రచనలు 90, చరిత్రలు 18, నవలలు వచన రచనలు 6, కథా సాహిత్యం 3, సంకలనాలు వ్యాఖ్యానాలు 6, జీవిత చరిత్రలు/ఆత్మకథలు 3, నాటకాలు 4, నిఘంటువులు 1, అనువాదాలు 5సంపాదితాలు పరిష్కతులు 51, సంచికలు సంపాదకులు 6 ఉన్నవి. ముద్రిత అముద్రిత వ్యాసాలన్నీ కలిపి 500. సుమారు 320 పుస్తకాలకు పీఠికలు, ముందు మాటలు వెలువరించినారు.

జీవితము, సాహిత్యంపై ఆరుగురు పరిశోధక విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాలలో ఎం.ఫిల్ పి.హెచ్.డి పట్టాలు పొందినారు.

సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగిందని ఎన్నోసార్లు చెప్పారు. వీరు 2018 నవంబర్ 6న మరణించారు. జిఒ లు తెలుగులో రావాలని పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని చెప్పారు. అనేక సాహితీ సంస్థల్లో పని చేసారు. కపిలవాయి అంటే నడిచే సాహిత్యం. వీరి రచనలు చదివి స్ఫూర్తి పొందు దాం.

కామిడి సతీష్ రెడ్డి, 9848445134

20వ శతాబ్దాన్ని మార్చిన అక్టోబర్ విప్లవం



కృష్ణ ఝా

అక్టోబర్ విప్లవం (1917)తో ప్రపంచంలో తొలి సోషలిస్టు రాజ్యం ఆవిర్భవించింది. అది 20వ శతాబ్దం ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాలు, చరిత్రను ప్రాథమికంగా మార్పు చేసింది. అది ఒక స్వప్న రాజ్యం. ఎన్ని బాధలు, ఎంత రక్తపాతం సంభవించినా అదొ క శిఖరాగ్రంగా నిలిచింది. దానికోసం ప్రజారాసులతోపాటు కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేశారు. సంక్షోభం నెలకొని ఉన్నప్పటికీ వారి పురోగమనాన్ని ఏదీ నిరోధించలేకపోయింది. ప్రపంచానికి సంబంధించి అదొక అద్భుతం – ఎందుకంటే ఆ రాజ్యంలో ప్రతి ఒక్కటీ ప్రజలకే చెందుతుంది. మిగతా ప్రపంచాన్ని పెట్టుబడిదారీ విధానం పరిపాలిస్తోంది. సామ్రాజ్యవాదం అప్పటికింకా ఆధిపత్యశక్తి గా తయారు కాలేదు. సోషలిజం దాన్ని సవాలు చేస్తోంది. అది వేగవంతంగా రూపుదిద్దుకున్న నూతన సామాజిక – ఆర్థిక వ్యవస్థ. కార్మిక వర్గానికి పాలనాధికారం. వారు తమ సొంత రాజ్యం సృష్టించుకున్నారు, సామ్రాజ్యవాదం మసకబారుతుండగా వారు బలం పుంజుకున్నారు. పాత దోపిడీ వర్గాలు తమను సజీవంగా ఉంచినటువంటి యావత్ ప్రయోజనం కోల్పోయాయి. రెండు సంఘర్షిత వర్గాల మధ్య శతృత్వాన్ని అంతం చేయటం సాధ్యమేనని వారు గుర్తించేటటువంటి నిర్ణయాత్మక క్షణంవైపు వారిని కొత్తమార్గం నడిపించింది. యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యుఎస్ఎస్ఆర్) నాయకత్వంలో నూతన సమాజ నిర్మాణం కోసం పోరాటం జరిగింది. దోపిడీకి గురవుతున్న ప్రజారాసులన్నీ కార్మికవర్గంతోపాటు అందులో పాల్గొన్నాయి.

మహత్తర అక్టోబర్ విప్లవం ప్రధాన లక్షణం ఏమంటే, 'ద్వంద్వ అధికారం'లోని పరస్పర అధికారాలను విడదీయటం ద్వారానే అది పురోగమించగలదు. 1917 ఫిబ్రవరి విప్లవం విజయవంతమైన తర్వాత ఆ ప్రారంభంనుంచే ద్వంద్వ అధికారం అస్థిత్వంలోకి వచ్చింది. ద్వంద్వ అధికారం అంటే ఒకే రాజ్యంలో రెండు ప్రభుత్వాలు పనిచేయటం. అధికారం లాంఛనంగా బూర్జువావర్గ తాత్కాలిక ప్రభుత్వం చేతిలో ఉన్నప్పటికీ నిజమైన అధికారం – కార్మిక, కర్షక అధికారం కార్మిక–కర్షకుల సోవియట్‌లలో ఉంది. తాత్కాలిక ప్రభు త్వం చేతిలో పోలీసు, సైన్యం దాదాపుగా లేదు. అందువల్ల అది సోవియట్‌లపై బలప్రయోగానికి పాల్పడలేదు. సోవియట్‌లు భ్రమలతో బూర్జువావర్గానికి అధికారాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నాయి. ప్రజారాసుల్లో మెజారిటీ తోడ్పాటు స్పష్టంగా, నిర్వివాదంగా సోవియట్‌లకే ఉంది.

అందువల్ల, మహా వ్యూహకర్త వ్లదీమిర్ లెనిన్, ప్రజారాసులను భ్రమలనుంచి విముక్తి చేసేటటువంటి, శాంతియుత మార్గాల ద్వారా విప్లవం సాధించే ఎత్తుగడలు అమలు చేశారు. తద్వారా ద్వంద్వ అధికారాన్ని అంతం చేశారు. ద్వంద్వ అధికారాన్ని చరిత్రలో అద్భుతమైన చర్యగా లెనిన్ అభివర్ణించారు. అది రెండు నియంతృత్వాలను – అనగా బూర్జువావర్గ నియంతృత్వం, కార్మిక–కర్షక నియంతృత్వాలను ముడివేసింది. అది ఎక్కువ కాలం సాగదు. వాటిలో ఒకటి తప్పుకోవలసిందే. కొద్దినెలల తర్వాత, 1917 అక్టోబర్ (నవంబర్ 7) విప్లవంలో జరిగింది అదే. ఆ విప్లవంలో యావత్ అధికారాన్ని సోవియట్‌లు స్వాధీనం చేసుకున్నాయి. లెనిన్, బోల్షివిక్‌లు 'సర్వాధికారం సోవియట్‌లదే' అని నినాదమిచ్చారు.

రష్యన్ విప్లవ ముఖ్య నినాదాలు మూడు : శాంతి, రొట్టె, భూమి. రష్యన్ విప్లవం మొదటి ప్రపంచ యుద్ధం (దబ్లుడబ్ల్యు1) నుంచి, సామ్రాజ్యవాద సార్వత్రిక సంక్షోభంనుంచే పురుడు పోసుకుంది. రష్యన్ ప్రజలకు, యావత్ ప్రపంచానికీ శాంతి స్థాపన అత్యంత ముఖ్యావసరం అయినందున దబ్లుడబ్ల్యు1 నుంచి రష్యా ఉపసంహరించుకుంది. శాంతి సాధన ప్రాతిపదికపై తినడానికి రొట్టె, వ్యవసాయానికి భూమి కూడా ముఖ్యం. అందువల్ల ఈ లక్ష్యాలు యావత్ ప్రజారాసులకు (శ్రమజీవులు) సంబంధించినవి. కాబట్టి అవి ప్రజాస్వామిక స్వభావం కలిగినవి. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం తమ ఆధిపత్య గుత్తాధికారాన్ని కోల్పోయాయి. కొత్త రాజ్యం ముఖాముఖీ తలపడవలసి వచ్చింది. ఈ కొత్త అధికారం 20కోట్ల మంది నవసమాజ ఉచిత నిర్మాతలనుంచి, ఏ ప్రతిఫలం ఆమోదించని కోట్లాదిమంది శ్రమజీవుల చైతన్యంనుంచి వృద్ధి చెందింది, బలం పుంజుకుంది.

శ్రమజీవుల జీవితాల్లో, శాంతికి మిత్రులైన నిజాయితీపరులైన మిత్రులందరి జీవితాల్లో అదొక నిర్ణయాత్మక క్షణం. అది వారి రాజకీయ, సైద్ధాంతిక, నైతిక దృక్పథాలను నిర్ణయించుకోవలసిన సమయం. కొత్తవర్గం పాత దోపిడీ వర్గాల స్థానంలో అధికారంలోకి రాగలుగుతుందనీ చివరకు రుజువైంది. సామ్రాజ్యవాద గొలుసును విచ్ఛిన్నం చేయటంలో ఒక నమూనా విఫలమైంది. మరో నమూనా చైనాలో నిర్మాణంలో ఉంది. రష్యాలో సోషలిజం నిర్మాణం ధ్వంసమై పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరిగినంత మాత్రాన అది మార్క్సిజం – లెనినిజం వైఫల్యం కాదు. అక్టోబర్ విప్లవ వైఫల్యం కాదు. ప్రపంచ వ్యాప్తంగా విప్లవశక్తులు ఒడిదొడుకులు ఎదురవుతున్నా పురోగమిస్తూనే ఉంటాయి. సమాజ పరిణామ క్రమాన్ని ఎవరూ ఆపలేరు. పెట్టుబడిదారీ ప్రపంచం సాగిస్తున్న నయా ఉదారవాద విధానాల దాడికి, ప్రజల బతుకులు దుర్భరం చేస్తున్న పొదుపు చర్యలకు, సామ్రాజ్యవాద అణచివేతకు వ్యతిరేకంగా కార్మిక వర్గం, ఇతర శ్రమజీవులు పోరాటాలు చేస్తున్నారు. వారికి 1917 సోషలిస్టు విప్లవం మార్గదర్శన జ్యోతి. విప్లవ, ప్రగతిశీల శక్తులందరికీ అక్టోబర్ విప్లవం దిశానిర్దేశం చేసే కాంతిపుంజం. వర్గరహిత, దోపిడీ రహిత సమాజం కోసం కృషి చేస్తున్న వారందరికీ అక్టోబర్ విప్లవం – సోషలిజానిదే భవిష్యత్ అనే సందేశం ఇస్తున్నది.




రాజప్రాసాదం వింటర్ ప్యాలెస్‌పై దాడి

రెండు నోబెల్ బహుమతుల ధీరవనిత క్యూరీ

ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగాల చరిత్రలో తనదైన ముద్ర వేసి, మానవాళి ఆరోగ్య రక్షణకు సరికొత్త ద్వారాలు తెరిచిన మహోన్నత శాస్త్రవేత్త మేడం క్యూరీ (మారీ క్యూరీ). ప్రతి సంవత్సరం నవంబర్ 7న ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా సైన్స్ రంగంలో ఆమె చేసిన సేవలను స్మరించుకుంటారు. పేదరికం, లింగ వివక్ష, రాజకీయ సంక్షోభాలను అధిగమించి రెండు వేర్వేరు శాస్త్ర రంగాలలో (భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం) నోబెల్ బహుమతి పొందిన ఏకైక మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె జీవితం కేవలం ఆవిష్కరణలకే పరిమితం కాక, నిరంతర సాధనకు, ఆదర్శవంతమైన వ్యక్తిత్వానికి ప్రతిరూపంగా నిలిచింది.

ఆధునిక శాస్త్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నోబెల్ బహుమతి గ్రహీత మేడం క్యూరీ (మారే స్క్లోడోవ్స్కా) 1867 నవంబర్ 7న పోలాండ్‌లోని వార్సా నగరంలో జన్మించారు. ఆమె బాల్యం అత్యంత పేదరికంలోను, అనేక కష్టనష్టాల మధ్య గడిచింది; అప్పట్లో పోలాండ్ రష్యా పాలనలో ఉండటం వల్ల అక్కడి పిల్లలకు, ముఖ్యంగా మహిళలకు ఉన్నత విద్యనభ్యసించే అవకాశం ఉండేది కాదు. అయినప్పటికీ ఆమె తండ్రి ఒక ఉపాధ్యాయుడు కావడం వల్ల చిన్నతనం నుంచే మేడం క్యూరీకి చదువుపై, సైన్స్ పట్ల అమితమైన ఆసక్తి కలిగింది. రష్యా నిబంధనలను ధిక్కరిస్తూ రహస్యంగా నడిచే 'ఫ్లయింగ్ యూనివర్సిటీ'లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె, ఉన్నత చదువుల కోసం పారిస్‌లోని ప్రఖ్యాత 'సార్బోన్ యూనివర్సిటీ'కి వెళ్లాలని కలలు కన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొద్దికాలం గృహకార్మికురాలిగా పనిచేసి డబ్బు కూడబెట్టుకుని, ఆ తర్వాత ఫ్రాన్స్‌కు చేరుకుని తన తెలివితేటలతో భౌతిక, గణిత శాస్త్రాలలో అత్యుత్తమ డిగ్రీలను సాధించి ప్రపంచ శాస్త్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

మేడం క్యూరీ తన భర్త పియర్ క్యూరీతో కలిసి చేసిన పరిశోధనలు అణు భౌతిక శాస్త్రంలో కొత్త శకానికి నాంది పలికాయి. టన్నుల కొద్దీ 'పిచ్‌బ్లెండ్' అనే ఖనిజాన్ని రాత్రింబవళ్లు సంస్కరించి, 'పోలోనియం', 'రేడియం' అనే రెండు కొత్త మూలకాల ను కనుగొన్నారు. కంటికి కనిపించని వికిరణం పరమాణువు లోపలి నిర్మా ణం నుంచే వస్తుందని ఆమె నిరూపించారు. ఈ పరిశోధనలకు గాను 1903లో భౌతికశాస్త్రంలో, 1911లో రేడియంను వర్గీకరించినందుకు రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతులు సాధించారు.



నవంబర్ 7 మేడం క్యూరీ జయంతి

మేడం క్యూరీ ఆవిష్కరణలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాలేదు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో తీవ్రంగా గాయపడిన సైనికులకు త్వరితగతిన వైద్యం అందించడానికి మొబైల్ ఎక్స్‌రే యూనిట్లను ('లిటిల్ క్యూరీస్') తయారు చేసి స్వయంగా యుద్ధ రంగానికి వెళ్లి సేవ లు అందించారు. రేడియోథెరపీ ద్వారా క్యాన్సర్ కణాలను నాశనం చేసే చికిత్సా విధానానికి ఆమె పరిశోధనలే పునాది వేసాయి. తాను కనుగొన్న రేడియం ఆవిష్కరణ కు పేటెంట్ హక్కులు తీసుకోకుండా, ప్రపంచ సంక్షేమం కోసం ఉచితంగా అందించడం ఆమె త్యాగానికి, మానవతా దృక్పథానికి నిదర్శనం.

మేడం క్యూరీ జీవితం కేవలం అద్భుతమైన శాస్త్రీయ ఆవిష్కరణలకే పరిమితం కాదు; ఆమె అనుసరించిన నైతిక విలువలు, శాస్త్ర విజ్ఞానాన్ని మానవాళి అభ్యున్నతికే ఉపయోగించాలనే దృక్పథం నేటికీ అత్యంత ఆదర్శనీయం. రేడియం మూలకాన్ని కనుగొన్న తర్వాత దానికి పేటెంట్ హక్కులు తీసుకుని ఉంటే ఆమె ప్రపంచంలోనే అత్యంత సంపన్నురాలిగా నిలిచేవారు. కానీ, శాస్త్ర విజ్ఞానం ఎవరి ఒక్కరి సొత్తు కాకూడదని, అది సామాన్య మానవుడి వైద్య అవసరాలకు ఉచితంగా అందాలనే ఉదాత్తమైన ఉద్దేశంతో ఆమె తన పరిశోధన ఫలితాలను లోకానికి నిస్వార్థంగా అంకితం చేశారు. స్వార్థం నిండిన నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె ప్రదర్శించిన ఈ విశాల దృక్పథం, నిజమైన శాస్త్రవేత్తకు ఉండాల్సిన సామాజిక బాధ్యత ఏమిటో చాటి చెబుతుంది.

పురుషాధిక్యత రాజ్యమేలుతున్న నాటి శాస్త్ర సమాజంలో మేడం క్యూరీ ఎదుర్కొన్న అడ్డంకులు అన్నీఇన్నీ కావు. ఫ్రాన్స్‌లో అడుగుపెట్టిన తొలినాళ్లలో అడుగడుగునా వివక్షను ఎదుర్కొన్నప్పటికీ, తన అసాధారణ మేధస్సుతో, కృషితో ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మన్ననలను పొందడంలో ఆమె విజయం సాధించారు. అయితే, మహిళ అయ్యుండి రెండు నోబెల్ బహుమతులు సాధించినా, నాటి సంప్రదాయవాద సమాజం, పత్రికలు ఆమెను ఒక శాస్త్రవేత్తగా గౌరవించడంలో ఎన్నోసార్లు సంకోచించాయి. ఈ ప్రతికూలతలను ఆమె ఎప్పుడూ మాటలతో ఎదుర్కోలేదు; తన అచంచలమైన పరిశోధనా ఫలితాలతో విమర్శకుల నోళ్లు మూయించారు. నేడు విజ్ఞాన శాస్త్ర రంగంలో మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మేడం క్యూరీ వేసిన ఆనాటి బాటలే బలమైన పునాదిగా నిలిచాయి.

మేడం క్యూరీ పరిశోధనల సమయంలో వెలువడిన తీవ్ర రేడియోధార్మికత కారణంగానే అప్లాస్టిక్ అనీమియాతో కన్నుమూశారు. విజ్ఞానం కోసం, మానవాళి శ్రేయస్సు కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణదాయకం. నేటి సైన్స్ సాంకేతిక యుగంలో శాస్త్ర పరిశోధనల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి, ప్రతికూల పరిస్థితులను అధిగమించి లక్ష్యాలను సాధించడానికి మేడం క్యూరీ ఆదర్శం ఎల్లప్పుడూ వెలుగుదివిటీగా నిలుస్తుంది.

సుధాకర్ ఏవి, 9000674747

మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- ఓల్డ్ సిటీ అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- హజ్‌హౌస్ పక్కన అసంపూర్తి భవన నిర్మాణానికి రూ.25 కోట్లు
- మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశాలు మరింత విస్తృతం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : మైనారిటీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ప్రజాభవన్‌లో శుక్రవారం మైనారిటీ సంక్షేమ శాఖపై మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మైనారిటీలకు విద్యా అవకాశాలను మరింత విస్తృతం చేసేందుకు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం, ఆంక్షలు ఉండబోవని భరోసా ఇచ్చారు. నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. విద్యాసంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే పాఠశాలలు, స్టడీ సర్కిళ్లు, ఇతర విద్యాసంస్థలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మొఘల్‌పురా, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రెండు స్టడీ సర్కిళ్లకు సంబంధించి ఉన్న అడ్డంకులను తొలగించాలని జిహెచ్‌ఎంసి అధికారులకు సూచించారు. ఈ రెండు ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్ల నిర్వహణకు అవసరమైన భవనాలను అందించేందుకు అక్బరుద్దీన్ ఒవైసీ సంసిద్ధత వ్యక్తం చేయగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారికంగా సమర్పించాలని ఆయన కోరారు. మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పథకం జాబితాలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. క్రైస్తవ మైనార్టీలకు సంబంధించిన సమస్యలను సైతం పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి.షఫీఉల్లా, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

- గ్లోబల్ టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా జిసిసిలను తీర్చిదిద్దుతాం
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యం
- 'పికో టెక్నాలజీ ఇండియా' ప్రారంభోత్సవంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ స్థాయి పరిశ్రమలు, నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ, యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌ను గ్లోబల్ వాల్యూ క్రియేషన్ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రపంచ కంపెనీలు తమ కీలక కార్యకలాపాలు, పరిశోధన, ఉత్పత్తుల అభివృద్ధికి హైదరాబాద్‌ను ఎంచుకునేలా అన్ని విధాలా అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ఏడాదిలో 100 కొత్త గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జిసిసిలు) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శ్రీధర్ బాబు తెలిపారు. పికో టెక్నాలజీ హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించడం స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి ఐటి, సాంకేతిక సంస్థలకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని, ప్రపంచస్థాయి కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకు రావడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ సమ్మిట్ కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా రహదారుల రంగానికి చెందిన నిపుణులు, ఇంజినీర్లు ఈ సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపకుడు, సిఇఒ జారోడ్ యస్టర్, సిఐఒ జి.సీతారాం, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మాట్ నార్మన్ తదితరులు పాల్గొన్నారు.



పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ : పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి వడ్డీని మాఫీ చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సిపిఐ నియోజకవర్గ సమావేశం కుంభం జయరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని, గ్రామాలలో సాగునీరు, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులో లేకపోవడం వలన రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధార పడుతున్నారని సకాలంలో వర్షాలు కురవక, బోరు బావులు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రతి రేషన్ కార్డుదారునికి 10కిలోల బియ్యంతో పాటు పప్పులు, 19 రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి కూలీలకు కూలీ రేట్లు పెంచాలని, జాబుకార్డు కలిగిన కుటుంబాలకు తగిన పని దినాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నల్గొండ జిల్లాలో 20 కరువు మండలాలను ప్రకటించిందని మరో ఎనిమిది మండలాలను మధ్యంతర కరువు మండలాలు గుర్తించినప్పటికి జిల్లా మొత్తం కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నల్గొండ జిల్లాలో సంపూర్ణ కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు వరికి రూ.40వేలు, పత్తికి రూ. 50వేల ఇచ్చి రైతులను ఆదుకోవాలని అదేవిధంగా పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనొద్దీన్, సిపిఐ మండ ల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, రామస్వామి, వెంకటయ్య, రామాంజనేయులు, వెంకట్రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల వార్డులో కనీస వైద్య సదుపాయాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/వరంగల్: చిన్నపిల్లల వార్డులో కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని, వెంటిలేటర్లు, ఆక్సిజన్, పరికరాలు, ఇంక్యుబేటర్ల సంఖ్య పెంచాలని, చిన్నారుల వైద్య పరీక్షల నివేదికలు సకాలంలో అందించాలని, ఎంజిఎం ఆసుపత్రి పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని ఎంజిఎం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కుమార్తె సయ్యదా అలీజా ఖాద్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి సయ్యదా అలీజా ఖాద్రి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంజిఎం ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు మౌలిక సదుపాయాలు పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితులు ఎంజిఎం ఆసుపత్రిలో నెలకొనడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల వార్డులో సరిపడా వైద్య పరికరాలు పూర్తిస్థాయి వెంటిలేటర్ సదుపాయాలు లేకపోవడం అత్యవసర సమయాల్లో చిన్నారులకు ఆక్సిజన్ అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంజిఎం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి స్వయంగా తీసుకెళ్తానని ఆసుపత్రి అభివృద్ధికి, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, అక్కపెల్లి రమేష్, సంఘీ ఎలేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల శరత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏకాంబ్ర చారి, రాచర్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఐవిఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఐవిఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఐవిఎఫ్ కేంద్రాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అండాల అక్రమ సేకరణ ముఠాతో సంబంధాలు ఉన్న అన్ని ప్రైవేట్ ఐవిఎఫ్ కేంద్రాలను శాశ్వతంగా సీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ కోటిలోని టిజిఎంఎస్ఐడిసి కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ఆదేశించారు. గతంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగిన అక్రమాలను ప్రభుత్వం అరికట్టిందని, తాజాగా అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి పట్టుకున్నామన్నారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరోగసి, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఎఆర్‌టి) చట్టాల అమలును మరింత పటిష్టం చేయడం పట్ల మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

రెండు రోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాబోయే 48 గంటల్లో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉనట్లు అధికారులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ జిల్లాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శని, ఆదివారాల్లో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. ఆదివారం నుండి శుక్రవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు తమ వ్యవసాయ పనులను దానికి అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఇటీవల సంభవించిన రెండు తుఫాన్‌ల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం ఒక్కసారిగా చల్లబడిన విషయం తెల్సిందే. అయితే, రానున్న రోజుల్లో క్రమంగా ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. గత కొన్ని రోజులుగా తుఫాన్‌ల కారణంగా ప్రధానంగా ఈశాన్య జిల్లాల్లో మాత్రమే వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ఆ ప్రభావం పూర్తిగా తగ్గడంతో తిరిగి పొడి వాతావరణం ఏర్పడి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు.

రైళ్లలో బాణసంచా తీసుకెళ్తే జైలుకే!

- ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్: దీపావళి పండుగ వేళ రైలు ప్రయాణాల్లో బాణసంచా, పేలుడు పదార్థాలు తీసుకెళ్తే కఠిన చర్యలు తప్పవని దక్షిణ మధ్య రైల్వే హెచ్చరించింది. రైల్వే స్టేషన్లు, రైళ్లలో నిషేధిత మండే స్వభావం కలిగిన వస్తువులను తీసుకెళ్లడం శిక్షార్హమైన నేరమని స్పష్టం చేసింది. రైల్వే చట్టం–1989లోని సెక్షన్ 164 ప్రకారం రూ.1,000 వరకు జరిమానా లేదా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపింది. పండుగ రద్దీ నేపథ్యంలో రైల్వేస్టేషన్లు, రైళ్లలో భద్రతా తనిఖీలు, నిఘా ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులు బాణసంచా, మండే ద్రవాలు, పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర వస్తువులను వెంట తీసుకెళ్లరాదని సూచించింది. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే రైల్వే అధికారులకు లేదా 139 హెల్ప్‌లైన్‌కు, రైల్ మదద్ ద్వారా సమాచారం అందించాలని కోరింది. సురక్షిత దీపావళి రైలు ప్రయాణానికి ప్రయాణికులు భద్రతా నిబంధనలు పాటించి రైల్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

గౌరవెల్లి పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



ప్రజాపక్షం/హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలంగాణ బిసి రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2007 వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో పునాది వేసి, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి చేసి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు ఉన్న అన్ని కేసులను క్లియరెన్స్ చేసుకుని నిధులు కూడా మంజూరు చేసుకున్నామని భూ నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి కాలువల ద్వారా గ్రామాలకు సాగునీరు అందించే ప్రక్రియలో రైతులు అందరు సహకరించాలని కోరారు. దీనితోపాటు గండిపెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి 14వేల ఎకరాలకు నీళ్లు అందిస్తామని అన్నారు. శ్రీరాం సాగర్ కాల్వల ద్వారా భీమదేవరపెల్లి ప్రాంతానికి దేవాదుల, హుస్నాబాద్ ప్రాంతానికి గౌరవెల్లి ద్వారా సాగు నీరు అందిస్తామని అన్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్‌మానేరు ఫేజ్–3 ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ అలాగే ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భీమా పథకాన్ని ప్రారంభిస్తామని అన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు ఉచితంగా అవసరమైన పరికరాలను అందిస్తామని మండలాల వారీగా పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చితారి పద్మ రవిందర్, సహకార సంఘం చైర్మన్ బొల్లిశెట్టి శివయ్య, గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, పట్టణ అధ్యక్షుడు వివి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు వెన్న రాజుతోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పుష్కరాల పనుల్లో జాప్యం తగదు

- భక్తులకు అన్ని వసతులు కల్పించాలి
- గడువులోగా పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. పుష్కరాల పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి, కోటిలింగాల తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పుష్కరాల అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా ప్రారంభం కాని పనులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా రహదారులు, పుష్కర ఘాట్లు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు వంటి మౌలిక వసతులను సమగ్రంగా కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఘాట్ల వద్ద అత్యవసర వైద్యం, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఒక శాఖ పనుల వల్ల మరో శాఖ పనులకు ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. కాంట్రాక్టర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ధర్మపురికి రూ.226 కోట్లతో అభివృద్ధి..

గోదావరి పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి ప్రాంతంలో రూ.226 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ తదితర సదుపాయాలు ఉన్నాయి. ధర్మపురిలో సుమారు 470 మీటర్ల మేర కొత్త స్నాన ఘాట్ల అభివృద్ధి ప్రతిపాదించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అప్పటిలోగా శాశ్వత, తాత్కాలిక పనులన్నీ పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

చెంచు గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి

- మరిన్ని పనిదినాలు కల్పిస్తాం
- మేట్ల నియామకంతో ఉపాధి పనులు విస్తరిస్తాం
- వలసల నివారణే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : చెంచు గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించడంతో పాటు అవసరమైన మేరకు అదనపు పనిదినాలు కూడా అందిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. చెంచు కుటుంబాలు ఉపాధి కోసం గ్రామాలను విడిచి వలస వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో ఒక్కో గ్రామానికి సగటున 39 మంది కూలీలు హాజరవుతుండగా, చెంచు గ్రామాల్లో ఈ సంఖ్య రాష్ట్ర సగటు కంటే అధికంగా ఉందని అధికారులు మంత్రికి వివరించారు. పద్రా మండలంలో గ్రామానికి సగటున 94 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతుండగా, బల్మూరులో 46 మంది, పెద్దకొత్తపల్లిలో 45 మంది, అమ్రాబాద్‌లో 42 మంది, కొల్లాపూర్‌లో 39 మంది, అచ్చంపేటలో 37 మంది, లింగాలలో 31 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెంచు గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మేట్లను నియమించి ఉపాధి పనుల గుర్తింపు, కూలీల సమీకరణను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి, ఏడాది పొడవునా ఉపాధి అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విబిజి రామ్ జి పథకం కింద అర్హులైన చెంచు కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పిస్తున్నామని, జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు పనులను చేపట్టి స్థానికంగానే ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వివిధ శాఖల సమన్వయంతో ఆమోదం పొందిన పనులను వేగంగా ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చెంచు కుటుంబాలు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే పని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవసరమైన మేరకు అదనపు పనిదినాలు కూడా అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు.

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్‌బినగర్ సర్కిల్-13

షార్ట్ టెండర్ నోటీసు

NIT No. 23/EEC-13/LBNR/MMC/2026-27 తేదీ: 06.11.2026

పని పేరు: నిర్వహణ పనులు - 01 నెం.లు, అంచనా మొత్తం: రూ.1.90 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 06.11.2026న మ.03.00గం.ల నుండి 07.11.2026 మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ.వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి, సెల్ నెం.: 9701365519, ఇతర వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in/లో చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి.

DIPR R.O. No. : 13256-PP/CL/ADVT/2026-27, Date: 06-11-2026

మెదక్ పురపాలక సంఘం కార్యాలయం : మెదక్ జిల్లా

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1) e-NIT Nos. E1/MCM/ CC Road/W.no 12/15th FC/MGF/2026 Dated: 07.11.2026
2) e-NIT Nos. E1/MCM/ CC Road/UGD/W.no 10/15th FC/MGF/2026 Dated: 07.11.2026
3) e-NIT Nos. E1/MCM/ CC Drain/W.no 31/15th FC/MGF/2026 Dated: 07.11.2026
4) e-NIT Nos. E1/MCM/ CC Drain/W.no 27/ 15th FC/MGF/2026 Dated: 07.11.2026
5) e-NIT Nos. E1/MCM/RCC PipelineW.no 29/15th FC/MGF/2026 Dated: 07.11.2026

పనుల సంఖ్య : (5)

బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ : 07-11-2026 ఉదయం 10.30 గంటలకు
బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ : 13-11-2026 సాయంత్రం 04.00 గంటలకు
ధర బిడ్ ప్రారంభ తేదీ (ఫైనాన్షియల్ బిడ్ దశ) : 13-11-2026 సాయంత్రం 04.05 గంటలకు

గమనిక: టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను Tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఇతర వివరాల కోసం కమిషనర్ (లేదా) ఇంజనీర్, మెదక్ మున్సిపాలిటీ, ఫోన్ నెం. 9154293322, 9154293336, 6303678200 ను సంప్రదించండి. టెండర్లను రద్దు చేయడానికి లేదా వాయిదా వేయడానికి కమిషనర్‌కు పూర్తి అధికారం ఉంది.

సం/- కమిషనర్, మెదక్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 13271-PP/CL/ADVT/2026-27, Date: 06-11-2026

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

MMC
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటిరినరి సెక్షన్, ఎంఎంసి.
మెయిల్: ddveterinary.mmc@gmail.com సెల్ నెం: 9989930-397

Lr.No. /DD/VET/MMC/2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 06.11.2026

NIT No. 20/DD/VET/MMC/2026, Item No.1 to 2, తేది: 06.11.2026

Sl. No.	పని పేరు	అంచనా విలువ (రూ.లలో)
1	ఐదు (5) నెలల కాలానికి ఉప్పల్ జోన్‌లోని బోడుప్పల్ మరియు ఘట్‌కేసర్ సర్కిళ్లలో కొత్తగా విలీనం చేయబడిన ప్రాంతాలు - కోడి వ్యర్థాలు మరియు మాంసం, చేపల వ్యాపార దుకాణాలలో వెలువడే వ్యర్థాల శాస్త్రీయ సేకరణ, రవాణా మరియు పారవేయడం - అంచనా వేయబడిన కాంట్రాక్ట్ విలువను నిర్ధారించడం మరియు టెండర్లను పిలవడానికి అనుమతి ఇవ్వడం.	రూ. 10,00,000/-
2	2026-27 సంవత్సరానికి ఎంఎంసి, ఉప్పల్ జోన్‌లో కోతుల బోనుల సేకరణ.	రూ. 6,21,480/-

ఈవెంట్స్	క్ర.నం.1 నుండి 2 కొరకు
డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ	07/11/2026 మ.3.00 గం.లకు
డౌన్‌లోడ్ ముగింపు తేదీ	13/11/2026 మ.3.00 గం.ల వరకు
ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ	13/112026 మ.3.01 గం.లకు

మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.inలో చూడవచ్చు

సం/- డిప్యూటీ డైరెక్టర్ (వెటిరినరి సెక్షన్), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 13264-PP/CL/ADVT/2026-27, Date: 06-11-2026



నిత్యావసరాల ధరలు అరికట్టాలి

10న చలో కలెక్టరేట్ ధర్నాకు సిపిఐ పిలుపు

ప్రజాపక్షం/జవహర్ నగర్ : ఈ నెల 10 న తలపెట్టిన చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర సింహులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, రైతులకు జరుగుతున్న అన్యాయాలను నిలిపివేసి వారికీ తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జరుగుతున్న నష్టాలను అరికట్టాలని, ఎల్ నినో ప్రభావం సాకుగా చూపి ప్రజలపై అదనపు భారం మోపవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఎఐటియుసి నాయకులు, మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, పి.కిరణ్ కుమార్, ఆదర్శనగర్ శాఖ కార్యదర్శి డి.నాగేష్, గిరిప్రసాద్ నగర్ శాఖ సహాయ కార్యదర్శి కె.కురుమయ్య, సిహెచ్. ఎల్లయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు కె. జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



దళితుల ఐక్యతతోనే హక్కుల సాధన

ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఏర్పాటై 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 29,30వ తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం తెలిపారు. మహాసభను విజయవంతం చేసేందుకు జగద్గిరిగుట్టలో ప్రచార కరపత్రాలు, పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నంతో పాటు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనాల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలు,వివక్షను అరికట్టాలంటే దళిత కుల సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వం మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సమానత్వం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 29,30 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు దళితులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పోచమ్మ తల్లి జాతరలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్ : మండల పరిధిలోని సిద్దులూర్ గ్రామంలో కొనసాగుతున్న పోచమ్మ తల్లి 3వ జాతర వార్షికోత్సవాల్లో తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసన సభ్యులు, ముందుగా ఆలయంలో పోచమ్మ తల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పోచమ్మ తల్లి జాతరలో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. గ్రామ సర్పంచు శ్రీనివాస్‌కు, గ్రామ పెద్దలకు, యువకులు,మహిళలకు, గ్రామస్తులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజలందరికీ తల్లి ఆశీస్సులు ఉండాలన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కారిస్తాం:

శుక్రవారం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్వర్యంలో పలువురు దివ్యాంగులు స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సొంత ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజురు చేయాలన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

విద్యార్థుల తాగునీటి సమస్యకు చెక్

ప్రజాపక్షం/తాండూరు: బషీరాబాద్ ఎస్‌సి హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం సాయంత్రం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి నిధుల ద్వారా హాస్టల్‌లో నూతన బోర్ వెల్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థులతో వసతి గృహంలో అందజేస్తున్న భోజన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే సమస్యను గుర్తించి తక్షణమే స్పందించి బోర్‌వెల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కారం అవ్వడంతో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అత్యాచార యత్నం నిందితుడు అరెస్ట్

ప్రజాపక్షం/దుండిగల్ : యువతిపై అత్యాచారయత్నం చేసిన యువకుడిని అరెస్ట్ చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ యెల్లారి బస్తీలో నివసిస్తున్న 19 సంవత్సరాల డిగ్రీ విద్యార్థిని ఇంట్లోకి నిందితుడు రంజాన్ (23) బలవంతంగా ప్రవేశించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందనీ నిందితుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. సుమారు 8 నెలల క్రితం దుండిగల్ ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటూ, రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడనీ బాధితురాలు నిందితుడి ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించిన కారణంగా, గత వారం రోజులుగా నిందితుడు ఆమెను వెంటాడుతూ, బెదిరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందనీ ఈ ఘటనపై 06.11.2026న ఉదయం 10:00 గంటలకు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ ఎం.బాల్ రెడ్డి తెలిపారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించడంతో పాటు, సంబంధిత సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇఎస్ఐ ఆసుపత్రులు

ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం

మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/చర్లపల్లి: పారిశ్రామికవేత్తల సహకారంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. చర్లపల్లి నోటిఫైడ్ ఏరియాస్ సర్వీసు సొసైటీ (సిఎన్ఎంఐఎస్ఎస్)ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్2 ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్కులో 7 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాక్స్ క్రికెట్/ నెట్ క్రికెట్, కార్మికుల సంక్షేమానికి ఇఎస్ఐ ఆసుపత్రిని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టిఫ్ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ గోవిందరెడ్డిలతో కలసి ప్రారంభించారు. ఎన్‌జిఒ సంస్థ డ్రగ్స్ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా చేయాలని మంత్రి ఈ సందర్భంగా ఒప్పందం చేసుకున్న సంస్థకు ఆయన అభినందన లు తెలిపారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం స్థానిక క్రీడాకారుల కు మెరుగైన వేదికను అందించడం వంటి లక్ష్యాలతో ఏర్పాటు చేసిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతో ఉపయోగం గా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షులు తాటి శ్రీనివాస్, సిఐఎ ప్రెసిడెంట్ డిసిరెడ్డి, రాఘవయ్య, దస్తగిరి, ఐలా మాజీ ఐలా చైర్మన్ రోషిరెడ్డి, టిజిఐసి చైర్మన్, ఎండి శశాంక, టిజిఐసి జోనల్ మేనేజర్ మధు, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటల్ విధానాలు షురూ



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో కాగితం పనుల స్థానంలో పూర్తి స్థాయిలో డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, వేగం పెంపొందించే లక్ష్యంగా తొలిదశగా ఈహెచ్‌ఆర్ఎంఎస్, ఈ శాంక్షన్స్, వామిస్ అనే మూడు డిజిటల్ విధానాలపై శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఈ శిక్షణలో పాల్గొన్న 350 మందికి పైగా ఉన్న జిల్లా పే అకౌంట్స్ అధికారులు, వివిధ శాఖాధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు(డిడిఒలు)కు డిజిటల్ విధి విధానాలను వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, ఆర్థిక శాఖ ఈ నెల 2న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర స్థాయిలో కార్యదర్శులు, వివిధ శాఖాధిపతుల కు ఇప్పటికే శిక్షణ పూర్తి కాగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖాధికారులకు అందిస్తున్న ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగుల నియామకాల నుండి పదవీ విరమణ వరకు నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, సెలవులు తదితర సర్వీసు సంబంధిత వివరాలనిన ఈహెచ్‌ఆర్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ప్రభుత్వ వ్యయాలకు సబంధించిన నిధుల మంజూరు, బిల్లుల ప్రక్రియ, శాంక్షన్ ద్వారా, ప్రభుత్వ ప్రజాభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు, సాంకేతిక అనుమతులు, ఒప్పందాలు, పనుల పురోగతి, తదితర అంశాలన్నిటిని వామిస్ ద్వారా డిజిటల్ విధానంలో పర్యవేక్షిస్తుంటారు. కాగితం పనులకు ప్రత్యామ్నాయంగా కొనసాగే ఈ డిజిటల్ విధానం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో జాప్యం తగ్గటమే కాక పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. ఇకపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఈ డిజిటల్ విధానాన్నే అమలు చేయాల్సి ఉంటుందన్నారు.

వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మచ్చబొల్లారం హిందూ స్మశానవాటిక ప్రాంతంలో కొనసాగుతున్న వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తరలించాలన్న స్థానికుల డిమాండ్ మేరకు ప్రత్యామ్నాయ స్థలాలను ఎంపిక చేసేందుకు ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. దీనిలోని భాగంగా ఎంపిక చేసిన స్థలాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, హెల్త్ అండ్ అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌లు అనుకూల ప్రతికూలతల విషయమై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ఎదురవుతున్న సమస్యలతో పాటు నూతనంగా గుర్తించిన ప్రతిపాదిత నాలుగు స్థలాల సానుకూలత తదితర అంశాలను చర్చించారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ హిందూ స్మశానవాటిక ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణ విషయంలో ప్రజల మనోభావాలు, ఇతర సమస్యలను బేరీజు వేసుకొని సరైన నిర్ణయం తీసుకొనేందుకు సమీక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన



ప్రజాపక్షం/ఘట్‌కేసర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తున్నామని పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం పోచారం డివిజన్ పరిధిలో చౌదరిగూ గ్రామంలో నిర్వహించిన పట్ట భద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో కర్రె రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్ట భద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని ఎన్నికల్లో తమ అభిప్రాయన్ని ఓటు ద్వారా వ్యక్తం చేసేందుకు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కేశపువుల వినోద్ కుమార్, బొజిరెడ్డి, పులికంటి భాస్కర్ రెడ్డి, బండ్లగూడ నాగేష్ గౌడ్, శ్రావణ్ నాయక్, కళ్యాణ్ నాయక్‌లు పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ఓటర్లు నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు.


కెపిహెచ్‌బి భూముల అమ్మకాలు అడ్డుకుంటాం



ప్రజాపక్షం / కూకట్‌పల్లి : కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి ప్రాంతాల్లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టొద్దని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కెపిహెచ్‌బి భూముల అమ్మకాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి ప్రాంతాల్లో సుమారు రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు తదితర సదుపాయాలు కల్పించామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను విక్రయించడం సరికాదన్నారు. కెపిహెచ్‌బి వంటి పెద్ద కాలనీలో ఫైర్ స్టేషన్ లేకపోగా, ప్రజలు అవసరాల కోసం పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఉపయోగించాల్సిన స్థలాన్ని సైతం అమ్మకానికి పెట్టేందుకు టెండర్లు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టి లో పెట్టుకుని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్‌బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఐపిఇ హైదరాబాద్ డైరెక్టర్‌గా లింబాద్రి

ప్రజాపక్షం/శామీర్‌పేట్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపిఇ), హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్‌గా ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సచివాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అపారమైన విద్యా పరిపాలన, సంస్థాగత నాయకత్వ అనుభవం ఉన్న మహోన్నత వ్యక్తిగా పేరుపొందారు. ఐపిఇలో డెరెక్టర్‌గా చేరకముందే తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్,హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారి పలు విశిష్ట పదవులు నిర్వహించారు.




ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తాం

ప్రజాపక్షం/జవహర్ నగర్ : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జవహర్ నగర్ 3వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర విఘాతం కలిగింది. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కప్పల శ్రావణ్ కుమార్ తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ (బిజెపి) తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ సమక్షంలో ఆయన పార్టీలో చేరగా, కప్పల శ్రావణ్ కుమార్‌కు ఎంపి ఈటల బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కప్పల శ్రావణ్ కుమార్ వంటి క్రియాశీలక నాయకులు అనుచరులతో కలిసి బిజెపిలో చేరడం వల్ల జవహర్ నగర్ ప్రాంతంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగి, పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడికి అభినందనలు

ప్రజాపక్షం/శామీర్‌పేట్: శామీర్‌పేట్ డివిజన్ తూముకుంట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల వెంకట్‌రెడ్డి పదవీ విరమణ అభినందన సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శామీర్‌పేట్ మండల విద్యాధికారి కమలాకర్, జిల్లా ఆర్‌డిఒ మెంబర్ జైపాల్‌రెడ్డి, టిఎస్‌జిహెచ్‌ఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యప్రసాద్‌లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా చల్ల వెంకట్‌రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. చల్ల వెంకట్‌రెడ్డి దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు తిరుమలేష్, సత్తిరెడ్డి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.





అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవు

సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : ఎల్‌నినో ప్రభావం, దిగుబడి తగ్గిందనే కారణాలతో గతంలో పండిన పంట నుంచి వచ్చిన బియ్యాన్ని నిర్ణయించిన ధరలకు విక్రయించకుండా అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. అధిక ధరలకు బియ్యం విక్రయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే కొందరు వ్యాపారులు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తారనే భయంతో ఉదయం వేళల్లో దుకాణాలు మూసివేసి, సాయంత్రం సమయంలో అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమ విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బియ్యం బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని, బ్లాక్ మార్కెట్ దందాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం, రేషన్, నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర సమితి సభ్యుడు కె.ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, ఉఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి, సిపిఐ నాయకులు జానకిరామ్, ఇమామ్, నారాయణ, నరసింహ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల ఆశయ సాధనకు అంకితమవుదాం

పిఒడబ్ల్యు (విముక్తి) పిలుపు

ప్రజాపక్షం/జవహర్ నగర్: దళారీ, భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో అమరులైన వీరుల ఆశయాలను, జైలు కామ్రేడ్స్ లక్ష్యాలను నెరవేర్చడానికి పీడిత ప్రజలంతా అంకితభావంతో ముందుకు సాగాలని పి వో డబ్ల్యు (విముక్తి) తెలుగు రాష్ట్రాల కన్వీనర్ గడిపే సునీత పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్‌లోని దళిత సంక్షేమ భవనంలో సిపిఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ సంస్థ పిఒడబ్ల్యు (విముక్తి) హైదరాబాద్ జంటనగరాల కన్వీనర్ తుమ్మరాణి అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గడిపే సునీత మాట్లాడుతూ, దళారీ పాలకవర్గాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ, మార్క్సిజం–లెనినిజం మావో ఆలోచనా విధానంతో గోదావరిలోయ ప్రతిఘటన సిద్ధాంత పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇఫ్టు జాతీయ కన్వీనర్ షేక్ షావలి మాట్లాడుతూ, జవహర్ నగర్ డంపింగ్ యార్డు వలన కలిగే ప్రమాద తీవ్రతను ముందుగానే గ్రహించి 2001 నుండి 2006 వరకు పోరాడిన ధీరవనిత, శ్రామిక మహిళా నాయకురాలు కామ్రేడ్ బండి రమణక్క అని కొనియాడారు. అనంతరం పోరాటాల్లో ప్రాణాలు వదిలిన పలువురు నాయకులకు, భూటకపు ఎన్‌కౌంటర్ బాధితులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.



ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు

ప్రజాపక్షం /కొడంగల్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 7నుండి 9వరకు మూడు రోజుల పాటు మెగా రైతు మేళాకు రానున్న నేపథ్యంలో పట్టిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దీపక్‌తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్‌పి స్నేహమెహ్రా, హకీంపట్‌లో నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా హెలిప్యాడ్‌ను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లు ట్రాఫిక్ నియంత్రణ, వైద్యం సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. అగ్నిమాపక వాహనాన్ని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా తగిన ప్రదేశంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్యాఅరోగ్యశాఖ అధికారులు వైద్యసిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అదనపు ఎస్‌పి రాజేష్‌మీనా, డిఎస్‌పి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివశక్తి నగర్‌లో 20 లక్షల రూపాయల తో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాప న చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని, ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు యుజిడి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమలో అధికారులు, నాయకులు పరశురాములు, శ్రీనివాస్, సత్తయ్య, ప్రేమ్, నాయక్, తదితరులు పాల్గొన్నారు.



లకిడికాపూల్ ట్రాఫిక్ చిక్కులకు వన్‌వేతో చెక్!

రద్దీ రహదారులపై కొత్త ట్రాఫిక్ ప్రణాళిక..
బైక్‌పై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన
సి.పి.సజ్జనర్
కెబిఆర్ పార్క్ మార్గంలో
అదనపు లేన్ ఏర్పాటుకు నిర్ణయం





ప్రజాపక్షం/హైదరాబాద్ : నిత్యం వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయే లకిడికాపూల్ పరిసరాల్లో ట్రాఫిక్ చిక్కులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ప్రయాణ సమయాన్ని తగ్గించే లక్ష్యంతో ఆ ప్రాంతంలో కొత్తగా వన్‌వే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. ప్రతిపాదిత మార్గాల సాధ్యాసాధ్యాలను స్వయంగా పరిశీలించేందుకు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ శుక్రవారం బైక్‌పై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ట్రాఫిక్ జాయింట్ సిపి డి.జోయెల్ డేవిస్, డిసిపి అవినాశ్ కుమార్‌తో కలిసి ద్వారకా హోటల్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్‌డిఎఫ్‌సి జంక్షన్, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, లక్డీకాపూల్ చౌరస్తా, ఓల్ కంట్రోల్ రూమ్ జంక్షన్ పరిధిలోని రహదారులను పరిశీలించారు. వాహనాల రద్దీ, రహదారుల స్థితిగతులను అధ్యయనం చేసి ప్రమాదాల నివారణకు, వాహనాలు నిలిచిపోకుండా రాకపోకలు సాగేందుకు పలు సూచనలు చేశారు. ప్రతిపాదిత వన్‌వే ప్రణాళికలో భాగంగా ఓల్ కంట్రోల్ రూమ్ నుంచి రవీంద్రభారతి మీదుగా ఇక్బాల్ మినార్ వైపు వెళ్లి సికింద్రాబాద్ చేరుకునే వాహనాలను రవీంద్రభారతి నుంచి నేరుగా అనుమతించకుండా హెచ్‌డిఎఫ్‌సి, పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్, ఇక్బాల్‌మినార్, సచివాలయం జంక్షన్ మీదుగా మళ్లించాలని ప్రతిపాదించారు. నిరంకారీ జంక్షన్ నుంచి ఓల్ కంట్రోల్ రూమ్ వైపు వెళ్లే వాహనాలను హెచ్‌డిఎఫ్‌సి జంక్షన్ వైపు నేరుగా పంపకుండా పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మళ్లించి, ఇక్బాల్ మినార్ మీదుగా రవీంద్రభారతి వైపు పంపనున్నారు. సచివాలయం జంక్షన్, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ నుంచి పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రతిపాదించారు. ఇక్బాల్ మినార్ నుంచి రవీంద్రభారతి వైపు వెళ్లి, ఓల్ కంట్రోల్ రూమ్ వద్ద యూటర్న్ తీసుకుని అసెంబ్లీ గేట్ నంబర్ 3, రవీంద్రభారతి, హెచ్‌డిఎఫ్‌సి మీదుగా పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లేలా మార్గాలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలపై త్వరలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖతో పాటు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సిపి సజ్జనర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తొలుత ప్రయోగాత్మకంగా వన్‌వే విధానాన్ని అమలు చేసి, అనంతరం శాశ్వత అమలుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నగరంలోని ఇతర రద్దీ ప్రాంతాల్లోనూ అవసరాన్ని బట్టి వన్‌వే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

కెబిఆర్ పార్క్ వద్ద మరో ట్రాఫిక్ లేన్..

లక్డీకాపూల్ పరిశీలన అనంతరం ఇప్పటికే వన్‌వే అమల్లో ఉన్న కెబిఆర్ పార్క్ మార్గాన్ని కూడా సిపి సజ్జనర్ బైక్‌పై తిరిగి పరిశీలించారు. అక్కడ వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగేందుకు ప్రస్తుతం ఉన్న వన్‌వే మార్గానికి అదనంగా మరో ట్రాఫిక్ లేన్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు.అదనపు లేన్ ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న భూగర్భ పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు తదితర యుటిలిటీలను యుద్ధప్రాతిపదికన తరలించేందుకు సంబంధిత విభాగాలు చర్యలు తీసుకుంటాయని వివరించారు. కెబిఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ట్రాఫిక్ విభాగం, జీహెచ్‌ఎంసీ, నిర్మాణ సంస్థలు సమన్వయం తో పనిచేస్తున్నాయన్నారు. నగరంలో ట్రాఫిక్‌ను శాస్త్రీయంగా నియంత్రించేందుకు నిపుణులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని సిపి తెలిపారు. మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ, సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టినప్పుడే సమాజంలో గుర్తింపు



ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబబెట్టినప్పుడే సమాజంలో గుర్తింపు లభించే అస్కారం ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటి పరిధిలోని పరిగి రోడ్డులో నిర్వాహకులు అరుణ్‌కుమార్, దుర్గేష్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మటన్, చికెన్ మార్ట్ దుకాణాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఇతరులకు ఉపాధి అవకాశాలు చూపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, కౌన్సిలర్లు సంతోషిబాయి చందులాల్, మురళీ మోహన్ (అప్పి), కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, ముబారక్ అలీఖాన్, కత్తి చంద్రశేఖర్ అప్ప, అంబటి రాజు మాధవులు యాదవ్ పాల్గొన్నారు.

రైతులు ఆగ్రో ఫారెస్ట్రీ విధానాన్ని అలవర్చుకోవాలి



ప్రజాపక్షం/యాచారం : రైతులు వ్యవసాయ రంగంలో ఆగ్రో ఫారెస్ట్రీ (అటవీ మొక్కల) సాగు విధానాన్ని అనుసరించాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆగ్రో ఫారెస్ట్రీ పంటల సాగు వాటి ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యానవన ఎడిహెచ్ అరుణ, సిఎస్ఎ సభ్యులు రాంబాబు,ఉద్యానవన శాఖ అధికారి నవీనా, మండల వ్యవసాయాధికారి అర్ రవినాధ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాల్ సర్పంచ్



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్, ఉప సర్పంచ్ మల్లమ్మతో బాటు వివిధ పార్టీలకు చెందిన దాదాపు 50 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఇబ్రాహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎంఎల్‌ఎ పార్టీ శాలువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం, మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి మహిపాల్, పోలమోని రామ కృష్ణ, పాశం జయప్రకాశ్, లిక్కి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ జాంగిర్ , మురళి, గాలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం..పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



ప్రజాపక్షం/కొత్తూరు: ప్రజల ఆరోగ్య భద్రతతోపాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఎస్సీ, ఎస్టి కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్ అన్నారు. శుక్రవారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో తీసుకువచ్చిన 641జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు కేశంపేట మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జెఏసి నాయకులు పినపాక ప్రభాకర్, కోచైర్మన్లు ఎమ్మె సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే బాలయ్య, కో కన్వీనర్ గని మహేష్, గ్రామ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధరాచారి, నరేందర్‌రెడ్డి, సంగెం సర్పంచ్ వేణుగోపాల్, నవీన్ పాల్గొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు



ప్రజాపక్షం/షాద్‌నగర్: వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యాపాకం చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పరిగి రోడ్డులో అరుణ్‌కుమార్, దుర్గేష్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన మన చికెన్, మటన్ మార్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, బిఎస్ సుధీర్, వాణి పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, చింటూ ప్రతాప్ రెడ్డి, పాలమాకుల చెన్నయ్య, నందకిషోర్, బిఆర్ఎస్ నాయకులు శ్రీపాల్ రెడ్డి, దినేష్ సాగర్, బషీర్, యాదగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగ్, శంకర్, ప్రకాష్, మురళీ, లడ్డు, మల్లేష్‌లు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించేందుకే పంటల నష్ట సర్వేలు

ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేందుకే గ్రామాల్లో సర్వేలు చేపట్టినట్లు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికాని నిశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుల, ఉప్పరిగడ్డ, వెల్‌జర్ల గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించి వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించి సర్వేలు చేపట్టి వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు, గోవర్ధన్, ప్రణీత పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగంగా చేసుకోవాలి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగులు, సిబ్బంది క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సూచించారు. ఉద్యోగులు, సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ మీట్–2026 శుక్రవారం చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్(విపిజి)లో ముగింపు కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅథిగా హాజరయ్యారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి అదనపు కమిషనర్ (క్రీడలు) ఉదయ్ కుమార్, గోషామహల్ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది విధులతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, ఒత్తిడిని తగ్గించి విధుల్లో సామర్థ్యాన్ని, ఉత్పాదకతను మెరుగుపరుస్తాయని తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడా కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ మీట్2026ను విజయవంతం చేసిన అధికారులు, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ప్రజాపక్షం/హైదరాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీ బాయి అన్నారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని నాగోల్ శ్రీచైతన్య మెట్రో క్యాంపస్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థలు, ఎన్‌టిఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్స్, కళాశాలలకు చెందిన 600 మందికి పైగా సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ జోన్ అడిషనల్ డిసిపి ఎన్.వెంకటరమణ, ఎసిపి వై.వెంకటరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ వై.రామలింగారెడ్డిలతో పాటు ప్రముఖ సినీ నటుడు దిల్ రమేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన, ఎగ్జిక్యూటివ్ ఎజిఎం సిహెచ్ శ్రీధర్, ఎజిఎం విజయకుమార్, డీన్ జగదీష్ పాల్గొన్నారు.

కరువు రైతులకు రుణ ఉపశమనం కల్పించాలి

బ్యాంకర్లకు అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచన



ప్రజాపక్షం/రంగారెడ్డి: కరువు ప్రభావంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని, అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక రుణాలుగా పునర్వ్యవస్థీకరించి ఉపశమనం కల్పించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సూచించారు. కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మార్గదర్శకత్వంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి.ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 18 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, వాటిలో 5 తీవ్ర కరువు ప్రభావిత మండలాలు, 13 మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యస్థ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల మారటోరియం అనంతరం అదనంగా 24 నెలల వరకు, తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో 12 నెలల మారటోరియం అనంతరం అదనంగా 48 నెలల వరకు రుణ చెల్లింపు గడువు కల్పించే విధానం అమలు చేయాలని వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి అర్హులైన రైతులను గుర్తించాలని, రుణ పునర్వ్యవస్థీకరణ వల్ల కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని కోరారు. రైతులకు అవసరమైన తాజా రుణాలను కూడా సకాలంలో అందించాలని సూచించారు. ఆర్ బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ రుణాల పునర్వ్యవస్థీకరణ విధానం, అర్హతలు, అమలు ప్రక్రియను వివరించారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ హర్ష రైతులకు అందించాల్సిన రుణ ఉపశమన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పిడి డిఆర్‌డిఎ ఎల్.శ్రీలత, మెప్మా పిడి వెంకటనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సుజాత పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల వేధింపులతోనే వైష్ణవి ఆత్మహత్య?
విద్యార్థుల ఆందోళన



ప్రజాపక్షం/రంగారెడ్డి: మొయినాబాద్ మండలంలోని జెబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ల వేధింపుల కారణంగానే ఎఐడిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న సి.వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడిందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వనపర్తి పట్టణంలోని పెద్దగూడెం మహారాజుల కాలనీకి చెందిన వైష్ణవి ఈనెల 3న తన స్వగ్రామంలోని నివాసంలో ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాలలో కొందరు ప్రొఫెసర్లు తరగతి గదిలో విద్యార్థినులతో అవమానకరంగా మాట్లాడటమే కాకుండా, బెంచీలపై నిలబెట్టి తోటి విద్యార్థుల ఎదుట అవమానించేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన వైష్ణవి ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రొఫెసర్ల వేధింపులే తన మృతికి కారణమని పేర్కొంటూ ఆమె సూసైడ్ లేఖ రాసినట్లు సమాచారం. అయితే, ఈ ఘటనపై వైష్ణవి తల్లిదండ్రులు ఇప్పటివరకు తమ స్వగ్రామం అయిన వనపర్తిలో గానీ, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయలేదనే సమాచారం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు, విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్లను నిలదీయడంతో కళాశాల ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నది. దీంతో కళాశాల యాజమాన్యం అర్ధాంతరంగా కళాశాలకు సెలవు ప్రకటించి, విద్యార్థులను బస్సులలో బయటకు పంపించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. వైష్ణవి మృతికి కారణమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫసర్లను వెంటనే కళాశాల నుంచి తొలగించాలని, వారిపై విచారణ జరిపి చట్టపరమయిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి, అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లులే లక్ష్యంగా చోరీలు

నిందితుడిని పట్టుకున్న వనస్థలిపురం పోలీసులు

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : తాళం వేసిన ఇళ్లులే లక్ష్యంగా రాత్రి సమయంలో వరుస చోరీలకు పాల్పడుతున్న నేరస్తుడిని వనస్థలిపురం ఎట్టకేలకు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురంలోని విజయపురి కాలనీ ఫేజ్1కు చెందిన జనార్ధన్‌రావు దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 17న ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లారు. తిరిగి 22న వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పాటు ఇంట్లో బీరువాలు ధ్వంసం చేసి ఉన్నాయని గుర్తించాడు. ఇంట్లో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారం అభరణాలు, ఎటిఎం కార్డులు, నగదు అపహరణకు గురైనట్లు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు ఏర్పడి కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 5న ఎన్జీవోస్ కాలనీలోని ఓ నగల దుకాణం సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ఎర్రంశెట్టి చరణ్ విఘ్నేష్ అలియాస్ చరణ్ (25)ను వనస్థలిపురం పోలీసులు అదుపులో తీసుకున్నారు. వనస్థలిపురం అతడిని అదుపులో తీసుకొని విచారణ చేయడంతో చరణ్ నేరాలకు పాల్పడినట్లు వెల్లడించాడు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లలే టార్గెట్ చేసుకోవడం జరిగిందని నేరస్తుడు ఒప్పుకున్నాడు. విచారణలో వనస్థలిపురం, కీసర, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన చోరీ కేసుల్లో అతడి హస్తం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితుడి నుంచి 11 గ్రాముల బంగారం, ఒక ఉంగరం, 15 గ్రాముల బంగారు చెవి అభరణాలు, మట్టెలు కలిపి మొత్తం 26 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు వన్ ప్లెస్ సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొమ్ము విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితుడిపై కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, సరూర్ నగర్‌లో ఒక కేసు, వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఎల్‌బి.నగర్ డిసిపి బి.అనురాధ పర్యవేక్షణతో వనస్థలిపురం ఎసిపి. టి.కరుణాకర్‌రావు, ఇన్‌స్పెక్టర్ ఎస్.రవిబాబు, డి.ఐ. భుక్య రాజేష్ నాయక్, ఎస్ఐ వి.రవి క్రైమ్ టీం సిబ్బంది సమన్వయంలో కేసును ఛేదించిన పోలీసులను మల్కాజిగిరి కమిషనర్ బి.సుమతి అభినంధించారు.

భూగర్భ డ్రైనేజీ పనులు మంజూరు చేయాలి

జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు
మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి వినతి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లో నూతన భూగర్భ డ్రైనేజీపనులు మంజూరు చేయాలని జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను శుక్రవారం వారి కార్యాలయంలో బిఎన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మర్యదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో డ్రైనేజీ సమస్యల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జలమండలి ఇడి దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరతోనే కాలనీల్లో పర్యాటించి సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఇడి తెలిపినట్లు లచ్చిరెడ్డి తెలిపారు.

కల్తీ పాల దందా గుట్టు రట్టు



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం: కల్తీ పాల తయారి కేంద్రంపై ఎస్ఒటి పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకున్న సంఘటన ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. మండల పరిధిలో పోచారం గ్రామంలో పాల వ్యాపారి అండె శ్రీశైలం(43) గ్రామం లో రహస్యంగా కల్తీ పాలు తయారు చేసి నగరానికి తరలిస్తున్నాడనే పక్కా సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఒటి పోలీసులు దాడి చేసి 100 లీటర్ల కల్తీ పాలు,1 లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్, 35దోల్‌పూర్ పాల పొడి పాకెట్లతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకోని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్ప చెప్పారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

చెల్లింపులు జరగకపోవడంతో పరిహారంలో వ్యత్యాసం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: భూసేకరణకు 2020లోనే అవార్డు జారీ చేసినప్పటికీ, నిధుల చెల్లింపులు జరగకపోవడంతో పరిహారం విషయంలో వ్యత్యాసం ఏర్పడిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలంలోని వెంకటాపురం రిజర్వాయర్‌కు సంబంధించి సుమారు 1,056 ఎకరాల భూసేకరణకు 2020లోనే అవార్డు జారీ చేసినప్పటికీ, నిధుల చెల్లింపులు జరగకపోవడంతో ప్రస్తుతం పరిహారం విషయంలో వ్యత్యాసం ఏర్పడిందని వివరించారు. ఆరేళ్లు గడిచిన నేపథ్యంలో భూయజమానులతో తిరిగి చర్చలు జరిపి, నిబంధనల ప్రకారం రీఅవార్డు జారీ చేసే అంశాన్ని పరిశీలించాల్సి ఉందన్నారు. మొండిగౌరెల్లికి సంబంధించిన భూసేకరణ కేసులో ఇటీవల అవార్డు జారీ చేశామని, పరిహారం చెల్లింపులు చేపడతామని అధికారులు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా శాఖల పనితీరును ప్రతి వారం సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి తన పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రతి రోజూ సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్, విద్యాశాఖలు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల అర్బన్, రూరల్ బిల్లుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బీబీజీరామ్ పనులను రోజువారీగా సమీక్షిస్తూ ఏపీవోలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్‌మోహన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, మిషన్ భగీరథ ఇఇ ఆర్.రాజేశ్వర్ రావు, జిల్లా గృహ నిర్మాణశాఖ పిడి చాంప్లానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, మైనింగ్ శాఖఅధికారి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రష్యా సైన్యంలోకి ఆకర్షించే ఆఫర్లను నమ్మొద్దు

భారత యువతకు ఐఎల్‌పియు విజ్ఞప్తి



ప్రజాపక్షం /హిమాయత్‌నగర్: విదేశీ ఉద్యోగాల పేరిట భారతీయ యువతను రష్యా సైన్యంలోకి ఆకర్షించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంటర్నేషనల్ లీగల్ ప్రాసెసింగ్ యూనిట్ (ఐఎల్‌పియు) డైరెక్టర్, అంతర్జాతీయ న్యాయవాది, ఇంటర్నేషనల్ బార్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కరణం రాజేశ్ కుమార్, ఐఎల్‌పియు ముఖ్య న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎపి,తెలంగాణ రాష్ట్రాల యువత అధిక వేతనాలు, సులభ వీసాలు, శాశ్వత నివాస హామీలు, సైనిక నియామకాలు, రష్యన్ యువతులతో వివాహం పేరిట వచ్చే అనుమానాస్పద ఆఫర్ల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. సెప్టెంబర్ 30న భారత విదేశాంగ మంత్రిత్వశాఖ విడుదల చేసిన హెచ్చరికను ప్రస్తావిస్తూ రష్యా సాయుధ దళాల్లో చేరడం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీయవచ్చని, అనధికార ఏజెంట్ల ఉద్యోగ ఆఫర్లను నమ్మొద్దని ఆయన కోరారు. సమావేశంలో ఐఎల్‌పియు సభ్యులు మారతేజ, కాటెపాక సురేశ్, దీక్షిత, పూజిత,లోకేశ్, శిరీష పాల్గొన్నారు.

రేషన్ షాప్ తనిఖీ



ప్రజాపక్షం/కంటోన్మెంట్: రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కోరారు. ఈ క్రమంలోనే వార్డ్ నెం:5 పరిధిలోని శేషాచల కాలనీలోని రేషన్ షాప్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ సరుకుల పంపిణీ విధానం, బియ్యం నాణ్యత, ఇతర నిత్యావసర సరుకుల గురించి అక్కడికి వచ్చిన లబ్ధిదారులతో, ముఖ్యంగా మహిళలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

గడువు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/వెంగళరావునగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని ఎఐసిసి జాతీయ కోఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్ వెంచర్ త్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రవిశేఖర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగళ్ల నరసింహారావు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓట్ల నమోదు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళ్యాణ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగళ్ల నరసింహారావు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు వినోద్, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల కోసం కృషి చేస్తా



ప్రజాపక్షం/ఖైరతాబాద్: చట్టసభల్లో పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల స్వతంత్ర అభ్యర్థి ప్రజా ఉద్యమకారుడు, హైకోర్టు న్యాయవాది డా.నల్లమాసు కృష్ణగౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివిధ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. పట్టభద్రులు, విద్యార్థులు, యువజనులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తనకు మద్దతుగా నిలిచి ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ప్రమాదం

తీరుమార్చుకోని జలమండలి అధికారులు?

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: తప్పులు చేస్తున్న జలమండలి అధికారులపై ఎంఎయూడి ఎటువంటి చర్యలు చేపడుతోంది? అంటే శూన్యమని చెప్పవచ్చు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రమాదాల బారినపడుతున్నా, మరణిస్తున్నా.. జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అంటే సమాధానం లభించడం లేదు. ఇక ఎల్‌నినో నేపథ్యంలో వారియర్స్‌గా ముందుంటున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మనుషులుగా కూడా చూడటం లేదు. ఇందుకు ఉదాహరణగా ఎలక్ట్రీషియన్ సురేష్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. వాటర్ బోర్డుకు డివిజన్11 అధికారులు, కాంట్రాక్టర్ల వేధింపుల కారణంగానే నరసర్లపల్లి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్ ప్రమాదానికి గురైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఎలక్ట్రీషియన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్‌ని ఇటీవల సమాచారం ఇవ్వకుండా మధ్యాహ్నం ఇంటికి వెళ్లారనే కారణంతో కాంట్రాక్టర్ షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది. అందుకు సురేశ్ సమాధానం ఇవ్వగా.. సంతృప్తి చెందని కాంట్రాక్టర్ రెండో షోకాజ్ నోటీసు ఇవ్వగా.. దానికి కూడా జవాబు ఇవ్వడంతో సంతృప్తి చెందని కాంట్రాక్టర్ పర్సనల్‌గా మాట్లాడాలని అధికారుల చేత సాహెబ్‌నగర్ పిలిపించారు. సాహెబ్‌నగర్ డివిజన్ ఆఫీస్‌కి ఉదయం రాగా.. అక్కడ సంబంధిత అధికారులు లేకపోవటంతో ఫోన్ చెయ్యడంతో మేము మాల్‌లో ఉన్నాము.. అక్కడికి రమ్మని చెప్పారు. దీంతో సురేష్ మాల్ వెళుతున్న క్రమంలో యాచారంమాల్ మార్గ మధ్యలో ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో సురేష్ కాళ్ల వేళ్లు విరిగిపోయాయి. అనంతరం ఆయన చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరడం జరిగింది. ఈ నేపథ్యంలోనే సురేష్ వ్యవహారంలో బాధ్యులు ఎవరు? ఎందుకని ఇంతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వేధిస్తున్నారు? అనేది తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న జలమండలి ఎండి అశోక్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలనిబాధిత ఉద్యోగులు కోరుతున్నారు.

ఎనిమిది ప్రధాన రహదారుల అభివృద్ధికి..

ఎంఎంసి స్థాయీసంఘం గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం/హైదరాబాద్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) 9వ సాధారణ స్థాయీసంఘం సమావేశంలో మొత్తం 13 అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ఎంఎంసి ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాలు తీసుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో 30 మీటర్ల వెడల్పుతో ఎనిమిది ప్రధాన రహదారుల అభివృద్ధి, యాప్రాల్ కౌకూర్ రోడ్డు అభివృద్ధి ప్రణాళికకు ఆమోదం లభించగా, అవసరమైన భూసేకరణ చర్యలను నిబంధనల ప్రకారం చేపట్టాలని నిర్ణయించారు. అలాగే అర్హులైన మున్సిపల్ ఉద్యోగులకు డి.ఎ, పెన్షనర్లకు డిఆర్ పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఫతుల్లాగూడ యానిమల్ కేర్ సెంటర్‌లో వెటర్నరీ డయాగ్నస్టిక్ ల్యాబ్ ఏర్పాటు, వీధి కుక్కల జనాభా నియంత్రణలో భాగంగా నిర్వహించే ఏబిసి శస్త్రచికిత్సలకు ప్రైవేట్ వెటర్నరీ వైద్యుల గౌరవ వేతనాన్ని ఒక్కో శస్త్రచికిత్సకు రూ.200 నుంచి రూ.300కు పెంచడం, కీసర, ఘట్‌కేసర్, కాప్రా, బోడుప్పల్, నాగోల్ ప్రాంతాల్లో ఐదు సీనియర్ సిటిజన్ డే కేర్ కేంద్రాల ఏర్పాటుకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. రహదారి మౌలిక సదుపాయాల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, వెటర్నరీ సేవల బలోపేతం, సీనియర్ సిటిజన్‌లకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలను సంబంధిత శాఖలు నిబంధనల ప్రకారం అమలు చేయనున్నాయి.

ధన త్రయోదశి పూజలు



ప్రజాపక్షం/చార్మినార్: కార్తీక మాసం శుక్రవారం ధన త్రయోదశి పర్వదినాన భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు చార్మినార్ భాగలక్ష్మి అమ్మవారిని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.

మచ్చ బొల్లారం ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపుపై..

విజయ భారతి క్షేత్రస్థాయి పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్ : మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో ఉన్న వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించే ప్రతిపాదనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సభ్యురాలు విజయ భారతి సయాని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను ఆమె సందర్శించి, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఏర్పాటుకు వాటి అనుకూలతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తదితర అధికారులు ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ స్థలాల వివరాలను ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యురాలికి వివరించారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతతో పాటు స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసే అంశంపై ఈ పరిశీలన ప్రధానంగా దృష్టి సారించారు.

నాలుగు డివిజన్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలి

జిహెచ్ఎంసి కమిషనర్‌ను కోరిన బిజెపి నేత పొన్నా వెంకటరమణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : శాలిబండ, హరిబౌలి, జంగంమేట్, కాద్రిచమాన్ నాలుగు డివిజన్‌ల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను బిజెపి భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యాక్షుడు పొన్నా వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిహెచ్ఎంసి కమిషనర్‌ను కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా డివిజన్‌లలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమీక్షించిన అంశాలలో ప్రధానంగా సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఎస్‌డబ్ల్యూజి పైప్‌లైన్‌ల ఏర్పాటు, ఓపెన్ జిమ్‌లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల అభివృద్ధి, ప్లేగ్రౌండ్‌లలో మహిళల కోసం ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, అలాగే విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. నాలుగు డివిజన్‌ల ప్రజల సంక్షేమాన్ని, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత పనులకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసి, పనులను వేగవంతంగా ప్రారంభించాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వారు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సరసమైన ధరలకే నాణ్యమైన బియ్యం

హైదరాబాద్ జిల్లాలో 11 ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు

మలక్‌పేటలో ప్రారంభించిన సివిఇఒ శశిధర్‌రాజు





ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: సామాన్య ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన బియ్యం అందించేందుకు హైదరాబాద్ జిల్లాలోని తొమ్మిది సర్కిళ్లలో 11ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సివిఇఒ శశిధర్ రాజు తెలిపారు. వీటి ఏర్పాటులో భాగంగా శుక్రవారం మలక్‌పేట మార్కెట్‌లో బియ్యం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శశిధర్‌రాజు మాట్లాడుతూ ఇటీవల మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న కారణంగా సామాన్య ప్రజల కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలో కొనసాగుతున్న సాధారణ, హోల్‌సేల్, రిటైల్ బియ్యం విక్రయ కేంద్రాలకు అదనంగా వీటిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రత్యేక బియ్యం కేంద్రాలు అదనపు విక్రయ సౌకర్యంగా పనిచేస్తూ వివిధ రకాల బియ్యాన్ని సరసమైన ధరలకు కొనుగోలు చేసే సౌకర్యాన్ని వినియోగదారులకు కలిగిస్తాయని ఆయన తెలిపారు. వీటి వల్ల మార్కెట్‌లో బియ్యం లభ్యత పెరగడంతో పాటు వినియోగదారులకు ధరల పరంగా ఉపశమనం కలుగుతుందన్నారు. మలక్‌పేట సర్కిల్‌లో రెండు కేంద్రాలు, యాకుత్‌పురాలో ఒక కేంద్రం, చార్మినార్‌లో ఒకటి, నాంపల్లిలో ఒకటి, మెహిది పట్నంలో రెండు, అంబర్‌పేట, ఖైరతాబాద్, బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్లలో ఒక్కోటి చొప్పున ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కేంద్రాలలో బియ్యం రకాలు, వాటి ధరలు, నిల్వల వివరాలను స్పష్టంగా ప్రదర్శిస్తారని తెలిపారు. డిసిఎస్ఒ శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక ధరలకు బియ్యం విక్రయించినా, ఇతర అక్రమాలకు పాల్పడినా వినియోగదారులు పౌరసరఫరా అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్ సాగర్ డైవర్షన్ నాలా కబ్జా యత్నం

- తిప్పికొట్టిన హైడ్రా
- వాహనాలు సీజ్
- స్థానిక పోలీసులకు అప్పగింత



ప్రజాపక్షం/హైదరాబాద్ : జీడీమెట్ల సుభాష్ నగర్‌లోని ఫాక్స్ సాగర్ చెరువు పరిధిలోని డైవర్షన్ నాలా కబ్జా యత్నాలను 'హైడ్రా' అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఫాక్స్ సాగర్ తూము సమీపంలో కొందరు అక్రమార్కులు జెసిబి, టిప్పర్, ట్రాక్టర్‌ల సహాయంతో మట్టి, నిర్మాణ వ్యర్థాలను నాలా ప్రాంతంలో డంపింగ్ చేస్తుండగా అధికారులు నేరుగా పట్టుకున్నారు. వెంటనే హైడ్రా బృందం అక్రమ డంపింగ్‌ను నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన జెసిబితో పాటు టిప్పర్ (టిఎస్ 12 యుబి 6476), ట్రాక్టర్ (టిఎస్ 19 టివి 1588) వాహనాలను సీజ్ చేసింది. అనంతరం సీజ్ చేసిన వాహనాలతో పాటు వాటి యజమానులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు నాలాలో వేసిన మట్టిని వెనువెంటనే తొలగించే పనులను హైడ్రా చేపట్టింది. చెరువు పునరుద్ధరణ చర్యల్లో భాగంగా ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కట్టతో పాటు ఒక ఫామ్‌హౌస్‌కు మార్గంగా వేసిన సిమెంట్ రోడ్డును కూడా అధికారులు పూర్తిగా తొలగించారు.

పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి హామీ పథకం అమలు చేయాలి



ప్రజాపక్షం/ఖైరతాబాద్: రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట రాములు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఆర్డీ కమిషనర్ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలోని సుమారు 400 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాగు, తాగునీటి కొరతతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్, వెంకటయ్య, నర్సింహులు, గోపాల్, వీరన్న, రమేష్, మహిళా కన్వీనర్ పద్మ, రాష్ట్ర కార్యదర్శులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎం వైద్యులపై ఖాకీల ప్రతాపం



ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. ఇండియన్ మెడికల్ గ్రాడ్యుయేట్ వైద్యులతో సమానంగా నెలకు రూ.29,700 స్టయిఫండ్ ఇవ్వాలని, సుప్రీం కోర్టు, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల ప్రకారం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న ఎఫ్ఎంజిలను పోలీసులు అరెస్ట్ చేసి తరలించడం పట్ల వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీఎస్ఎంసీ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ వైద్యులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వచ్చారని అరెస్టు చేయడం ఏమిటని వైద్యులు మండిపడుతున్నారు. శుక్రవారం డీఎంఈ కార్యాలయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించిన సందర్భంలో ఎఫ్ఎంజి వైద్యులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా మొహిసిన్ అనే ఎఫ్ఎంజి వైద్యుడిని పోలీసులు అత్యంత దారుణంగా ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడంతో ఆయన చొక్కా చిరిగిపోయింది. వీపు భాగంలో గాయాలు చోటుచేసుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసుల దౌర్జన్యాన్ని వీడియో తీస్తున్న మహిళా వైద్యురాలిని కూడా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ డాక్టర్స్ లీగ్ సభ్యుడు, ఎఫ్ఎంజి వైద్యుడు డాక్టర్ సుహాన్ మాట్లాడుతూ, సర్కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులే ఢిల్లీకి వెళ్లి నిరసనలు తెలుపుతున్న తరుణంలో పోలీసులు వైద్యులపై ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడటం ఏమాత్రం సమంజసం కాదన్నారు.


లక్ష్మీదేవి కటాక్షంతో సంస్థ అభివృద్ధి చెందాలి

సిఎండి జితేష్ పాటిల్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: లక్ష్మీ దేవి కటాక్షతో సంస్థ అభివృద్ధి చెందాలని.. ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఫైనాన్స్ విభాగం ఆధ్వర్యంలోలక్ష్మీ దేవి అమ్మవారి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగాఎస్‌పిడిసిఎల్‌సి ఎండి జితేష్ పాటిల్, డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిఎండి జితేష్ పాటిల్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి చెందాలని అంతేకాకుండా సంస్థలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు పాటిల్ తెలిపారు.పూజా కార్యక్రమంలో డైరెక్టర్(కమర్షియల్) సీహెచ్. చక్రపాణి, డైరెక్టర్(ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నర్సింహులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు యుద్ధంతోనే రాజ్యాధికారం

బిసి యువజన సంఘం సమావేశంలో వక్తలు



ప్రజాపక్షం/చిక్కడపల్లి: జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యత ఇవ్వాలని.. యాచించకుండా శాసించే విధంగా కలిసికట్టుగా ఎదగాలని.. పరిపాలించడం ఏ ఒక్కరి సొత్తు కాదని.. బిసిలు ఒక్కటై జట్టు కడితే వచ్చే ఎన్నికల్లో బిసిలే పాలకులవుతారని.. ఓటు యుద్ధంతో రాజ్యాధికారం చేపడతామని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా అధ్యక్షతన జరిగిన బిసియువజన సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, జనాభాలో 60 శాతం ఉన్న బిసిలకు అసెంబ్లీ, పార్లమెంటులో సరైన ప్రాధాన్యత లేకపోవడం చాలా దుర్మార్గమన్నారు. బిసిల ఓట్లతో గద్దెనెక్కిన అగ్రకులాల పార్టీలు, పాలకులు బిసిలను విస్మరిస్తున్నాయని, అసెంబ్లీ సీట్లు ఇవ్వకుండా, బిసికులగణన చేయకుండా బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించకుండా తీరని అన్యాయం చేస్తున్నాయనిమండిపడ్డారు. ఇప్పటి నుంచి ఓటు యుద్ధం మొదలు పెట్టాలని, బిసిలకు అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలకు శంకరగిరి మాన్యాలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు మాట్లాడుతూ, బిసిల చైతన్యాన్ని విస్మరించిన రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి వీలులేదని, బిసిలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కల్పించిన రాజకీయ పార్టీలను బిసిలు విశ్వసించాలనికోరారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్, బిఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ, బిసిలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిసిల చైతన్యాన్ని తక్కువ చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలంటే బిసిలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఒక్కటై రోడ్డెక్కాలని పిలుపునిచ్చారు. అనంతరం బిసియువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి బిసియువజన సంఘం నిర్మాణ పరంగా బలోపేతం చేస్తూ బిసిల రాజకీయ అధికారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, కుందారం గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, సిద్ధాంతం శ్యామల, గుంటి మహేష్, దేవిక, శ్రావణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మూడంచెల వ్యవస్థతో పరిష్కారం

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారీగా గడువు
- మెరుగైన విద్యుత్ సేవలు లక్ష్యం: ఎస్‌పిడిసిఎల్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: విద్యుత్ వినియోగదారులకు పారదర్శక, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలను నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ ప్రకటించింది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, మీటర్ల సమస్యలు, బిల్లింగ్ ఫిర్యాదులు, కొత్త కనెక్షన్లు తదితర సేవలకు టిజిఇఆర్‌సి నిర్దేశించిన సేవా ప్రమాణాల ప్రకారం గడువులు అమల్లో ఉన్నాయని సంస్థ పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో 4 గంటలు.. గ్రామీణ ప్రాంతాల్లో 8 గంటల వ్యవధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ (విద్యుత్ సరఫరా అంతరాయం) పరిష్కరించాలి. ఓవర్‌హెడ్ లైన్,కేబుల్ బ్రేక్‌డౌన్ 6 గంటలు, 24 గంటల్లో పరిష్కరించాలి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం 24 గంటలు, 48 గంటల సమయంలో పరిష్కారం చూపాలి. బకాయిల చెల్లింపు అనంతరం విద్యుత్ పునఃసంధానం కోసం 4 గంటలు, 12 గంటల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. ఇతర ముఖ్యమైన సేవా ప్రమాణాలు, షెడ్యూల్ విద్యుత్ అంతరాయాల కోసం ముందస్తుగా 24 గంటల సమాచారం అందించాలి. ఒకేసారి అంతరాయం 12 గంటలకు మించకూడదు.మీటర్ల మార్పిడిలో భాగంగా సంస్థ లోపం కారణంగా కాలిపోయిన మీటర్‌ను ఏడు రోజుల్లో మార్చాలి. బిల్లింగ్ ఫిర్యాదుల్లో భాగంగా అదనపు సమాచారం అవసరం లేని ఫిర్యాదులను 24 పనిగంటల్లో పరిష్కరించాలి.కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్ ద్వారా కనెక్షన్ ఇవ్వగలిగిన సందర్భాల్లో, అవసరమైన చెల్లింపుల అనంతరం 30 రోజుల్లోపు కనెక్షన్ విడుదల చేయాలి.

మూడు అంచెల వ్యవస్థ..

సమస్యలను పరిష్కరించుకునేందుకు మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులో ఉంది. టోల్‌ఫ్రీ నెం:1912, అధికారిక వెబ్‌సైట్, ఆన్‌లైన్ పోర్టల్, వినియోగదారుల సేవా కేంద్రాలు, స్థానిక విద్యుత్ కార్యాలయాల ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు. టిజిఇఆర్‌సి రెగ్యులేషన్ నెం:5 ఆఫ్ 2016 ప్రకారం, నిర్దేశించిన సేవా ప్రమాణాలను పాటించని సందర్భాల్లో సంబంధిత నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా వినియోగదారులు పరిహారం కోరవచ్చు. అయితే పరిహారం ప్రతి ఫిర్యాదుకు స్వయంగా వర్తించదు. వినియోగదారులు ఫిర్యాదు రసీదు సంఖ్య, సంబంధిత ఆధారాలతో నిర్దేశించిన విధానంలో క్లెయిమ్ చేసుకోవాలి. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడం, ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించడం ప్రధాన లక్ష్యమని ఎస్‌పిడిసిఎల్ ప్రకటించింది.

2011 నాటి కేసులో లాలూకు బెయిల్

సివాన్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న ఆరోపణలకు సంబంధించిన 2011 నాటి కేసులో, బిహార్‌లోని సివాన్ జిల్లా కోర్టు శుక్రవారం ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్‌కు బెయిల్ మంజూరు చేసింది. పదేపదే కోర్టు విచారణలకు హాజరు కానందుకు ఆయనపై వారెంట్లు, ప్రకటన నోటీసులు జారీ కావడంతో లాలూ ప్రసాద్ అదనపు ప్రధాన న్యాయమూర్తి (ఎసిజెఎం)1 కోర్టు ముందు హాజరయ్యారు. ప్రసాద్ తరపు న్యాయవాది కామేశ్వర్ తివారీ విలేకరులతో మాట్లాడుతూ తన క్లయింట్ ఆరోగ్య సమస్యల కారణంగా గతంలో కోర్టుకు హాజరు కాలేకపోయారని, ఆయన గైర్హాజరు ఉద్దేశపూర్వకం కాదన్నారు. 'లాలూ ప్రసాద్ ఆరోగ్య సమస్యల కారణంగా గతంలో కోర్టుకు హాజరు కాలేకపోయారు, అందువల్ల కోర్టుకు హాజరు కాకపోవడానికి కారణం ఉద్దేశపూర్వకం కాదు. నా క్లయింట్ పరిస్థితి గురించి కోర్టుకు తెలియజేశాను. కోర్టు ఆయన అభ్యర్థనను అంగీకరించి బెయిల్ మంజూరు చేసింది' అని తివారీ తెలిపారు. 2011లో దరౌండా అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ప్రచారానికి చివరి రోజున, ప్రసాద్ అనుమతించిన ప్రచార సమయాన్ని దాటి ఒక ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా గజిట్
ఎక్స్‌ట్రార్డినరి
పబ్లిషడ్ ఆథారిటి

No.G2/810/2026 **తేది: 03.10.2026**
Gaz.No.172/2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

ఫారం. VII
(Declaration) రూఢీ ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలంలోని మాదారం గ్రామము వద్ద మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 55 (Major-L1) నిర్మాణ నిమిత్తము మాదారం గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ. 2.11 గుంటలు** భూమి ప్రజాప్రయోజనార్థం అనగా మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ 55 (Major-L1) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్ కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ.లు 2.11 గు.** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 55 (Major-L1) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: మాదారం మండలం: ఉర్కొండ జిల్లా: నాగర్ కర్నూల్

క్ర. సం.	సర్వే నెం./ ఎస్.డి. నెం.	పట్టా/ఇనాం etc.,	భూవర్గీకరణ మెట్ట/తరి	[illegible]	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు [illegible]	[illegible]	నిర్మాణములు [illegible]	[illegible]
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	636	లావుణి పట్టా	మెట్ట	0.07	బాషమోని ఈదమ్మ భర్త ఈదమ్మ (0.07) ఇంద్రాల నాగేష్ తండ్రి వెంకటయ్య శావుకుల భారతమ్మ భర్త కృష్ణయ్య ప్రభుత్వ భూమి	635	637	617	637	లేవు	లేవు	లేవు	లేవు
2	635	పట్టా	మెట్ట	0.35	గోడుప్పరి లాలయ్య తండ్రి రాములు (0.10) జవ్వాది జంగయ్య తండ్రి చెన్నయ్య (0.10) జవ్వాది మల్లయ్య తండ్రి చెన్నయ్య (0.15) గోడుప్పరి ప్రవీన్ తండ్రి లాలయ్య గోడుప్పరి నవీన్ తండ్రి లాలయ్య	630	636	625	634	లేవు	లేవు	[illegible]	0.10
3	625	పట్టా	మెట్ట	0.23	గంగాదేవి భర్త జంగయ్య (0.09) బచ్చు వజ్రమ్మ భర్త శేఖరయ్య (0.07) బిల్లకంటి విజయలక్ష్మి భర్త ప్రవీన్ కుమార్ (0.07) తమ్మళ్ళ జగదీష్ తండ్రి బాలకిష్టయ్య తమ్మళ్ళ నారాయణ తండ్రి బాలకిష్టయ్య తమ్మళ్ళ శ్రవణ్ కుమార్ తండ్రి బాలకిష్టయ్య తమ్మళ్ళ పద్మ భర్త లోకేశ్వర్ తమళ్ళ లోకేశ్వర్ తండ్రి పరందాములు యాదమ్మ భర్త కృష్ణయ్య దేవరి రాజేశ్వరి భర్త శ్రీశైలం దేవరి రాధిక గార్డియన్‌గా నానమ్మ గంగాదేవి భర్త శ్రీశైలం తగుళ్ళ శిరీష భర్త శ్రీశైలం	626	617	624	635	లేవు	లేవు	లేవు	లేవు
4	624	పట్టా	మెట్ట	0.22	బచ్చు వజ్రమ్మ భర్త శేఖరయ్య (0.05) బిల్లకంటి విజయలక్ష్మి భర్త ప్రవీన్ కుమార్ (0.05) రాంబాగ్యమ్మ భర్త శేఖర్ రెడ్డి (0.12) అనెగాని పాండు తండ్రి నర్సింహ్మాగౌడ్ అనెగాని వెంకటేష్ గౌడ్ తండ్రి నర్సింహ్మాగౌడ్ ద్యాప మాలతి భర్త సాయిరెడ్డి	623	619	621	625	లేవు	లేవు	లేవు	లేవు
5	622	పట్టా	మెట్ట	0.04	రోడ్డు (0.02) సువాంజి, శివాజి, రాంలాల్ (0.02) మల్లెకేడి శర్పులాల్ తండ్రి సువంజీ మల్లెకేడి శివాజీ తండ్రి మహబుబ్ మల్లెకేడి నర్సింగ్ తండ్రి కిషన్ ఇంద్రాల నాగేష్ తండ్రి వెంకటయ్య గోడుప్పరి శ్రీను తండ్రి నర్సింహులు వేముల రాములు తండ్రి మాసయ్య గోడుప్పరి రామచంద్రమ్మ భర్త లక్ష్మయ్య యం బాబులాల్ తండ్రి మహబూబ్ కంటి మల్లేష్ తండ్రి బాలమల్లయ్య ఇంద్రకంటి పర్వతాలు తండ్రి బాలమల్లయ్య ఇంద్రకంటి పార్వతమ్మ భర్త పర్వతాలు పెబ్బేటి అమరేందర్ రెడ్డి తండ్రి అల్వాల్‌రెడ్డి పెబ్బేటి నరేందర్ రెడ్డి తండ్రి అల్వాల్ రెడ్డి గోడుప్పరి రాములమ్మ భర్త సత్యనారాయణ మల్లెకేడి రంజిత్‌కుమార్ తండ్రి కిషన్ మల్లెకేడి రాజేశ్వరిజి భర్త సువాంజీ నేయులు తండ్రి చంద్రయ్య మ్యాకల ఎల్లమ్మ భర్త వెంకటయ్య గోడుప్పరి నిర్మల భర్త లాలయ్య ఇంద్రకంటి నరేష్ తండ్రి మల్లేష్ ద్యాప పారిజాత భర్త జంగిరెడ్డి పెబ్బేటి స్వప్న భర్త అశోక్‌రెడ్డి గోడుప్పరి రవిందర్ తండ్రి కిష్టయ్య మ్యాకల మల్లయ్య తండ్రి చుక్కయ్య చిక్కొండ్ర మంజుల భర్త మల్లయ్య మ్యాకల సునిత భర్త రాజు చిక్కొండ్ర శ్రీశైలమ్మ భర్త జంగయ్య ఇంటి భర్త కృష్ణయ్య ఇంద్రకంటి నాగమ్మ భర్త జంగయ్య ఇంద్రకంటి నాగరాజు తండ్రి శ్రీశైలం మ్యాకల పార్వతమ్మ భర్త పర్వతాలు ద్యాప వీరారెడ్డి తండ్రి జంగిరెడ్డి ఇంద్రకంటి అశోక్ తండ్రి బచ్చయ్య బోగరాజు అశ్వని భర్త శ్రీను వావిల్ల మౌనిక భర్త గణేష్ జక్క నిర్మల భర్త నాగేష్ బి రేణుక భర్త మల్లేష్ మలకేదార్ సుధారాణి భర్త బాలాజి కల్యాణం లక్ష్మయ్య తండ్రి శంబులింగం వీరమల్ల శ్రీకాంత్ తండ్రి బాల్‌రాం వీరమల్ల స్వరూప భర్త లక్ష్మయ్య వీరమల్ల బాలమణి భర్త శ్రీను వీరమల్ల మౌనిక భర్త కొండలయ్య కల్యాణం కృష్ణయ్య తండ్రి శంబులింగం ఇంద్రకంటి కృష్ణవేణి భర్త నాగేందర్ జంగమ్మ భర్త రాంచంద్రయ్య మ్యాకల రేణుక భర్త శంకర్ మ్యాకాల మల్లమ్మ భర్త బీరయ్య ఇంద్రకంటి నాగయ్య తండ్రి నాగయ్య మ్యాకల మల్లమ్మ భర్త మల్లేష్ ఇంద్రకంటి నరేష్ తండ్రి శ్రీశైలం ఇండ్ల స్థాలాలు	627	624	VB	624	లేవు	లేవు	లేవు	లేవు
	మొత్తము : 2.11												

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు / ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమి భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

Sd/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే), యూనిట్ -I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్

Sd/-
అదనపు కలెక్టరు నాగర్ కర్నూల్

Sd/-
జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO NO. 1110/LA/PP/Advt/Pub/2026-27

ఆధార్ స్థానంలో ఓటర్ ఐడి
పెద్ద కుట్ర

- నేడు ఓటు చోరీ, రేపు రేషన్లా?, పెన్షన్లా?
- మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డ రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడానికి ఆధార్ స్థానంలో ఓటర్ ఐడిని వాడతామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా ఖండించారు. మంత్రి ప్రకటనను లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఒక పెద్ద కుట్రగా అభివర్ణించారు. 'ఇది కేవలం ఓట్ల దొంగతనం మాత్రమే కాదు, హక్కుల దొంగతనం' అని ఆయన అన్నారు. ఈ కుట్ర చాలా లోతుగా పాతుకుపోయిందని, దీన్ని అర్థం చేసుకోవడానికి మీరు సమయం తీసుకోండని రాహుల్ అన్నారు. 'సర్' ముసుగులో లక్షలాది పేర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగిస్తున్నారని, దీనిని ఆపకపోతే ఇంకా ఎన్నో పేర్లను తొలగిస్తారని, బిజెపిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నవారి పేర్లనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఓటు పోతే హక్కులు పోయినట్టేనన్నారు. 'మీరు హైజాక్ చేసిన ప్రజాస్వామ్యంలో అదృశ్య పౌరులుగా మారిపోతారు. అక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోరు, ప్రభుత్వమే తన మనుషులను ఎన్నుకుంటుంది. ఈరోజు పంచాయతీ రాజ్ పథకాలు. రేపు, రేషన్లా? పెన్షన్లా? ఎంజి నరేగానా? గృహవసతి? స్కాలర్‌షిప్‌లా? రిజర్వేషన్లా?' అని రాహుల్ ప్రశ్నించారు. 'ఓటర్ల జాబితాలు నిష్పక్షపాత ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి, కానీ ఇప్పుడు అవి 'మోదీ ప్రభుత్వ ఉద్యోగి జ్ఞానేష్ కుమార్' చేతిలో ఉన్నాయి. ఓట్ల దొంగతనంలో బిజెపితో కుమ్మక్కైన అతడిని సాక్ష్యాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం' అని ఆయన అన్నారు. ఎల్లప్పుడూ బిజెపికే మెజారిటీ ఉండేలా ఒక జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఇప్పుడు అదే జాబితా మీకు పథకాల ప్రయోజనాలు అందుతాయో లేదో నిర్ణయిస్తుందని రాహుల్ అన్నారు. బిజెపిని గద్దెదించాలని ఎవ రైతే నిర్ణయించుకున్నారో, వారి పేర్లను ప్రత్యేకంగా ఎంపిక చేసి తొలగిస్తారని, పేరు తొలగిస్తే ఓటు పోయినట్టేనన్నారు. 'ఓటు తొలగింపు ఎన్నికల్లో గెలవడానికి చేసే రాజకీయాలు కాదు, ఇది ఎన్నికలను దొంగిలించడానికి చేసిన ఏర్పాటు, అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండటానికి వేసిన శాశ్వత వ్యవస్థ అని ఆయన ఆరోపించారు. 'ఓటు వేయడం మీ హక్కు, షరతు కాదు. ఒక పేదవాడి పెన్షన్‌ను వారి ఓటరు కార్డుకు బానిసగా చేయలేరు. ఇది కేవలం ఓట్ల దొంగతనం కాదు, ఇది హక్కుల దొంగతనం, దీనిని జరగనివ్వం అని అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్‌ను కూడా ఆయన పోస్ట్ చేశారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులను గుర్తించడానికి ఆధార్ స్థానంలో ఓటర్ ఐడి వస్తుందన్న సింగ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ గురువారం కేంద్రాన్ని విమర్శించింది. ఓటు దొంగతనం అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని, పూర్తి చిత్రం హక్కుల దొంగతనం అని పేర్కొంది. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ పథకాల కింద ఆర్థిక ప్రయోజనాలు, సంక్షేమ చెల్లింపులు పొందాలంటే ఇకపై తప్పని సరి బయోమెట్రిక్ ధృవీకరణతో పాటు ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్ కూడా అవసరమని రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ అన్నారు.

దేశ భద్రతను బలహీనపరచిన
'అగ్నిపథ్' పథకాన్ని రద్దు చేయాలి

- కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ : అగ్నిపథ్ పథకం దేశ భద్రతను బలహీనపర్చిందని, దానిని రద్దు చేసి, రెగ్యులర్ సైనికుల నియామకాలను తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. రెగ్యులర్ సైనికులుగా మారుతున్న 25శాతం మంది సైనికులకు, వారు అగ్నివీర్‌లుగా నియమితులైన ప్పటి నుంచి రెగ్యులర్ సైనికులకు లభించే అన్ని ప్రయోజనాలను గతకాలానికి వర్తించేలా ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. నాలుగేళ్ల పదవీ కాలం ముగిసిన తర్వాత సైన్యం నుంచి నిష్క్రమించనున్న అగ్నివీర్‌లకు, నిర్దిష్ట అర్హతా ప్రమాణాలను నెరవేర్చినట్లయితే, మరో రెండేళ్ల పొడిగింపు, తదుపరి శాశ్వత నియామకం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిన రెండు రోజుల తర్వాత కాంగ్రెస్ ఈ డిమాండ్లను ముందుకు తెచ్చింది. సైనిక నియామక పథకంపై సమగ్ర సమీక్ష అనంతరం మూడు సేవలు సిఫార్సు చేసిన మార్పులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిన కొద్ది సేపటికే, బుధవారం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్‌ఎస్.రాజసుబ్రమణి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ మాజీ సైనికుల విభాగం అధిపతి, రిటైర్డ్ కల్నల్ రోహిత్ చౌదరి మాట్లాడుతూ, నాలుగేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మన సాయుధ దళాలపై అగ్నివీర్ పథకాన్ని విధించిందని, ఆ సమయంలో మూడు సేవల అధిపతులు 'ఈ పథకాన్ని తీసుకురావాలని మేం సలహా ఇవ్వలేదు' అని పేర్కొన్నారని తెలియజేశారు. 'ఇది మన దేశ భద్రతను బలహీనపర్చిన పథకం. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి రాహుల్‌గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సైనికుల విభాగం, పార్టీకి చెందిన న్యాయ యోధులు అందరూ ఈ పథకాన్ని అంతం చేయడానికి పోరాటం చేసి దేశవ్యాప్తంగా 'జై –జవాన్' ఉద్యమం నిర్వహించారని రోహిత్ చౌదరి వివరించారు. 'ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, మన సైన్యం రెండు లక్షలకు పైగా సైనికుల కొరతను ఎదుర్కొంది. మోదీ ప్రభుత్వం తుగ్లకీ డిక్రీ కారణంగా సైన్యం, వైమానిక దళంలో చేరి , విధుల్లోకి ప్రవేశించడానికి ఎదురుచూస్తున్న 1.5లక్షల మంది పిల్లల కలలు చెదిరిపోయాయి' అని చౌదరి ఆరోపించారు. అగ్నివీర్ పథకం దేశ భద్రతకు వ్యతిరేకం. మనం ఈ పథకాన్ని రద్దు చేసి రెగ్యులర్ సైనికులను నియమించుకోవాలి' అని ఆయన ఇక్కడ కాంగ్రెస్ మాజీ సైనికుల శాఖలోని ఇతర సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ డిమాండ్లను రోహిత్ చౌదరి ప్రస్తావిస్తూ రెగ్యులర్ సైనికులుగా మారుతున్న 25శాతం మంది సైనికులకు, వారు అగ్నివీర్‌లుగా నియమితులైనప్పటి నుంచి రెగ్యులర్ సైనికులకు లభించే అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సాధారణ సైనికుల్లాగే అగ్నివీర్‌లకు కూడా 90 రోజుల సెలవు ఇవ్వాలని, పెళ్లి చేసుకోవడానికి కూడా అనుమతించాలని, ఎందుకంటే?. అది వారి ప్రాథమిక హక్కు అని రోహిత్ చౌదరి అన్నారు. అమరవీరులైన అగ్నివీర్‌ల కుటుంబాలకు, సాధారణ సైనికుల కుటుంబాల మాదిరిగానే అన్ని ప్రయోజనాలతో పాటు జీవితకాల పింఛను కూడా అందించాలన్నారు. సాధారణ సైనికులతో పోలిస్తే అగ్నివీర్‌లకు నెలకు కేవలం రూ.40,000 మాత్రమే చెల్లించడం బాధాకరమన్నారు. సైనికులు వారి ఇతర ప్రయోజనాల కోసం కేటాయించిన డబ్బు ఎక్కడకు పోయిందో ప్రభుత్వం దేశానికి లెక్కచెప్పాలి అని డిమాండ్ చేశారు. మేం ఈ రోజు 'జై జవాన్ పార్ట్–2'ను ప్రారంభిస్తాం, అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేసే వరకూ ఈ పోరాటం కొనసాగుతుంది అని కాంగ్రెస్ నేత రోహిత్ చౌదరి తెలిపారు. జూన్ 2022లో ప్రారంభించిన అగ్నిపథ్ పథకం కింద సైనికులను నాలుగేళ్ల కాలానికి నియమించగా, వారిలో కేవలం కొంత శాతం మందికి మాత్రమే సాధారణ సేవల్లో కొనసాగించే నిబంధన ఉంది. సుమారు 18,300 మంది అగ్నివీర్‌లు తమ నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుని, డిసెంబరు 31న సాయుధ దళాల నుంచి నిష్క్రమించడానికి కేవలం మూడు వారాల ముందు ప్రభుత్వం ఈ పథకంలో మార్పులు తీసుకువచ్చింది.

జనంపైకి దూసుకెళ్లిన ట్రక్కు

- ముగ్గురు పిల్లలు సహా ఏడుగురు దుర్మరణం
- జార్ఖండ్‌లోని ఖుంటీ జిలాల్లో ఘటన


రాంచి : జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చీకటి సమయంలో ఖుంటీ జిల్లాలో 18 చక్రాల ట్రక్కు మలుపు తిరుగుతుండగా, జనంపైకి దూసుకెళ్లింది. ముగ్గురు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు మరణించారని పోలీసులు శుక్రవారం తెలిపారు. ఘటన పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఖుంటీ జిల్లా ఎస్‌పి రిషభ్ గార్గ్ తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి కర్రాతోర్ప ప్రధాన రహదారిపై ఒక స్కూటర్ ప్రయాణికుడు కందకంలో పడిపోగా, అతడిని రక్షించేందుకు కొందరు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు మరికొంత మంది మహిళలు, పిల్లలు అక్కడ గుమిగూడారు. అదే సమయంలో, తోర్ప వైపు నుంచి వస్తున్న 18 చక్రాల ట్రక్కు మలుపు తిరుగుతుండగా వారిపైకి దూసుకెళ్లింది. చీకటిగా ఉండటంతో డ్రైవర్‌కు అక్కడ జనం ఉన్నట్లు గుర్తించకపోవచ్చని ఎస్‌పి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించగా, ఒకరు గాయపడ్డారు అని ఆయన పిటిఐతో చెప్పారు. వీరిలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లలు, ఒక పురుషుడు ఉన్నారని ఆయన వివరించారు. ప్రధాని మోదీ ఘటన పట్ల ఎక్స్ వేదికగా స్పందిస్తూ, 'జార్ఖండ్‌లోని ఖుంటీలో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరం. ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా ఎక్స్‌లో స్పందిస్తూ, రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానన్నారు.

పోలీసుల ఎదురుకాల్పుల్లో..
ముగ్గురు నిందితులు మృతి

పాట్నా: బిహార్‌లో పోలీసులకు, నేరస్తులకు మధ్య జరిగిన వేర్వేరు ఎదురుకాల్పుల్లో ముగ్గురు అనుమానిత నేరస్థులు మృతి చెందగ, ఒకరు గాయపడ్డారు. పాట్నా జిల్లా మనేర్ ప్రాంతంలోని షేర్‌పూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో మనేర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు తృటిలో ప్రమాదం తప్పింది. నిందితులు జరిపిన కాల్పుల్లో బుల్లెట్ ఆయన యూనిఫామ్‌ను తాకుతూ వెళ్లింది. పాట్నా సీనియర్ ఎస్‌పి కార్తికేయ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. నేరాలకు పాల్పడేందుకు కొందరు నేరచరిత్ర కలిగిన వ్యక్తులు షేర్‌పూర్ ప్రాంతంలో సమావేశమయ్యారన్న సమాచారంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్), జిల్లా పోలీసులు సంయుక్తంగా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో నిందితులు పోలీసులపై కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులు గాయపడగా, ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతులను దానాపూర్‌కు చెందిన జయప్రకాశ్ యాదవ్, షాపూర్‌కు చెందిన రాజా కుమార్, బబ్లూ యాదవ్‌గా గుర్తించారు. వీరిపై హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, దాడులు, అక్రమ ఆయుధాల కేసులు సహా పలు కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలు...
భార్యసహా ఏడుగురి హత్య

- రుబ్బురోలుతో కొట్టిచంపిన క్యాబ్ డ్రైవర్
- బెంగళూరులో దారుణ ఘటన



బెంగళూరు : బెంగళూరులో దిగ్భ్రాంతికర ఘటన వెలుగు చూసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక క్యాబ్ డ్రైవర్ తన భార్య కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశాడు. మృతుల్లో ఏడేళ్ల బాలుడు కూడా ఉన్నాడు. ఈ హత్యలు గత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడిని ఇందుశేఖర్ అలియాస్ శేఖర్‌గా గుర్తించారు. అతను రాజజినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తన ఇంట్లోనే ఈ హత్యలకు పాల్పడినట్లు, ఆపై మృతదేహాలను కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల్లో పడవేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాలను ఎక్కడెక్కడ పడేశాడో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నంది కొండల సమీపంలో విస్తృతంగా గాలించిన పోలీసులు, బాలుడి మృతదేహాన్ని కనుగొన్నారు. మిగిలిన ఆరుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 'ఇది ఏదో అనుకోకుండా జరిగిన ఘటన కాదు. నిందితుడు తన సొంత బంధువులను అత్యంత జాగ్రత్తగా, పథకం ప్రకారమే హత్య చేసినట్లు కనిపిస్తోంది' అని హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే విలేకరులతో అన్నారు. ఈ హత్యలకు గల అసలు కారణాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదని ఆయన పేర్కొన్నారు. బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత కుమార్ సింగ్ మాట్లాడుతూ, నవంబర్ 3న శ్రీరాంపుర పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైందని, ఆ తర్వాత జరిగిన విచారణలో ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. దీంతో ఆ కేసును హత్య కేసుగా మార్చి, రాజజినగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, బాధితులు ఏడుగురిలో నిందితుడి భార్య సునీత, అత్త రూపవతి, బావలు శివకుమార్, శంకర్, వారి భార్యలు దివ్య, నళిని, అలాగే శివకుమార్‌దివ్యల ఏడేళ్ల కుమారుడు పునీత్ ఉన్నారు. నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, అతను తన భార్యతో సహా తన కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశాడు అని సింగ్ చెప్పారు. ప్రస్తుతానికి ఒక మృతదేహం మాత్రమే లభ్యమైందని, మిగిలిన ఆరుగురి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలను వివిధ ప్రాంతాలకు పంపినట్లు ఆయన తెలిపారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, శేఖర్ మొదట తన భార్య సునీతను రోలు (గ్రైండింగ్ స్టోన్)తో కొట్టి చంపి, ఆమె మృతదేహాన్ని చిక్కబళ్లాపూర్ జిల్లాలోని నంది కొండల (నంది హిల్స్) సమీపంలో పడేశాడు. ఆ తర్వాత ఆమె మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి, అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె ఏదో యాత్రకు వెళ్లిందని పొరుగువారికి చెప్పాడు. మరుసటి రోజు, అతను శివకుమార్, శంకర్‌లను తన ఇంటికి విందు కోసం పిలిచి, వారిని కూడా హత్య చేశాడు. ఆ తర్వాత దివ్య, నళిని, రూపవతి, పునీత్‌లను కూడా హత్య చేసినట్లు సమాచారం. నళిని తల్లి నవంబర్ 3న శ్రీరాంపుర పోలీస్ స్టేషన్‌లో ఆమె కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో భాగంగా పోలీసులు ఈ వరుస హత్యలను గుర్తించి, శేఖర్‌ను అరెస్టు చేశారు. హత్యల అనంతరం, ఇంట్లో ఉన్న రక్తపు మరకలను తొలగించడానికి నిందితుడు రసాయనాలను ఉపయోగించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మృతదేహాలను తరలించడానికి ఉపయోగించిన కారును, హత్యలకు వాడినట్లు అనుమానిస్తున్న రోలును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మృతదేహాలను నంది కొండలు, తీర ప్రాంత కర్ణాటకలోని చర్మాడి ఘాట్ వంటి వేర్వేరు ప్రదేశాల్లో పడేశాడు. కుటుంబ కలహాల కారణంగా తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానని శేఖర్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అయితే, ఈ హత్యలకు పాల్పడటంలో శేఖర్‌కు ఎవరైనా సహకరించారా? అనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా ఈ ఘటనలో అతడి కుమార్తె పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలోనూ విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివాస ప్రాంతంలో ఉన్న ఇంట్లో ఇంతటి దారుణాలు జరిగినప్పటికీ, అవి వెంటనే బయటకు రాకపోవడానికి గల కారణాలపై పోలీసులు పరిశీలిస్తున్నారని అన్నారు.

'రేప్' కేసులో తరుణ్ తేజ్‌పాల్‌కు జైలుశిక్ష
నిలిపివేతకు 'సుప్రీం' నిరాకరణ

తెహల్కా జర్నలిస్టుకు కోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ : జర్నలిస్ట్ తరుణ్ తేజ్‌పాల్‌కు 2013నాటి అత్యాచార కేసు విషయంలో శుక్రవారం సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు విధించిన 10ఏళ్ల జైలుశిక్షను నిలిపివేయడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించడంతో ఎదురుదెబ్బతగిలింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం.సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ, తరుణ్ తేజ్‌పాల్‌పై విధించిన శిక్షను నిలిపివేయడానికి తాము సుముఖంగా లేమని స్పష్టం చేసింది. శిక్షను నిలిపివేయాలని కోరుతూ తేజ్‌పాల్ దాఖలు చేసిన 'దరఖాస్తుపై విచారణ జరుపుతూ 'శిక్షను నిలిపివేయడానికి ఇది సరైన కేసు అని మేం భావించడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది. తరుణ్‌తేజ్‌పాల్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. కేసులోని సాక్ష్యాధారాలు, ఇతర మెటీరియల్స్ గురించి ప్రస్తావిస్తూ 'ఈ స్టోరీ మొత్తం అబద్ధం' అని వాదించారు. గోవా ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ , తరుణ్ తేజ్‌పాల్ అభ్యర్థనను వ్యతిరేకించారు. 'ఇది శిక్షను పెంచాల్సిన కేసు' అని అత్యున్నత న్యాయస్థానం ముందు తన వాదనలు వినిపించారు. ఆగస్టు 6న బాంబే హైకోర్టు, తరుణ్ తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా నిర్ధారించి, అతనికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు 5 ఏళ్ల క్రితం తెహల్కా మేగజైన్ మాజీ సంపాదకుడిని నిర్దోషిగా విడుదల చేసిన తీర్పును ఇది రద్దు చేసింది. 2013లో గోవాలో ఆ పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమం సందర్భంగా తేజ్‌పాల్ తన సహోద్యోగిపై అత్యాచారం చేసినందుకు అతడు దోషిగా నిర్ధారించబడ్డాడు. 62ఏళ్ల ఆ జర్నలిస్టు తాను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బాధితుడనని ఆరోపించాడు. ఆగస్టు 25న, తన పదేళ్ల జైలు శిక్షను అనుభవించేందుకు మూడు వారాలలోగా లొంగిపోవాలని తరుణ్‌తేజ్‌పాల్‌ను ఆదేశించింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు ను కోరుతూ ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అనంతరం తేజ్‌పాల్ ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోయాడు. తరుణ్ తేజ్‌పాపాల్ పైఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి)లోని పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపబడ్డాయి. వాటిలో 376 (2)(ఎఫ్) (నమ్మకం లేదా అధికారం ఉన్నస్థానంలో ఉన్న వ్యక్తి చేసిన అత్యాచారం, 354 (ఎ) (లైంగికవేధింపులు), 354 (బి) వస్త్రాలు తొలగించే ఉద్దేశంతో దాడి లేదా నేరపూరిత బలప్రయోగం, సెక్షన్ 376 (2) (ఎఫ్) ప్రకారం,గరిష్ఠ జైలుశిక్ష జీవితఖైదు ఉన్నాయి. ఆగస్టు 20 న, తనను దోషిగా నిర్ధారించిన హైకోర్టు ఉత్తర్వును సవాల్ చేస్తూ తరుణ్ తేజ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో, యావజ్జీవకారాగార శిక్ష విధించాలని వాదిస్తూ, తేజ్‌పాల్‌కు మరింత కఠినమైన శిక్ష విధించాలని కోరుతూ గోవా ప్రభుత్వం కూడా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌లో, తరుణ్ తేజ్‌పాల్ చేసిన నేర స్వభావానికి, తీవ్రతకు హైకోర్టు విధించిన శిక్ష పూర్తిగా అసమానంగా ఉందని గోవా ప్రభుత్వం వాదించింది. తన 81పేజీల తీర్పులో, హైకోర్టు ట్రయల్ కోర్టు యొక్క 2021నాటి ఉత్తర్వును 'వికృతమైనది' గా అభివర్ణించింది. లైంగిక దాడి బాధితురాలు 'పరిపూర్ణ బాధితురాలు' గా ఉండాలని, విశ్వసనీయంగా కనిపించడానికి ఆమె ఒక నిర్దిష్ట పద్ధతిలో ప్రవర్తించాలనే భావనకు ఆ ఉత్తర్వు లోనైందని హైకోర్టు పేర్కొంది.

బెల్జియం ప్రధాని రాజీనామాను తిరస్కరించిన రాజు

బ్రస్సెల్స్: బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్ రాజీనామాను ఆ దేశ రాజు ఫిలిప్ శుక్రవారం తిరస్కరించారు. దేశ బడ్జెట్‌పై నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధానితో పాటు సంకీర్ణ ప్రభుత్వ నేతలు చర్చలు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. బడ్జెట్ చర్చలు విఫలం కావడంతో డి వెవర్ సోమవారం రాజీనామా సమర్పించారు. అయితే, సంకీర్ణ పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపిన రాజు, వచ్చే మూడేళ్లకు ఆర్థిక క్రమశిక్షణతో కూడిన బడ్జెట్‌పై ఏకాభిప్రాయం సాధించేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. దీంతో ప్రధాని రాజీనామాను తిరస్కరించి, వెంటనే చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. నవంబర్ 16న ప్రధాని రాజుకు నివేదిక సమర్పించనున్నారు. యూరోపియన్ కమిషన్ అంచనా ప్రకారం, ఈ ఏడాది బెల్జియం అప్పులు జిడిపిలో 110 శాతానికి చేరనున్నాయి. ఇదే సమయంలో విద్యార్థుల నిరసనలు, కార్మిక సంఘాల సమ్మెలతో దేశంలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

ఢిల్లీలో క్షీణిస్తున్న వాయు నాణ్యత

నగరాన్ని కమ్మేసిన దట్టమైన పొగ



న్యూఢిల్లీ : జాతీయ రాజధాని ఢిల్లీని శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించి 'తీవ్ర' కాలుష్య స్థాయికి చేరువైంది. మొత్తం ఎక్యూఐ 391గా నమోదైంది. నగరవ్యాప్తంగా ఉన్న 59 పర్యవేక్షణ కేంద్రాల్లో ఉదయం 9 గంటల సమయానికి 30 కేంద్రాలు 'తీవ్ర' గాలి నాణ్యతను నమోదు చేశాయి. మిగిలిన కేంద్రాల్లో చాలా పేలవమైన గాలి నాణ్యత నమోదైంది. అధికారిక గణాంకాల ప్రకారం రోహిణిలో అత్యధికంగా 475 ఏక్యూఐ నమోదవగా, ఐఐటి ఢిల్లీలో 472గా నమోదైంది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేశాయి. వాయునాణ్యత దారుణంగా క్షీణిస్తున్న తరుణంలో ఢిల్లీ సహా దేశ రాజధాని ప్రాంతంలో తక్షణం గ్రాప్–3 ఆంక్షలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో గ్రాప్–3 ఆంక్షలను అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. బిఎస్–3 పెట్రోల్, బిఎస్– డీజిల్ కార్లు రోడ్లపై తిరగకుండా చర్యలు చేపట్టారు. అంతర్రాష్ట్ర డీజిల్ బస్సులు రాజధానిలోకి ప్రవేశించడం లేదా అక్కడ తిరగడంపై ఆంక్షలు విధించారు. కంకర రోడ్లపై ఇసుక, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి రవాణాపై నిషేధాన్ని అమలు చేస్తున్నారు. స్వచ్ఛ ఇంధనంతో నడవని స్టోన్ క్రషర్లు, మైనింగ్ కార్యకలాపాలు, హాట్‌మిక్స్ ప్లాంట్లను అధికారులు మూసివేశారు. అత్యవసర, ఆవశ్యక సేవలకు మినహా డీజిల్ జనరేటర్ సెట్లను నిషేధించారు. వాహన ఉద్గారాలను అరికట్టడానికి ప్రైవేట్ కంపెనీలు వర్క్‌ఫ్రమ్‌హోమ్ లేదా హైబ్రిడ్ విధానాలను అవలంబించాలని అధికారులు సూచించారు. 5వ తరగతిలోపు చిన్నారులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించాలని స్పష్టంచేశారు.

స్థానిక శాసనసభ ఎన్నికల్లో జిన్‌పింగ్ ఓటు



బీజింగ్: అరుదుగా బయటకు వచ్చిన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శుక్రవారం బీజింగ్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సభకు డిప్యూటీలను ఎన్నుకునేందుకు ఆయన ఓటు వేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న జిన్‌పింగ్, జిచెంగ్ జిల్లాలోని జోంగాన్‌హై ఎన్నికల నియోజకవర్గ పరిధిలో ఉన్న హువైరెన్టాంగ్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. జిచెంగ్ జిల్లా ప్రజాప్రతినిధుల సభకు డిప్యూటీలను ఎన్నుకునే ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. జోంగాన్‌హైను చైనాలో అధికార కేంద్రంగా, అధికార కమ్యూనిస్ట్ పార్టీకి నాడీ కేంద్రంగా పరిగణిస్తారు. చారిత్రక ఫర్బిడెన్ సిటీకి సమీపంలో ఉన్న అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన సామ్రాజ్య నివాస సముదాయంలో జిన్‌పింగ్‌తో పాటు ఇతర అగ్రనేతలు నివాసం ఉంటారు. చైనాలో స్థానిక, ప్రాంతీయ, జాతీయ స్థాయిల్లో శాసనసభలు ఉన్నాయి. ఎన్నికయ్యే అభ్యర్థుల్లో అత్యధికులు అధికార కమ్యూనిస్ట్ పార్టీకి చెందినవారే లేదా ఆ పార్టీ మద్దతు పొందినవారే ఉంటారు. చైనా రాజధానిలో అత్యున్నత అధికార వ్యవస్థ అయిన బీజింగ్ మున్సిపల్ ప్రజాప్రతినిధుల సభ, ప్రావిన్షియల్ స్థాయి శాసనసభగా వ్యవహరిస్తుంది. నగర పాలనకు సంబంధించిన కీలక ఆర్థిక, సామాజిక, పరిపాలనా విధానాలపై చర్చించి ఆమోదించే బాధ్యత ఈ సభకు ఉంది. ఇది చైనాలోని బహుళ అంచెల ప్రజాప్రతినిధుల సభ వ్యవస్థలో భాగం. ఈ వ్యవస్థకు జాతీయ ప్రజాప్రతినిధుల సభ (ఎన్‌పిసి) నాయకత్వం వహిస్తుంది. ప్రజాప్రతినిధుల సభ పదవీకాలం ఐదేళ్లు.

పుతిన్ ప్రత్యేక రాయబారి కిరిల్ దిమిత్రియేవ్‌తో ట్రంప్ భేటీ

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక రాయబారి కిరిల్ దిమిత్రియేవ్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ తన అధికార నివాసం వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. అయితే అదే సమయంలో వైట్‌హౌస్‌కు వచ్చిన ఉక్రేన్ ప్రతినిధులతో మాత్రం తాను సమావేశం కాలేదని ట్రంప్ వెల్లడించారు. ఈ భేటీ అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా కొత్త దౌత్య ప్రయత్నాలు చేస్తోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్, దిమిత్రియేవ్‌తో ఏఏ అంశాలపై చర్చించారో వెల్లడించడానికి నిరాకరించారు. అయితే రష్యా, ఉక్రేన్‌కే పరిమితం కాకుండా యూరప్‌లోని ఇతర దేశాలకు కూడా సంబంధించిన భారీ ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సూచించారు. ఈ ఒప్పందం గురించి పూర్తి వివరాలు వెల్లడించకపోవడంతో దాని స్వరూపంపై స్పష్టత లేదు. ఈ సమావేశానికి ముందు అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ రష్యా, ఉక్రేన్ ప్రతినిధులను వైట్‌హౌస్‌లో ఒకచోట చేర్చారు. ఉక్రేన్ ఒలెష్కీ పట్టణంలో మానవతా సహాయం


కిరిల్ దిమిత్రియేవ్

అందించేందుకు, పౌరులను సురక్షితంగా తరలించేందుకు కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను గుర్తుచేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గత నెల 23న కుదిరిన ఈ ఒప్పందం అక్టోబర్ 27 నుంచి నవంబర్ 1 వరకు ఆరు రోజులపాటు అమల్లో ఉంది. ఈ సమయంలో ఆహారం, మందులు వంటి అత్యవసర సామగ్రిని అక్కడికి తరలించారు. దాదాపు 800 మంది పౌరులు పట్టణం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు మెలానియా తెలిపారు. కాగా, మెలానియా చేసిన మానవతా ప్రయత్నాలను రష్యా రాయబారి దిమిత్రియేవ్ ప్రశంసించారు. ఈ కాల్పుల విరమణకు సంబంధించి పుతిన్ స్వయంగా ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతినిధులు కూడా మెలానియాకు కృతజ్ఞతలు తెలిపారు.ఇలావుంటే, దక్షిణ ఉక్రేన్‌లోని ఖెర్సన్ ప్రాంతంలో ఉన్న ఒలెష్కీ పట్టణం రష్యా ఆధీనంలో ఉంది. ఒకప్పుడు సుమారు 24 వేల మంది నివసించిన ఈ పట్టణంలో యుద్ధం కారణంగా విద్యుత్, తాగునీరు, తాపన సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన మొదటి రోజే ఈ పట్టణాన్ని రష్యా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం జరిగిన దాడుల్లో అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. 2023లో కఖోవ్కా ఆనకట్ట కూలిపోవడంతో వరదలు సంభవించి వందలాది మంది మరణించారు. కాల్పుల విరమణ సమయంలో సుమారు 2,000 మంది అక్కడే ఉన్నారు. వారికి ఉక్రేన్ లేదా రష్యా నియంత్రణలోని ప్రాంతాలకు వెళ్లే అవకాశం కల్పించారు. పట్టణంలో ఉండాలనుకున్నవారికి ఆహారం, వైద్య సామగ్రి అందించారు. 2022లో రష్యా దాడి ప్రారంభమైనప్పటి నుంచి కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ పలుమార్లు ప్రయత్నించారు. అయితే ఇప్పటివరకు శాశ్వత శాంతి ఒప్పందం కుదరలేదు. రష్యా, ఉక్రేన్ రెండింటిపైనా యుద్ధాన్ని ముగించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇలావుంటే, స్పెయిన్‌లో శుక్రవారం మాట్లాడిన జెలెన్‌స్కీ, ఒకవేళ పుతిన్ కోరుకుంటే పోరాటాన్ని నిలిపివేయగలరని ఒలెష్కీ కాల్పుల విరమణ నిరూపించిందని అన్నారు. కాల్పులు ఆగిన రోజుల్లో వందలాది మంది ప్రాణాలు కాపాడగలిగామని పేర్కొన్నారు. మెలానియా గత ఏడాది నుంచి యుద్ధం కారణంగా విడిపోయిన కుటుంబాలను తిరిగి కలిపేందుకు రష్యా, ఉక్రేన్ అధికారులతో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 36 మంది చిన్నారులు తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరేందుకు ఆమె సహకరించారు. ఈ నేపథ్యంలో ఒలెష్కీ కాల్పుల విరమణను మరింత విస్తృతమైన శాంతి ప్రయత్నాలకు ఆరంభంగా మలచాలని మెలానియా ఆకాంక్షించారు. అయితే ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరే విషయంలో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, పుతిన్ ప్రత్యేక ప్రతినిధితో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశం కావడం, వాంతి స్థాపనపై కొత్త ఆశలు రేపుతున్నది.

లాస్ ఏంజెలెస్ మేయర్‌గా భారతీయ మహిళ నిత్యా రామన్

న్యూయార్క్: భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ సోషలిస్ట్ నిత్యా రామన్ లాస్ ఏంజెలెస్ నగర మేయర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. అమెరికాలో రెండో అతిపెద్ద నగరానికి తొలి దక్షిణాసియా సంతతి మేయర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత మేయర్ కరెన్ బాస్‌పై 45 ఏళ్ల నిత్యా విజయం సాధించారు. కేరళలో జన్మించిన నిత్యా గతంలో లాస్ ఏంజెలెస్ నగర కౌన్సిల్ సభ్యురాలిగా పనిచేశారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, ఎంఐటిలో ఉన్నత విద్య అభ్యసించారు. నగర మేయర్‌గా ఎన్నిక కావడం గౌరవంగా భావిస్తున్నానని ఆమె 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు, పిల్లల కోసం పార్కులు, మెరుగైన ప్రజా రవాణా, సురక్షితమైన నగరాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యూయార్క్ మేయర్‌గా భారత సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీ ఇప్పటికే ఎన్నికైన నేపథ్యంలో, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలకు భారత సంతతి నేతలు నాయకత్వం వహించనున్నారు. ఈ మధ్యంతర ఎన్నికల్లో పలువురు భారతీయ అమెరికన్లు కూడా వివిధ పదవులకు ఎన్నికయ్యారు. పియా దండియా, డాక్టర్ అమిష్ షా అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. వీరితో పాటు అమీ బెరా, ప్రమీలా జయపాల్, రో ఖన్నా, సుహాస్ సుబ్రమణ్యం కాంగ్రెస్‌లో కొనసాగనున్నారు. దర్శనా పటేల్, రంజీవ్ పురి, డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణియన్, అరుణా మిల్లర్, నబీలా సయ్యద్ తదితరులు కూడా విజయాలు సాధించిన వారిలో ఉన్నారు. టెక్సస్ శాసనసభకు ఎన్నికైన పూజా సేథీ ఆ రాష్ట్రంలో తొలి భారతీయ అమెరికన్ శాసనసభ్యురాలిగా గుర్తింపు పొందనున్నారు. జార్జియా శాసనసభకు ఎన్నికైన జ్యోత్ సింగ్ తొలి భారతీయ అమెరికన్, తొలి సిక్కు అమెరికన్‌గా చరిత్ర సృష్టించారు.

సిడ్నీ హనుక్కా కాల్పుల బాధితురాలు ఈవా గెల్లర్ మృతి



మెల్బోర్న్: సిడ్నీలో హనుక్కా వేడుకల సందర్భంగా జరిగిన సామూహిక కాల్పుల్లో గాయపడిన 90 ఏళ్ల హోలోకాస్ట్ బాధితురాలు ఈవా గెల్లర్ దాదాపు ఏడాది తర్వాత కన్నుమూశారు. గురువారం రాత్రి సిడ్నీలోని ఆసుపత్రిలో ఆమె మరణించినట్లు ఆస్ట్రేలియన్ జూయిష్ సంస్థ ప్రతినిధి ఇవాన్ జ్లాట్కిస్ శుక్రవారం వెల్లడించారు. రొమేనియాలో జన్మించిన ఈవా, డిసెంబర్ 14న బోండి బీచ్‌లో జరిగిన కాల్పుల్లో గాయపడ్డారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ప్రభావంతో ఇద్దరు దుండగులు జరిపిన కాల్పుల్లో 10 నుంచి 87 ఏళ్ల వయసున్న 15 మంది మరణించగా, మరో 40 మంది గాయపడ్డారు. ఒక దుండగుడు సాజిద్ అక్రమ్‌ను పోలీసులు అక్కడికక్కడే కాల్చిచంపారు. ఈ ఘటనలో ఈవా కాలికి బుల్లెట్ గాయం కావడంతో కొంతకాలం నడవలేకపోయారు. ఇక నడవలేరని వైద్యులు చెప్పినా, పట్టుదలతో తిరిగి నడవగలిగారని రబ్బీ ఆరోన్ మాస్ తెలిపారు. ఇటీవలి వారాల్లో శస్త్రచికిత్సకు సంబంధించిన సమస్యలతో ఆమె పలుమార్లు ఆసుపత్రిలో చేరారని చెప్పారు. కాగా, జీవించి ఉన్న మరో నిందితుడు నవీద్ అక్రమ్‌పై 15 హత్యలు, 43 హత్యాయత్నాలు, ఒక ఉగ్రవాద చర్యకు సంబంధించిన అభియోగాలు నమోదయ్యాయి. ఈవా మరణంతో అతడిపై ఉన్న అభియోగాల్లో మార్పులు ఉంటాయా? లేదా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఆమె మరణంపై రాష్ట్ర ప్రీమియర్ క్రిస్ మిన్స్, ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సంతాపం వ్యక్తం చేశారు. ఈవా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కెన్యా 'డూమ్స్ డే' మత బోధకుడికి 200 ఏళ్ల జైలు శిక్ష



మొంబాసా: 'డూమ్స్ డే' అనే కొత్త పంథాను సృష్టించి, 400 మందికి పైగా మరణాలకు కారణమైన కెన్యా మత బోధకుడికి శుక్రవారం 200 ఏళ్ల జైలు శిక్ష విధించారు. కెన్యాలోని తీరప్రాంత నగరమైన మొంబాసాలో ఉన్న హైకోర్టు పాస్టర్ పాల్ మెకెంజీపై 191 మంది మరణానికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఏసుక్రీస్తును కలుసుకోవాలంటే తన అనుచరులు ఆహారం తీసుకోకుండా ఉపవాసం ఉండి ప్రాణాలు విడవాలని ఆదేశించినందుకు, 190 మంది చిన్నారులు, ఒక పెద్ద వ్యక్తి మరణాలకు కారణమైన హత్య కేసులో ఆయన దోషిగా తేలారు. గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ చర్చ్ నాయకుడైన మెకెంజీ తన అనుచరులను మారుమూల ప్రాంతానికి తరలించి, వారు ఉపవాసం చేస్తూ ప్రాణాలు విడిచేలా ఆదేశించినందుకు ప్రధాన నేర బాధ్యత ఆయనదేనని న్యాయమూర్తి దయానా కవెడ్జా పేర్కొన్నారు. మెకెంజీతో పాటు ఆయన అనుచరుల్లో 28 మందిపై కూడా హత్య కేసులు నమోదయ్యాయి. వీరిలో ఆయన ఉపవాస ఆదేశాలను అమలు చేసినవారు, సామూహిక సమాధులను దాచిపెట్టేందుకు సహకరించిన సమాధుల తవ్వకందారులు కూడా ఉన్నారు. నిందితులందరూ తమపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. అయితే, ఒక వ్యక్తి మాత్రం తన నేరాన్ని అంగీకరించి, శిక్షలో ఉపశమనం కల్పించాలని కోర్టును అభ్యర్థించారు. గత నెల 19న, మొత్తం 29 మంది నిందితులను 191 మంది హత్య కేసులో దోషులుగా కోర్టు నిర్ధారించింది. 2023లో, కెన్యాలోని తీరప్రాంత కిలిఫీ కౌంటీలో ఉన్న 800 ఎకరాల (320 హెక్టార్ల) చకామా రాంచ్‌లోని తక్కువ లోతు గల సమాధుల నుంచి 400 మందికి పైగా మృతదేహాలను వెలికితీశారు. స్థానిక ప్రజలు, అధికారుల దృష్టికి దూరంగా మెకెంజీ అనుచరులు అక్కడ మట్టి గుడిసెల్లో నివసించేవారు.

మిషిగన్ ప్రతినిధుల సభ స్పీకర్‌గా రంజీవ్ పురి

వాషింగ్టన్: అమెరికాలోని మిషిగన్ రాష్ట్ర ప్రతినిధుల సభ స్పీకర్‌గా డెమొక్రటిక్ పార్టీకి చెందిన రంజీవ్ పురి ఎన్నికయ్యారు. ఈ పదవిని చేపట్టనున్న తొలి భారతీయ అమెరికన్‌గా ఆయన చరిత్ర సృష్టించారు. 42 ఏళ్ల పురి తన సహచర సభ్యుల మద్దతుతో స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సెనేట్ మెజారిటీ లీడర్‌గా ఎన్నికైన డారిన్ కామిల్లెరి, గవర్నర్‌గా ఎన్నికైన జోసెలిన్ బెన్సన్‌తో కలిసి పనిచేస్తానని చెప్పారు. పంజాబీ వలసదారుల కుటుంబంలో జన్మించిన పురి 2020లో మిషిగన్ ప్రతినిధుల సభకు ఎన్నికైన తొలి సిక్కు అమెరికన్‌గా గుర్తింపు పొందారు. 2025లో 110 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో డెమొక్రటిక్ పార్టీ నేతగా నియమితులయ్యారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా 2008, 2012 ఎన్నికల ప్రచారాల్లో పనిచేశారు. అనంతరం చికాగో విశ్వవిద్యాలయంలో ఎంబిఏ పూర్తి చేసి, మిషిగన్‌లో ఆటోమొబైల్ రంగంలో పనిచేశారు. భారతీయ అమెరికన్ల సంస్థ ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ ఆయన ఎన్నికను స్వాగతించింది. ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం వంటి రంగాల్లో ప్రజల ఖర్చులు తగ్గించేందుకు పురి కృషి చేస్తారని సంస్థ ప్రతినిధి చింతన్ పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పాస్‌ల ధర తగ్గింపు (మొదటి పేజీ తరువాయి)


రూ.4,500 వరకు ఆదా కానుండగా, రోజువారీ పాస్‌పై రూ.125 మేర ప్రయోజనం కలగనుంది. నవంబర్ 8 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి రానున్నాయి. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మరో అవకాశం (మొదటి పేజీ తరువాయి)

చేరని వారిని చేర్చే ప్రక్రియలో భాగంగా, అటువంటి ఓటర్ల బూత్ వారీ జాబితాలను, వారిని చేర్చకపోవడానికి గల సంభావ్య కారణాలతో పాటు, పోలింగ్ కేంద్రాలు, నిర్దేశిత స్థానిక ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శిస్తారు. ఈ జాబితాలను ఆయా ముఖ్య ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా అప్‌లోడ్ చేస్తారు. ఈ ఓటర్లకు కొత్త గణన పత్రాలను అందించాలని, అలాగే బూత్ స్థాయి అధికారుల (బిఎల్‌ఓ) ద్వారా ఇంటింటికీ వెళ్లి, వాట్సాప్, ఇ–మెయిల్, ఎస్‌ఎంఎస్ ద్వారా వారిని సంప్రదించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేయాలని కమిషన్ అధికారులను ఆదేశించింది. నివాసం మార్చుకోని ఓటర్లు, తాము ఇంతకుముందు ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ ఒక ప్రకటనతో పాటు, సరిగ్గా నింపిన తమ గణన పత్రాలను సమర్పించవచ్చు. రాష్ట్రంలోనే నివాసం మార్చిన వారు చిరునామా మార్పు కోసం ఫారం–8 దాఖలు చేయనవసరం లేదు, కానీ తమ కొత్త చిరునామాపై అసెంబ్లీ నియోజకవర్గాన్ని పేర్కొంటూ, చిరునామా రుజువుతో కూడిన ఒక ప్రకటనతో పాటు గణన పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలి. చిరునామా పత్రాలు లేని నిరాశ్రయులైన ఓటర్ల విషయంలో, బిఎల్‌ఓ క్షేత్రస్థాయి ధృవీకరణ నివేదికను నివాస రుజువుగా అంగీకరిస్తారు. 1960 ఓటర్ల నమోదు నిబంధనల నియమం 21(1) ప్రకారం, ఎన్నికల నమోదు అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారని ఇసి తెలిపింది. ఆమోదించబడిన దరఖాస్తులను తుది ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం ప్రత్యేకంగా ఉంచుతారు, ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్లను అలాగే ఉంచుకుంటారు. సర్ సమయంలో కొత్తగా నమోదు కోసం ఇప్పటికే ఫారమ్–6ను సమర్పించిన ఓటర్లు, మళ్లీ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను సమర్పించాల్సిన అవసరం లేదు.

ఎస్‌టి కమిషన్ ఏర్పాటు చారిత్రక నిర్ణయం

కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య కృతజ్ఞతలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చట్టం 2003ను రద్దు చేస్తూ 2026 చట్టం తీసుకురావడం, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయడం చారిత్రక నిర్ణయమని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజనుల సంక్షేమం, విద్య, వైద్యం, ఉద్యోగాలలో పదోన్నతి, సామాజిక హక్కుల పరిరక్షణలో ఎస్ టి కమిషన్ ఏర్పాటు నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని, ఎస్‌టి కమిషన్ ద్వారా గిరిజన ప్రాంతాల్లోని సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని అంజయ్య నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 338, 338ఎ ప్రకారం జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లను వేరువేరుగా వ్యవస్థీకరించాలని ఉన్నప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యం వహించారని, ఫలితంగా రాష్ట్రంలో గిరిజనుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సతమతమయ్యారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడిగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ వల్ల గిరిజనుల సమస్యల పరిష్కారంలో సాంకేతిక, పరిపాలనాపరమైన జా ప్యం జరిగేదని, ఇప్పుడు ఎస్‌టిల కోసం ప్ర త్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన సామాజిక హక్కుల రక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా గిరిజన సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా వేర్వేరు కమిషన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు గిరిజన సమాజం కృతజ్ఞతతో ఉంటుందని రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ వేరువేరుగా ఏర్పాటు చేయాలని గతంలో ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన గుర్తు చేశారు. కమిషన్ల ఏర్పాటుకు చొరవ చూపిన సాంబశివరావుకు తెలంగాణ గిరిజన సమాఖ్య తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

సింగరేణిలో 1,135 మంది కార్మికుల క్రమబద్ధీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: సింగరేణి బదిలీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఏళ్ల తరబడి క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న 1,135 మంది కార్మికులను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. కోల్ బెల్ట్ ప్రజాప్రతినిధుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి క్రమబద్ధీకరణ అమల్లోకి వచ్చింది. 2025 డిసెంబర్ 31వ తేదీ నాటికి లేదా అంతకు ముందు సంస్థలో ఉద్యోగంలో చేరి బదిలీ వర్కర్లుగా, జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా పనిచేస్తున్న వారికి ఈ అవకాశం వర్తిస్తుంది. భూగర్భ గనుల్లో కనీసం 190 పని దినాలు, ఓపెన్‌కాస్ట్ గనులు లేదా ఇతర బయటి విభాగాల్లో కనీసం 240 పని దినాలు పూర్తిచేసిన వారు అర్హులుగా గుర్తించనున్నారు. సింగరేణి ఛైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ (పర్సనల్) ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ విభాగం ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది. అర్హులైన కార్మికుల జాబితాలను ఈ నెల 23వ తేదీలోగా సమర్పించాలని ఆయా ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించింది.గతంలో బదిలీ వర్కర్లు, బదిలీ ఫిల్లర్ల నుంచి జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణకు కొంత కాలం వేచి ఉండాల్సి వచ్చేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామని సంస్థ తెలిపింది.విధులకు గైర్హాజరు కాకుండా క్రమశిక్షణతో పనిచేసే బదిలీ వర్కర్లు, జనరల్ అసిస్టెంట్ ట్రైనీలకు క్రమబద్ధీకరణ అవకాశాలు లభిస్తాయని సింగరేణి యాజమాన్యం పేర్కొంది. ఇప్పటికే జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ పొందిన పలువురు ఉద్యోగులు అనంతరం అంతర్గత పదోన్నతులు, నియామకాల ద్వారా ఉన్నత అవకాశాలు పొందారని గుర్తుచేసింది. కార్మికులు విధులకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు సహకరించాలని ఛైర్మన్, ఎండి బుద్ధప్రకాష్ జ్యోతి కోరారు.

క్రమబద్ధీకరణకు అర్హత పొందనున్న కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ వస్తోందని, సంస్థ అభివృద్ధి, విస్తరణకు ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేస్తూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిర్ణయించొద్దు (మొదటి పేజీ తరువాయి)

నియామకాలను తిరిగి తెరవడానికి దారితీయకూడదు.ఈ విషయంలో, 2016 డిసెంబరు 20వ తేదీన రాసిన తన లేఖ ద్వారా, సివిల్ సర్వీసెస్ పరీక్ష2016కు సంబంధించిన ఎంపికలు, ఈ కోర్టు ముందుపెండింగ్‌లో ఉన్న అప్పీళ్ల ఫలితానికి లోబడి ఉంటాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) స్పష్టం చేసిందని గమనించడం సందర్భోచితం'అని పేర్కొనబడింది. ఈ తీర్పు కోర్టు ముందున్న పక్షాలకు మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే ముగిసిన సీనియారిటీ, పదోన్నతుల విషయాన్ని తిరిగి సమీక్షించబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'ఏదైనా కోర్టు, ట్రిబ్యునల్ లేదా ఇతర సమర్థవేదిక లేదా అధికార సంస్థ ముందు కేసులు పెండింగ్‌లో ఉన్న తాము కూడా అదేవిధంగా బాధితులమని వాదించే వ్యక్తుల వాదనలను, సంబంధిత నిర్ణయాధికార సంస్థలేదా అధికార సంస్థ వాటి యోగ్యతల ఆధారంగా పరిగణించవచ్చు. అటువంటి దావా యోగ్యతల గురించి ఈ కోర్టు ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్త చేయదు. చట్టానికి అనుగుణంగా అలాంటి క్లెయిమ్‌లను పరిష్కరించేటప్పుడు, తీర్పులో పొందుపరిచిన 1993 ఆఫీస్ మెమోరాండం (ఓఎం), 2004 లేఖ వ్యాఖ్యానాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని పునరుద్ఘాటించింది' అని ధర్మాసనం పేర్కొంది. మార్చి 11న తీర్పును అమలు చేయడానికి ప్రభుత్వానికి 6 నెలల గడువును సుప్రీంకోర్టు ఇవ్వగా, శుక్రవారం ఆ గడువును మరో రెండు నెలలు పొడిగించింది. రిజర్వేషన్, క్రీమీలేయర్ ప్రమాణాలకు సంబంధించి రాజ్యాంగం, న్యాయస్థానం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా తన విధానాన్ని రూపొందించుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు స్పష్ట ంచేసింది. 'ఈ విషయాలు కార్యనిర్వహక, శాసనసభల పరిధిలోకి వస్తాయి కాబట్టి, పోస్టుల మధ్య సమానత్వాన్ని నెలకొల్పడానికి గానీ, క్రీమీలేయర్ విధాన రూపకల్పనలో భాగస్వాములను సంప్రదించడానికి గానీ, ఎలాంటి కాలపరిమితిని నిర్దేశించేందుకు ఈ కోర్టు సుముఖంగా లేదు' అని ధర్మాసనం పేర్కొంది. కాగా, కేంద్రం తన మార్చి 11వ తేదీ తీర్పును భవిష్యత్తు కాలానికి తీర్పు వర్తింపజేయాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రోహిత్ నాథన్ అనే కేసులో, ప్రభుత్వ రంగ సంస్థల్లోగానీ, ప్రైవేట్ రంగంలోగానీ ఉద్యోగం చేస్తున్న తల్లిదండ్రుల జీతం లేదా ఆదాయాన్ని మాత్రమే క్రీమీలేయర్ మినహాయింపునకు నిర్ణయాత్మక ప్రమాణంగా పరిగణించరాదని మార్చి 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. 1993 ఆఫీస్ మెమోరాండం (ఓఎం)కి అనుగుణంగా తల్లిదండ్రుల పదవి హోదా, వర్గం నిర్దేశించిన ఆదాయం లేదా సంపద పరీక్షను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి.

భూములు వేలం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపసంఘం సభ్యులు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు స్పష్టమైన లక్ష్యాలు, శాఖల మధ్య సమన్వయం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అత్యంత అవసరమని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి శాఖ వారాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పారిశ్రామిక లేఅవుట్లు, పాత పారిశ్రామికవాడల్లో భూముల వినియోగం, క్రమబద్ధీకరణ ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను డిప్యూటీ సిఎం సమీక్షించారు. ఇప్పటికే సమకూరిన ఆదాయం, వివిధ దశల్లో ఉన్న ప్రతిపాదనల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. పారిశ్రామిక భూములకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అజామాబాద్, బాలానగర్, హాఫీజ్‌పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్ల వారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. బి కేటగిరీ, సూక్ష్మ పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించడంతో పాటు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యం

పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలను నిర్ణయించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలను అప్పగించాలని సూచించారు. రోజువారీ పురోగతిని పర్యవేక్షించడం ద్వారా పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన, సులభతరమైన సేవలు అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్, భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో పాల్గొనే అన్ని వర్గాలకు స్పష్టతతో పాటు ప్రయోజనం కలిగేలా ప్రణాళికాబద్ధమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి సమకూరే భూ వనరులను అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, అదనపు ఆదాయం సమకూర్చే మార్గాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల వినియోగంలో ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోడ్లు, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి అత్యవసర మౌలిక సదుపాయాల అభివృద్ధికి, వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూముల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వ వాటాగా లభించే భూములను నిర్దిష్ట ప్రజా అవసరాలకు వినియోగించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలను చట్టపరమైన నిబంధనలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలను మంత్రివర్గ పరిశీలనకు సమర్పించాలని డిప్యూటీ సిఎం సూచించారు.

భూముల వేలం ప్రక్రియను దశలవారీగా చేపట్టాలి

హెచ్‌ఎండిఎ, టిజిఐఐసి పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను కూడా ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. వేలానికి అనువైన లేఅవుట్లను గుర్తించాలని, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం, అభివృద్ధికి అవకాశాలు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ సిఎం సూచించారు. భూముల వేలం ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. భూముల వివరాలు, లేఅవుట్ల ప్రస్తుత స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, ముందస్తు ఏర్పాట్ల పురోగతి తదితర అంశాలతో కూడిన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు.

లేఅవుట్ల అభివృద్ధి, వేలం పర్యవేక్షణకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్ బోర్డ్

ప్రభుత్వ భూములు, లేఅవుట్ల అభివృద్ధి, వేలం సంబంధిత కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్ బోర్డ్ రూపొందించాలని డిప్యూటీ సిఎం సూచించారు. భూముల వివరాలు, లేఅవుట్ల స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతి వంటి సమగ్ర సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ డ్యాష్ బోర్డ్ ద్వారా శాఖల మధ్య సమన్వయం మెరుగుపడటంతో పాటు నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు అవకాశం ఉంటుందని, భూముల వేలం ప్రక్రియలో పారదర్శకత, పెరుగుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల విలువను పెంచడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం, ఆదాయ సమీకరణకు కొత్త మార్గాలను గుర్తించడం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

ఈ సిరీస్ ప్రపంచకప్‌కు రిహార్సల్

శుభమన్ గిల్

టీమిండియా టి–20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై వన్డే కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల జల్లు కురిపించాడు. అద్భుతమైన సారథ్యంతో టి–20 సిరీస్ గెలిపించాడని కొనియాడాడు. క్లిష్ట పరిస్థితుల్లో పుంజుకొని శ్రేయస్ అయ్యర్ అందించిన విజయం తనకు గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్తో రెండో వన్డేకు ముందు బిసిసిఐ షేర్ చేసిన వీడియోలో మాట్లాడిన శుభమన్ గిల్.. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'టి–20 సిరీస్‌లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా నడిపించాడు. న్యూజిలాండ్‌లో తొలి రెండు మ్యాచ్‌లు గెలవడం అంత ఈజీ కాదు. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఎదురైన క్లిష్ట పరిస్థితులను టీమిండియా ఎదుర్కొన్న తీరు అద్భుతం. ఇలాంటి విజయాలు జట్టు మొత్తానికి స్ఫూర్తినిస్తాయి. టి–20 సిరీస్‌ను 3–2తో గెలవడంతో వన్డే సిరీస్‌కు కావాల్సిన మంచి ఊపు మాకు లభించింది. 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్, నవంబర్ నెలలో జరుగుతుంది. సాధారణంగా మేం డిసెంబర్, జనవరి నెలల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా వంటి దేశాల్లో ఆడుతాం. కాని ఇప్పుడు మేం నవంబర్ ఆరంభంలోనే న్యూజిలాండ్‌లో ఆడుతున్నాం. దాంతో ప్రపంచకప్లో ఎదురయ్యే పరిస్థితులనే ఇక్కడ కూడా ఎదుర్కొనే అవకాశం దొరుకుతుంది. ఇది మా ప్రపంచకప్ సన్నాహకాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. యువ పేసర్లు అన్సల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్‌ల ప్రతిభకు న్యూజిలాండ్ కండిషన్స్ సరిగ్గా సూటవుతాయి. ఇక్కడి పిచ్‌లు బౌన్స్, స్వింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. మా పేసర్లకు ఈ కండిషన్స్ అనుకూలిస్తాయి. ఈ సిరీస్‌లో వారు రాణిస్తారని నమ్ముతున్నాను. 'అని శుభమన్ గిల్ పేర్కొన్నాడు. ఆక్లాండ్లో జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 తో ఆధిక్యంలో నిలిచింది. శనివారం వెల్లింగ్టన్ వేదికగా రెండో వన్డే జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. టాస్ పడకుండానే తుడిచి పెట్టుకుపోయే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. శనివారం ఫస్టాఫ్ 60 శాతం.. సెకండాఫ్ 50 శాతం వర్షం కురుస్తుందని ఆక్యూవెదర్ పేర్కొంది.





భారత్ హ్యాట్రిక్

వరుసగా మూడోసారి ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీ

మొహాలీ: స్వదేశంలో జరిగిన మెన్స్ ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఎసిటి) హాకీ టోర్నీలో భారత జట్టు సత్తాచాటింది. టోర్నీ ఆసాంతం ఘనవిజయాలతో అదరగొట్టిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన గురువారం జరిగిన ఫైనల్లో 4–1తో జపాన్‌ను చిత్తుచేసి హ్యాట్రిక్‌తో పాటు ఆరో టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో భారత్ తరఫున షీలానంద్ లక్రా (42వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (49నిమిషంలో), జుగ్రాజ్ (53), వివేక్ సాగర్ (54నిమిషంలో) చెరో గోల్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జపాన్ నుంచి కజుమస మసుముటో (3నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. కాగా ఈ టోర్నీలో భారత్ గతంలో 2011, 2016, 2018, 2023, 2024లో టైటిళ్లు గెలుచుకోగా తాజా ఎడిషన్‌లో సాధించింది ఆరో కప్పు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో మలేషియా 5–2తో సౌత్ కొరియాను ఓడించి కాంస్యం గెలుచుకుంది.

ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసం.. భారత్ ఘనవిజయం!



అండర్–19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. నేపాల్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్(52 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలతో 70 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నేపాల్ అండర్ 19 టీమ్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. దర్శ్ సోనార్(93 బంతుల్లో ఫోర్, సిక్స్తో 43) టాప్ స్కోరర్గా నిలిచాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్(3/18), అర్జున్ రాజ్పుత్(3/8) మూడేసి వికెట్లు తీయగా.. యశ్వీర్ గౌడ్(2/25) రెండు వికెట్లు పడగొట్టాడు. కావ్య, మనాల్ చౌహాన్ తలో వికెట్ తీసారు. అనంతరం భారత అండర్ 19 టీమ్ 19.1 ఓవర్లలో 129 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఆర్యవీర్ సెహ్వాగ్‌తో పాటు కెప్టెన్ లక్ష్య రాయ్చందని(63 బంతుల్లో 7 ఫోర్లతో 53 నాటౌట్) రాణించాడు. ఈ ఇద్దరూ అజేయంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారీ సిక్సతో విరుచుకుపడిన ఆర్యవీర్ సెహ్వాగ్.. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన లక్ష్య రాయ్చందని 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ విజయంతో భారత అండర్–19 టీమ్ గ్రూప్–ఏలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వే ద్రవిడ్ కూడా ఆడగా అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్తాన్‌తో ఆడనుంది

సైన్స్




గట్‌లోని బ్యాక్టీరియాతో గుండెకు రక్షణ?

మన పేగుల్లో నివసించే సూక్ష్మజీవులు కేవలం జీర్ణక్రియకే సంబంధించినవి కావని మరో పరిశోధన సూచిస్తోంది. 'నేచర్' పత్రికలో ఇటీవల ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, సాధారణంగా మనుషుల పేగుల్లో కనిపించే 'బాక్టీరియోడెస్ యూనిఫామిస్' అనే బ్యాక్టీరియా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడే ఒక రసాయనాన్ని తయారు చేయగలదు. పరిశోధకులు ఈ బ్యాక్టీరియాలో 'పెంటడెకనోయిక్ యాసిడ్' అనే అణువును గుర్తించారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో ఈ అణువు రక్తంలోని కొలెస్టాల్‌ను తగ్గించి, ధమనుల్లో పేరుకునే కొవ్వు ఫలకాలను గణనీయంగా అదుపు చేసింది. ఈ చర్య స్టాటిన్ మందులు పనిచేసే జీవరసాయన మార్గంతో కొంతవరకు పోలి ఉంటుంది. మానవుల నుంచి సేకరించిన రక్తం, మల నమూనాలను పరిశీలించినప్పుడు అధిక కొలెస్టాల్ ఉన్నవారిలో ఈ అణువు స్థాయిలు తక్కువగా కనిపించాయి. గుండె జబ్బులు ఉన్నవారిలో దీనిని తయారు చేసే బ్యాక్టీరియా జన్యువులు కూడా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ పరిశోధనలు ఎలుకల్లో మాత్రమే జరిగాయి. మనుషుల్లో గుండె జబ్బుల నివారణకు ఈ బ్యాక్టీరియా లేదా దాని రసాయనాన్ని ఉపయోగించవచ్చని చెప్పడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరం.


'సూపర్‌కూల్ వాటర్'

రహస్యం విప్పిన ఎఐ



నీరు సున్నా (0) డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతకు చేరినా వెంటనే మంచుగా మారక పోవచ్చు. ఈ ప్రత్యేక స్థితినే 'సూపర్‌కూల్ వాటర్' అంటారు. మేఘాల్లో, ధ్రువ ప్రాంతాల్లో, కొన్ని జీవుల శరీరాల్లో ఇలాంటి నీరు సహజంగానే కనిపిస్తుంది. అయితే ఈ స్థితిలో నీటి అణువులు ఎలా అమరిక పొందుతాయి? అవి పూర్తిగా ద్రవరూపంలో ఉంటాయా, లేక మంచుగా మారడానికి సిద్ధంగా ఉన్న మధ్యంతర నిర్మాణంలో ఉంటాయా? అనే ప్రశ్న భౌతిక శాస్త్రంలో చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఎఐ) సాయంతో శాస్త్రవేత్తలు ఈ సమస్యను కొత్త కోణంలో విశ్లేషించారు. కోట్లాది అణువుల కదలికలను కంప్యూటర్ అనుకరణల ద్వారా పరిశీలించిన ఎఐ, గతంలో ప్రతిపాదించిన రెండు ప్రధాన సిద్ధాంతాల్లోని అంశాలను సమన్వయం చేసింది. సూపర్ కూల్ నీటిలో అణువులు ఒకే రకమైన అమరికలో కాకుండా, సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, తక్కువగా ఉన్న ప్రాంతాలు ఒకేసారి సహజీవనం చేస్తాయని పరిశోధన సూచిస్తోంది. ఉష్ణోగ్రత మారే కొద్దీ ఈ నిర్మాణాల నిష్పత్తి కూడా మారుతుందని ఎఐ విశ్లేషణ వెల్లడించింది. ఈ అవగాహన కేవలం నీటి స్వభావాన్ని అర్థం చేసుకోవడానికే పరిమితం కాదు. కొత్త పదార్థాల రూపకల్పన, జీవకణాలు, అవయవాలను అత్యల్ప ఉష్ణోగ్రతల్లో సురక్షితంగా నిల్వ చేసే 'క్రయోప్రిజర్వేషన్' సాంకేతికత, అలాగే మేఘాల ఏర్పాటును, మంచు స్ఫటికాల ఉత్పత్తిని మరింత ఖచ్చితంగా అంచనా వేసే వాతావరణ నమూనాల అభివృద్ధికి కూడా ఇది ఉపయోగపడే అవకాశం ఉంది. దశాబ్దాలుగా భౌతిక శాస్త్రవేత్తలను అయోమయంలో పడేసిన నీటి అసాధారణ ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో ఎఐ కీలక పాత్ర పోషించిందని ఈ అధ్యయనం సూచిస్తోంది.

జీవితాంతం కొత్త న్యూరాన్లు!



మానవ మెదడు జీవితాంతం కొత్త నాడీకణాలను తయారు చేయగలదా? అనే ప్రశ్నకు శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా సమాధానం వెతుకుతున్నారు. ఒకప్పుడు మనిషి పుట్టిన తర్వాత కొత్త న్యూరాన్లు దాదాపుగా ఏర్పడవని భావించేవారు. కానీ తాజా పరిశోధనలు ఆ అభిప్రాయాన్ని నవాలు చేస్తున్నాయి. హిప్పోకాంపస్ వంటి మెదడులోని కొన్ని ప్రాంతాల్లో పెద్దవారిలో కొత్త నాడీకణాల ఏర్పాటుకు సంబంధించిన ఆధారాలు లభిస్తున్నాయి. సింగిల్‌న్యూక్లియస్ ఆర్ఎన్ఎ సీక్వెన్సింగ్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చెందుతున్న కణాల లక్షణాలను గుర్తిస్తున్నారు. ఇటీవల ప్రచురితమైన పరిశోధన కూడా పెద్దవారి మానవ హిప్పోకాంపస్‌లో న్యూరోజెనెసిస్‌కు సంబంధించిన సంక్లిష్టమైన పరమాణు వ్యవస్థలను గుర్తించింది. ఈ పరిశోధనకు జ్ఞాపకశక్తి, వృద్ధాప్యం, అల్జీమర్స్ వ్యాధి, డిప్రెషన్ వంటి అంశాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కొత్త న్యూరాన్ల తయారీ సామర్థ్యం తగ్గితే కొన్ని మెదడు వ్యాధులతో సంబంధం ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే వయోజన మానవ మెదడులో పెద్ద సంఖ్యలో కొత్త న్యూరాన్లు నిరంతరం తయారవుతున్నాయి అనే విషయాన్ని ఇంకా పూర్తిగా నిర్ధారించాల్సి ఉంది.

పంటనష్టం అంచనాపై క్షేత్రస్థాయిలో పర్యటించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ : అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా పరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుసు గాలి తుఫాను ప్రభావంతో వరి పంటలు నేలకొరిగి రైతులకు అపార నష్టం వాటిల్లిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు వరి ధాన్యానికి రూ.30వేలు, మిర్చి, పత్తి రైతులకు రూ.50వేలు, ఇతర పంటలకు ఎకరానికి రూ.20వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయని, పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నవంబర్ 10న సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినున్నట్లు ప్రకటించారు. రైతులందరూ ఈ ధర్నాలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లావుల రాములు, బూర వెంకటేశ్వర్లు, అనంతుల మల్లేశ్వరి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కరువు మండలాలు గుర్తించి రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



ప్రజాపక్షం/వరంగల్ : వరంగల్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో కరువు మండలాలు, ప్రాంతాలను గుర్తించి నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం దండు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరై షేక్ బాష్ మియా మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు నవంబర్ 10న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పంజాల రమేష్, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, గన్నారపు రమేష్, సంఘీ ఎలేందర్, అక్కపెల్లి రమేష్, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, దామెర కృష్ణ, రహేలా, తాళ్లపల్లి జాన్‌పాల్, అక్బర్ పాషా, జన్ను రవి, పరికరాల రమేష్, మస్కా సుధీర్, చింతకింది కుమారస్వామి, గోవర్ధనచారి, ఏకాంబ్రచారి ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, ల్యాదల్ల శరత్, చిట్యాల సువర్ణ పాల్గొన్నారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/హుస్నాబాద్ : ఎల్ నినో కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా పరిగమించి, తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కరువును అధిగమించేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా పంట సర్వే చేసి, నష్టం నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పంట కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు వ్యవసాయకూలీలు, కౌలు రైతులు, గ్రామీణ పేదలకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలన్నారు. పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రతి రేషన్ కార్డుదారుడికి 10 కిలోల బియ్యంతో పాటు పప్పులు, 19 రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి కూలీలకు కూలీరేట్లు పెంచాలని, జాబుకార్డు కలిగిన కుటుంబాలకు తగిన పనిదినాలు కల్పించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు వరికి రూ.40వేలు, పత్తికి రూ.50వేల ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువు పనులను ప్రారంభించాలన్నారు. కరువును దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించేందుకు బియ్యంను గోదాముల నుంచి రహస్య ప్రదేశాలకు తరలించి ధరలను పెంచుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చాడ కోరారు. ప్రపంచాన్ని కష్టనష్టాలకు గురిచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కే అక్కడి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అలాగే దొంగ ఓట్ల నెపంతో ప్రధాన ఎన్నికల అధికారిని గుప్పిట్లో పెట్టుకుని బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ తన పద్ధతి మార్చు కోకుంటే ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడుతున్న సిఇసిని వెంటనే తొలగించాలని చాడ డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ, నాయకులు వెంకట్‌రెడ్డి, అందె ఆశోక్, జనగాం రాజ్‌కుమార్, పద్మ, లక్ష్మణ్, శంకర్, ఎల్ముల శ్రీనివాస్, రజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొహెడ మండలానికి చెందిన పలువురు చాడ సమక్షంలో సిపిఐలో చేరారు,

కరువుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి : రాజ్‌కుమార్

ప్రజాపక్షం/భూపాలపల్లి : ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం, తీవ్ర ఎండలు, భూగర్భ జలాలు అడుగంటడం, సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుర్రంపేట గ్రామంలో ఎండిపోయిన వరి పంటను సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున, పత్తి, కూరగాయలు తదితర పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు గురిజ పెళ్లి సుధాకర్‌రెడ్డి, పైండ్ల శాంతి కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి, కుడుదుల వెంకటేష్, సొతుకు ప్రవీణ్ కుమార్, నూకల చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, ఎండి కాజా మార్క రాజన్న పేరుమండ్ల సమ్మయ్య పబ్బోజు రఘుపతి, ఎండి అజ్మత్, ఎల్కతుర్తి మొగిలి, రాపర్తి శంకర్, బాలాజీ రాజీర్ పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల అసోసియేషన్ కరీంనగర్ జిల్లా సమావేశం బండారి జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పశ్య పద్మ హాజరై మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని అగ్రిగోల్డ్ సంస్థలో పెడితే ఆ సంస్థ చేతులెత్తేసిందని, దాంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సంస్థ మోసంపై ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించిన ఫలితంగా కొంతమేరకు బాధితులకు డబ్బులు చెల్లించే బాధ్యత ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా అగ్రిగోల్డ్ బాధితులు చెల్లించిన డబ్బులు వడ్డీతో సహా చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లైసెన్సులు ఇచ్చి ప్రజల్లోకి వదిలాయని, అందుకోసమే ప్రభుత్వాలు పూర్తి బాధ్యత తీసుకొని అగ్రిగోల్డ్ యజమాన్యం మెదలు వంచి బాధితులకు న్యాయం చేయాలని పద్మ డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ సంస్థ వల్ల దోపిడీకి గురైన కస్టమర్స్, ఏజెంట్లు అని, దోపిడీ చేసిన సంస్థలపై అందరూ కలిసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. మోసపూరిత సంస్థలకు అనుమతులు ఇచ్చి, ఆర్థిక నేరగాళ్లకు లైసెన్సులు ఇచ్చి ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించి కస్టమర్లకు, ఏజెంట్లకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులకు సంస్థ నుండి రావాల్సిన డబ్బులను ఇప్పించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. డబ్బులు వచ్చేంత వరకు కస్టమర్లు, ఏజెంట్లు కలిసికట్టుగా ఉండాలన్నారు. కరీంనగర్ జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల తరపున తాము ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని, కస్టమర్లు, ఏజెంట్లు పోరాటాలకు వెనకడుపేయవద్దని పద్మ పిలుపునిచ్చారు. సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్లు ఏజెంట్లు బోయిని తిరుపతి, బుడిగ శ్రీనివాస్, బండారి జ్యోతి, బుడిగ నరేష్, తుమ్మ సత్తయ్య, రాపర్తి రవీందర్, పెద్ది అజయ్, పిట్టల కుమారస్వామి, పవ్ఞ రాజు, కొట్టే సంపత్, పవ్ఞ శ్రీనివాస్, వర్శాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతులు

యుద్ధ ప్రాతిపదికన పూర్తి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ డిమాండ్



ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ శుక్రవారం సందర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా సహాయకార్యదర్శి రెహమాన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రె శ్రీమాన్‌తో కలిసి ప్రాజెక్టు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతులు సకాలంలో చేపట్టకపోవడంతో, నేడు ఈ ప్రాంత ఆయకట్టుకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయకపోవడం వల్ల ఆరు నెలల క్రితం ప్రాజెక్టులోని నీటిని విడుదల చేసే ప్రయత్నం మరమ్మతులు నిర్మాణపనులు చేపట్టిన్నప పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతుల కోసం రూ.35కోట్లు మంజూరు చేయడంతో పాటు తొలి విడతగా 16 కోట్లు విడుదల చేయడం సానుకూల పరిణామమన్నారు. నిధులు విడుదలైన నేపథ్యంలో పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై, కాంట్రాక్టర్లపై ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు, తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకొని మరమ్మతు పనులు యుద్ధపాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంత ఆయకట్టు తోపాటు మంజీరా పరివాహక ప్రాంతాలకు కూడా నీరు అందుతుందని కాబట్టి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వలను పునరుద్ధరించడం అవసరమన్నారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ మరమ్మతు పనులు పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించి నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయించాలని నరసింహ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ గడ్డం కిరణ్ కుమార్, ఎఐఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దత్తు రెడ్డి, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆదోని నుంచి కాలినడకన హైదరాబాద్‌కు

• సిఎం రేవంత్ రెడ్డిని కలుసుకోవాలనే బలమైన ఆకాంక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకోవాలనే బలమైన ఆకాంక్షతో ఓ అభిమాని ఏకంగా కర్నూలు జిల్లా ఆదోని నుంచి కాలినడకన హైదరాబాద్ చేరుకున్నారు. ఆదోనికి చెందిన తాయన్న దాదాపు 350 కి.మీ. మేరకు కాలినడకన ప్రయాణించి, హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రిని కలుసుకుని తన అభిమానాన్ని చాటుకున్నారు. అక్టోబర్ 29న కర్నూలు జిల్లా ఆదోని నుంచి బయలుదేరిన తాయన్న, 9 రోజుల పాటు కాలినడకన ప్రయాణించి శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యమంత్రి తాయన్నను దుశ్శాలువాతో ఆత్మీయంగా అభినందించారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే విద్యాసంస్థలపై కఠిన చర్యలు



• సిఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థుల భవిష్యత్తుతో ఎవ్వరూ ఆటలాడకూడదని, ఫీజులు లేదా పరిపాలనా సమస్యల పేరుతో పిల్లల చదువును అడ్డుకోవడం సహించబోమని రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షురాలు, సిఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగించినట్టు విచారణలో తప్పిదం జరిగినట్టుగా నిర్ధారణ జరిగితే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫీజులు చెల్లించినప్పటికీ తమకు ఘట్‌కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ వ్యవహారంపై అకడమిక్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇద్దరు విద్యార్థులు సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపైన గద్వాల విజయలక్ష్మి స్పందించారు. విద్యాశాఖ ఆర్‌జెడితో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 10వ తేదీలోపు వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి సూచించారు. అలాగే ఈ అంశంపైన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు లేఖ రాశారు. విద్యార్థులకు అవసరమైన విద్యా ధ్రువపత్రాలను వెంటనే అందజేయడంతో పాటు, ఈ వ్యవహారంపైన సమగ్ర విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలు కూడా ఈ అంశాన్ని గమనించాలని, విద్యార్థులను వేధించడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం లేదా వారి విద్యకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని విజయలక్ష్మి స్పష్టం చేశారు.

కబడ్డీ ఆడిన పోలీసు అకాడమీ డైరెక్టర్



• విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన అభిలాష బిస్త్

ప్రజాపక్షం/హైదరాబాద్: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడాస్ఫూర్తిని జీవితంలో భాగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు తాను స్వయంగా కబడ్డీ మైదానంలోకి దిగి క్రీడాకారులతో కలిసి ఆడి వారిలో ఉత్సాహం నింపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో నిర్వహిస్తున్న పిఎం శ్రీ పాఠశాలల రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీల ఫైనల్ మ్యాచ్‌లను ఆమె ప్రారంభించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ప్రాథమిక పోటీల్లో ప్రతిభ కనబరిచి ఫైనల్‌కు చేరుకున్న బాలుర, బాలికల జట్ల మధ్య మ్యాచ్‌లను విశ్వంభర మైదానంలో టాస్ వేసి అభిలాష బిస్త్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆమె స్వయంగా కబడ్డీ ఆడి విద్యార్థులను ఆశ్చర్యపరిచారు. క్రీడాకారులతో మమేకమై వారిని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారా అలవడతాయని వివరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, ఎడి వేముల శ్రీనివాసరావు, పోటీల నిర్వాహకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమోటివ్, ఇవి రంగాల్లో పెట్టుబడులే లక్ష్యంగా కార్యాచరణ

• మంత్రి పొన్నం అధ్యక్షతన ఈ నెల 11న ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) రంగాల్లో కీలక పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 నేపథ్యంలో ఆటోమోటివ్, ఇవి రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆటోమోటివ్, ఇవి రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం నవంబర్ 11న తెలంగాణ సచివాలయంలో జరగనుంది. సుమారు 25 మంది పరిశ్రమల ప్రతినిధులు కౌన్సిల్‌లో భాగస్వాములయ్యేందుకు ఇప్పటికే అంగీకరించారు. సమావేశాన్ని హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో కొనసాగుతున్న ఆటోమోటివ్, ఇవి ప్రాజెక్టులు, కొత్త పెట్టుబడి ప్రతిపాదనలు, కంపెనీల విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ అవకాశాలపై పరిశ్రమల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించనుంది. గ్లోబల్ సమ్మిట్‌తో పాటు నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ కంపెనీల భాగస్వామ్యంపైనా చర్చించనున్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు, ఇతర సమస్యలపై ప్రతినిధుల సూచనలు స్వీకరించడంతో పాటు, గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమోటివ్, ఇవి రంగాలకు సంబంధించిన ప్రత్యేక చర్చా వేదికల అంశాలను ఖరారు చేయనున్నారు. ప్రభుత్వం పరిశ్రమల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఇరిగేషన్ పనులు

• తుంగపహాడ్‌లో 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
• ఉమ్మడి నల్గొండ ప్రాజెక్టులకు ఇది గోల్డెన్ పీరియడ్

ప్రజాపక్షం/మిర్యాలగూడ: చరిత్రలో నిలిచిపోయేలా ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం సమీపంలోని తుంగపహాడ్ వద్ద రూ.33 కోట్లు వ్యయంతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ 5 సంవత్సరాల పాలనలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ఇది బంగారు కాలంగా మిగిలిపోతుందన్నారు. తమ హయాంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తుమ్మిడిహట్టి ప్రాజెక్టు పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని బస్వాపూర్, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, తోపుచర్ల, కేశవాపూర్, కొండ్రపోలు, దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. దామరచర్ల మండలం శాంతి నగర్, రావులపెంట వాగులపై ఒక్కొక్కటి రూ.9 కోట్లు వ్యయంతో చెక్ డ్యాములను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వజీరాబాద్ మేజర్ లైనింగ్ పనులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని, అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు వివరించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా రాష్ట్రంలో గత 3 సంవత్సరాలలో మొదటి విడత 4 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు అందించడం జరిగిందని, రెండవ విడత పనులు కూడా ప్రారంభమైనట్లు తెలిపారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 3,600 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అసంపూర్తిగా మిగిలిపోయిన 1,000 ఇళ్లను పూర్తి చేసి పేదలకు తక్షణమే అందజేయాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పూర్తయితే గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చని, నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్లను పూర్తి చేయాలని సూచించారు. నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రానివారు నిరాశ పడవద్దని, విడతలవారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. వచ్చే విడతలో మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో భారీ ఇందిరమ్మ ఇళ్ల కాలనీ చేపట్టి నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామన్నారు. తుంగపహాడ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో తన ఎంపీ నిధుల నుండి గ్రంథాలయం, ఓపెన్ జిమ్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దామరచర్ల–రాజాగట్టు అండర్ పాస్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 7 ఎకరాల 24 గుంటల స్థలంలో 24 బ్లాకుల్లో 560 ఇళ్లను తుంగపహాడ్ వద్ద నిర్మించి పేదలకు ఇవ్వడంతో వారి సొంతఇంటి నిరీక్షణ ఫలించిందన్నారు. నూతనంగా ప్రారంభించిన కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పార్కు, విద్యుత్తు, దేవాలయం వంటి అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. సుమారు రూ.33 కోట్లు నిధులతో నిర్మించిన ఈ కాలనీకి అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ ప్రారంభంతో పాటు మిర్యాలగూడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అడవిదేవులపల్లి మండల తహశీల్దార్ కార్యాలయాల పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని వివరించారు. అనంతరం మంత్రులు, శాసనమండలి చైర్మన్ లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంటిలో దీపావళి' గోడపత్రికను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, సర్పంచ్ గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష, డివిజన్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రైతు భరోసా పేరుతో సైబర్ వల!

• వ్యవసాయ శాఖ అధికారిక ఎస్ఎంఎస్ హెడర్‌తో 2.73 లక్షల సందేశాలు
• ప్రభుత్వ అనుమతి లేకుండానే రైతులకు నిధుల జమ సమాచారం.. సైబర్ క్రైమ్ కేసు నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్: రైతు భరోసా నిధుల జమ పేరుతో రైతుల ఫోన్లకు భారీగా ఎస్ఎంఎస్‌లు! ప్రభుత్వ పథకం సమాచారాన్ని చేరవేసే వ్యవసాయ శాఖ అధికారిక గుర్తింపుతోనే లక్షలాది సందేశాలు పంపిన వ్యవహారం సైబర్ కలకలం రేపుతోంది. శాఖ అనుమతి లేకుండానే రెండు రోజుల్లో ఏకంగా 2,73,128 ఎస్ఎంఎస్‌లు రైతులకు చేరడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ గుర్తింపును ఎవరు దుర్వినియోగం చేశారు? రైతులను తప్పుదోవ పట్టించేందుకు ఏదైనా కుట్ర జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.వ్యవసాయ శాఖ ఉప సంచాలకురాలు ఎస్.నీలిమ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులకు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని పంపేందుకు వ్యవసాయ శాఖ సిడిఏసి ఎస్ఎంఎస్ సేవలను వినియోగిస్తోంది. నవంబర్ 4న రైతు భరోసా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు సందేశాలు అందుతున్నాయని క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సందేశాలను పరిశీలించిన అధికారులు, అవి 'ADTGAGRLS' అనే వ్యవసాయ శాఖ అధికారిక ఎస్ఎంఎస్ హెడర్ ద్వారా వచ్చినట్లు గుర్తించారు. సందేశాల నమూనా కూడా శాఖ గతంలో పంపిన అధికారిక సమాచారాన్ని పోలి ఉండటంతో వ్యవహారం తీవ్రతరమైంది. సిడిఏసి అధికారులను సంప్రదించి ఎస్ఎంఎస్ వినియోగ నివేదికను కోరగా, నవంబర్ 3, 4 తేదీల్లో మొత్తం 2,73,128 సందేశాలు పంపిణీ అయినట్లు వెల్లడైంది. అయితే ఈ సందేశాల ప్రసారానికి వ్యవసాయ శాఖ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, అధికారికంగా పంపిణీ ప్రారంభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. శాఖకు చెందిన ఎస్ఎంఎస్ వ్యవస్థను అనధికారికంగా వినియోగించారా? అధికారిక హెడర్‌ను దుర్వినియోగం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సందేశాల మూలాన్ని గుర్తించి, వాటిని రూపొందించి పంపిన వ్యక్తులు లేదా సంస్థలను వెలుగులోకి తేవాలని, ఎస్ఎంఎస్ గేట్‌వే దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప సంచాలకురాలు కోరారు. రైతులకు అందిన సందేశాల స్క్రీన్‌షాట్‌లు, సిడిఏసి నివేదికను పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు మేరకు టిజిసిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' సంబురాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని పేదల సొంత ఇంటి కలను నిజం చేస్తూ అనేక జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రాంగణాల్లో దీపావళి పండుగ సంబురాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో ప్రత్యేక ఉత్సవాలను చేపడుతున్నట్లు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు పూర్తి అయిన రెండు లక్షల ఇందిరమ్మ ఇండ్ల వద్ద దీపాలు వెలిగించి పండుగను శోభాయమానంగా జరపనున్నట్లు తెలిపారు. పారదర్శకంగా మంజూరు చేసిన 5.50 లక్షల ఇండ్లలో ఇప్పటివరకు 2 లక్షల ఇండ్లు పూర్తి కాగా, లబ్ధిదారులకు సుమారు రూ. 8,000 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. ప్రతి ఇంటి ముందు కుటుంబ సభ్యుల సమక్షంలో దీపాలు వెలిగించేలా క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు ఇప్పటికే తగిన సూచనలిచ్చామన్నారు. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొననున్నారు. లబ్ధిదారులు తమ కుటుంబ సమేతంగా జరుపుకునే పండుగ ఫొటోలను 'ఇందిరమ్మ ఇండ్లు' మొబైల్ యాప్‌తో పాటు సోషల్ మీడియా వేదికల్లో అప్‌లోడ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే హైదరాబాద్ మహానగర పరిధిలోని 16 నియోజకవర్గాల్లో చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' ప్రాజెక్టు సైట్లలో కూడా దీపావళి సంబురాలు జరగనున్నాయి. లబ్ధిదారులు రాబోయే రోజుల్లో తాము నివసించబోయే సొంత ఇంటి ప్రాంగణంలో, భవిష్యత్తు ఇరుగుపొరుగు కుటుంబాలతో కలిసి ఈ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. పండుగ నాడు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో టవర్స్ లబ్ధిదారులందరూ పాల్గొనాలని అధికారులు కోరారు. త్వరలో గృహప్రవేశాలు చేసుకుని వచ్చే ఏడాది దీపావళిని సొంత ఇంట్లో మరింత ఆనందంగా జరుపుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గౌతం తెలిపారు.

అమెరికా సంస్థలతో సింగరేణి భాగస్వామ్యం

• కీలక ఖనిజాల్లో విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిశోధన భాగస్వామ్యానికి ఆహ్వానం: సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి
• రేర్ ఎర్త్ ఎలిమెంట్లు, జియోసైన్స్ ల్యాబ్‌పై అమెరికా ఆసక్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కీలక ఖనిజ రంగంలో అమెరికా సంస్థలతో సాంకేతిక, పరిశోధన, వ్యాపార భాగస్వామ్యాలకు సింగరేణి సిద్ధంగా ఉందని ఆ సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు, సాంకేతిక, పరిశోధన సంస్థల భాగస్వామ్యాన్ని సింగరేణి కోరుకుంటోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం సింగరేణి భవన్‌లో సిఎండితో సమావేశమైంది. సింగరేణి ఇప్పటికే కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించి, పలు దేశాలతో సాంకేతిక సహకారం, ఉమ్మడి భాగస్వామ్యంపై చర్చలు జరుపుతోందని సిఎండి వివరించారు. అమెరికాలోని పలు సంస్థలు కూడా కీలక ఖనిజ రంగంలో సింగరేణితో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కాన్సులేట్ ప్రతినిధులు తెలిపారు. వచ్చే ఏప్రిల్‌లో అమెరికాలో జరిగే కీలక ఖనిజ సదస్సులో పాల్గొనాల్సిందిగా సింగరేణిని ఆహ్వానించారు. కొత్తగూడెంలో సింగరేణి ఏర్పాటు చేసిన జియోసైన్స్ ల్యాబొరేటరీ, ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్‌లో దాగి ఉన్న రేర్ ఎర్త్ ఎలిమెంట్లపై అమెరికా బృందం ప్రత్యేక ఆసక్తి చూపింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో కీలక ఖనిజ రంగంలో సంస్థ విస్తరిస్తోందని సిఎండి తెలిపారు.



డేటా సెంటర్లకు సింగరేణి ప్రాంతంలో అవకాశాలు..
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నామని అమెరికా ప్రతినిధులు తెలిపారు. తెలంగాణలోని సింగరేణి ప్రాంతంలోనూ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మూతపడిన ఓపెన్‌కాస్ట్ గనుల ప్రాంతాల్లో సింగరేణి ప్రతిపాదిస్తున్న పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ద్వారా డేటా సెంటర్లకు పీక్ అవర్స్‌లో నిరంతర విద్యుత్ అందించే అవకాశాలపై చర్చించారు. తగిన పెట్టుబడులు, భాగస్వామ్యంతో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని సింగరేణి అధికారులు వివరించారు. సమావేశంలో అమెరికన్ కాన్సులేట్ పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్, పొలిటికల్, ఎకనామిక్ స్పెషలిస్టులు శ్రీమలికరి, శిబా త్రిపాఠి, కమర్షియల్ స్పెషలిస్ట్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. సింగరేణి తరపున డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్లు టి.శ్రీనివాస్ (మార్కెటింగ్ అండ్ కోఆర్డినేషన్), కె.రామదాసు (బిజినెస్ డెవలప్‌మెంట్), పంకజ్ కులశ్రేష్ఠ (ఎక్స్‌ప్లోరేషన్), గురుప్రసాద్ (పవర్ ప్రాజెక్ట్స్) తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ క్యాబ్‌లకు అనుమతులిస్తే ఉద్యమం



• కార్పొరేట్ సంస్థలకు క్యాబ్‌లు ఇవ్వడం అన్యాయం: బి.వెంకటేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర ఆటో క్యాబ్ డ్రైవర్స్ అండ్ ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో కొత్తగా ఎస్ఎం గ్రీన్ క్యాబ్‌ల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ఒక్కొక్కరికి వెయ్యి క్యాబ్‌లు కేటాయించడం వల్ల వేలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కిలోమీటరుకు రూ.9కే ప్రయాణం అంటూ గ్రీన్ క్యాబ్‌లను రోడ్లపైకి తీసుకురావడం వల్ల ఇప్పటికే ఉపాధి కోసం ఇబ్బందులు పడుతున్న డ్రైవర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఇలాంటి భారీ స్థాయిలో క్యాబ్‌లను కేటాయిస్తే లక్షలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నది ప్రజలు, కార్మికులు మోసపోవడానికా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్ఎం గ్రీన్ క్యాబ్‌లకు అనుమతులు ఇవ్వకుండా డ్రైవర్ల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎం.కృష్ణ, నాయకులు ఎం.శ్రీనివాస్, జి.ఇంద్రసేనగౌడ్‌పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులకు అవమానం



ప్రజాపక్షం/ సిద్దిపేట : ఆర్‌టిసి కార్మికులు తమ సమస్యలపై పరిష్కరించాలని కోరుతూ కార్మికులు డిఎం వద్దకు వెళ్లితే కార్మికులను కింద కూర్చోబెట్టి అవమానంచిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కా ర్మికులు తమ తమ సమస్యలపై పరిష్కారం కోరుతూ డిఎం శ్రీనివాస్ వద్దకు వెళ్లితే కార్మికులపట్ల కనీస మర్యాద లేకుండా కింద కూర్చోబెట్టి మాట్లాడటంపై ఆర్‌టిసి జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి కార్మికులను చిన్నచూపు చూస్తున్న సిద్దిపేట ఆర్‌టిసి డిఎం శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి జెఎసి సిద్దిపేట చైర్మన్ మల్లేశం డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలవగా కనీస తోటి కార్మికులను చూడకుండా మర్యాద లేకుండా మాట్లాడినట్లు తెలిపారు. కనీసం గంటన్నర నేలపైన కూర్చుని తమ సమస్యలను డిఎం ముందు వివరించామన్నారు. కార్మికుల పట్ల డిఎం వ్యవహరిస్తున్న శైలి సరిగ్గా లేదన్నారు. గత ఆరు నెలల క్రితం సిద్దిపేట డిపోకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్ నడుపుతున్న బస్సు మేడ్చల్ జిల్లా తుర్కపల్లి వద్ద ప్రమాదానికి గురి అయితే అతనిని ఆరు నెలలపాటు సస్పెండ్ చేశాడని తెలిపారు. ప్రస్తుతం ఇదే డ్రైవర్ శ్రీనివాస్‌ను రిమూవ్ చేస్తానని అంటున్నాడన్నారు. ఇప్పటికే ఆరు నెలల పాటు శిక్ష పడిందని రిమూవ్ చేస్తే ఆ డ్రైవర్ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేలపై కూర్చున్న వారిలో ఆర్‌టిసి జెఎసి నాయకులు రవీందర్ గౌడ్, డివై రెడ్డి, శ్రీనివాస్, అశోక్, కార్మికులున్నారు.

కుర్చీలపై కూర్చోమంటే నేలపై కూర్చున్నారు : ఆర్‌టిసి డిఎం శ్రీనివాస్
సమస్యలపై తన ఛాంబర్‌లోకి వచ్చిన ఆర్‌టిసి కార్మిక నాయకులను తాను కుర్చీలపై కూర్చోమంటే వాళ్లే నేలపై కూర్చున్నారని సిద్దిపేట ఆర్‌టిసి డి ఎం.శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. తాను కార్మికులను ఎంతో గౌరవిస్తానన్నారు. ఆర్‌టిసి జెఎసి నాయకులు వివరించిన సమస్యలపై తాను సానుకూలంగా స్పందించానని అయినా తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఆర్‌టిసి కార్మికులు అంటే ఇంత చిన్న చూపా? : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు
ఆర్‌టిసి కార్మికులు అంటే ఆర్‌టిసి డిఎంకు ఇంత చిన్నచూపా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హ రీష్ రావు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. సమస్యల పరిష్కారాన్ని కోసం అడగడానికి వచ్చిన ఆర్‌టిసి జెఎసి నాయకులను, కార్మికులను కుర్చీలో కూర్చోబెట్టకుండా నేలపై కూర్చోబెట్టి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఆర్‌టిసి జెఎసినాయకులను, కార్మికులను చిన్నచూపు చూసిన ఆర్‌టిసి సిద్దిపేట డిపో డిఎం శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి డిఎం వ్యవహార శైలిపై విచారణకు ఆదేశించిన మంత్రి పొన్నం
ఆర్‌టిసి డిఎం శ్రీనివాస్ ఆర్‌టిసి జెఎసి, కార్మికులను కింద కూర్చో పెట్టి మాట్లాడాలని సోషల్ మీడియాలో ఫోటో వైరల్ కావడంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఆర్‌టిసి కార్మికుల పట్ల డిఎం వ్యవహరించినశైలిపై విచారణకు ఆదేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఆర్‌టిసి ఎండితో మాట్లాడడం జరిగిందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులని తేలితే చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమంతో పాటు వారి ఆత్మ గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

ఎస్‌టి కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలి

• టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్‌టి కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని, వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పని చేయాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లను కలిపి ఒకే కమిషన్‌గా ఏర్పాటు చేయడంతో అటు ఎస్‌సిలకు, ఎస్‌టిలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని, ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రశ్నించామని తెలిపారు. తమ డిమాండ్ మేరకే రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టిలకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందన్నారు. కవిత శుక్రవారం తన ట్విట్టర్‌లో (ఎక్స్) ట్వీట్ చేశారు.

పేపర్ మిల్లు కార్మికులను ఇబ్బంది పెడితే ఉద్యమిస్తాం
సిర్పూర్ కాగజ్ నగర్ పేపర్ మిల్లు, సర్ సిల్క్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కార్మికులకు తొలగించడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) కల్వకుంట్ల కవిత అన్నారు. సర్ సిల్క్ సంస్థ మూతపడినప్పటికీ ఆ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 25 ఏళ్లుగా అక్కడే ఉంటున్న కార్మికులను వారం రోజుల్లో ఖాళీ చేయమంటారా?, 12 ఏళ్లపై బడి నివాసం ఉంటే ఆ స్థలం కార్మికులకే ప్రాపర్టీ హోల్డింగ్ రైట్స్ వస్తాయని కవిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులను ఇబ్బంది పెడితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్మికులకు నోటీసులు వచ్చిన వారిలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ కూడా ఉన్నారన్నారు.

దీపావళి తాత్కాలిక వ్యాపార లైసెన్స్ ఫీజులు తగ్గించాలి : పొన్న

ప్రజాపక్షం/హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల తాత్కాలిక వ్యాపారులపై జిహెచ్ఎంసి విధిస్తున్న భారీ లైసెన్స్ ఫీజులను వెంటనే తగ్గించాలని బిజెపి భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకట్ రమణ డిమాండ్ చేశారు. జిహెచ్ఎంసి కమిషనర్‌కు శుక్రవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. రిటైల్ వ్యాపారులకు రూ. 13,310, హోల్‌సెల్ వ్యాపారులకు రూ. 79,860గా ఫీజులు నిర్ణయించడం కేవలం కొన్ని రోజులు వ్యాపారం చేసే చిరు వ్యాపారులపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రంజాన్ మాసంలో సుదీర్ఘకాలం వ్యాపారం చేసే వారికి అమలవుతున్న విధానాల మాదిరిగానే, అన్ని పండుగలకు ఒకే విధమైన న్యాయమైన లైసెన్స్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రిటైల్ ఫీజును రూ. 1,000కి, హోల్‌సేల్ ఫీజును రూ. 5,000కు పరిమితం చేయడంతో పాటు, తాత్కాలిక అనుమతుల కోసం 'సింగిల్ విండో సిస్టమ్'ను ప్రవేశపెట్టాలని ఆయన కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

ధరలు పెరిగినందుకే భవనాలు స్వాధీనం చేసుకుంటున్నారు : శ్రీనివాస్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: భూముల ధరలు పెరిగినందుకే సిఎం రేవంత్ రెడ్డి బిసి ఆత్మ గౌరవ భవనాలను స్వాధీనం చేసుకుంటున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలిసే జిఒ 14ను జారీ చేశారా? అని ప్రశ్నించారు. తమకు తెలియకుండానే జిఒలు జారీ చేస్తున్నారని మంత్రులు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్,మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిఒ 14 అంశంపైన రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ సంఘటితం చేస్తామన్నారు.బిసిలను మళ్ళీ బానిసలు చేసే కుట్ర జరుగుతోందన్నారు. జిఒ 14 అంశంపైన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి, తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ బిసిల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే కెసిఆర్ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 14ను యాధాతదంగా అమలు చేయాలన్నారు. ఈ జివోను రద్దు చేయక పోతే పోరాటాలు తప్పవరి హెచ్చరించారు. బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ బిసి పట్ల సిఎం రేవంత్ రెడ్డికి ఎందుకు చిన్నచూపు అని ప్రశ్నించారు.



26న డబుల్ ఇళ్ళు పంపిణీ



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ప్రజల ప్రతీ అకాంక్షలు నెరవేర్చే దిశగా సమున్నత అభివృద్ధి సాధిస్తూ సంక్షేమం పథకాలతో విశ్వాసం పొందుతున్న ప్రభుత్వం కాంగెస్‌ది అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. పోచంపల్లి మండలంలోని జిబ్లక్ పల్లి,వంకమామిడి గ్రామాలలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. కమ్యూనిటీ భవనాలు,హెల్త్ సెంటర్‌లను ప్రారంభించారు.జిబ్లక్ పల్లి గ్రామంలో డబుల్ బెడ్ పరిశీలించి యధాతదంగా ఎంపిక చేసిన లబ్దిదారులకు పంపిణి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్,మంచినీటి వసతి,డ్రైనేజి వసతులతో లబ్దిదారులకు ఈ నెల 26వరకు అందజేసి గృహ ప్రవేశాలు చేసేల సంబందిత అధికారులను ప్రజాప్రతినిధులను కోరారు. రూ.20లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో నిర్మించిన రజక సంఘం భవనాన్ని,రూ.28లక్షలతో ఆయుష్మాన్ ప్రాథమిక అరోగ్యకేంద్రాన్ని అయన ప్రారంభించారు.సిసి రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. వంకమామిడి గ్రామంలో రూ.28లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని, రూ.10లక్షలతో నిర్మించిన సిసిరోడ్డును ప్రారంభించారు.ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆర్ల కావ్య వెంకటేషం మచ్చ శ్రీనివాస్ పోచంపల్లి, జూలూరు పిఎసిఎస్ చైర్మన్స్ పాక మల్లేష్ యాదవ్ కళ్ళెం రాఘవ రెడ్డి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ,ఎండివో విజయ, సింగిల్ విండో వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్ రెడ్డి మార్కెట్ కమిటి డైరెక్టర్ ఆర్ల ఐలయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎఇఇ పరీక్షలు



నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఈఈ సివిల్, ట్రాన్స్‌పోర్ట్,ఆర్ అండ్ బి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన ఈ పరీక్షలు నిర్వహిస్తున్న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు.రెండు రోజుల పాటు నిర్వహించే ఏఈఈ సివిల్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బి పరీక్షలకు 179 మంది అభ్యర్థులను కేటాయించగా, ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు,అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన మొదటి రోజు పరీక్షకు 104 మంది అభ్యర్థులు హాజరుకాగా,75 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని,తాగునీరు,టాయిలెట్లు,ఇతర సౌకర్యాలు ప్రతిరోజూ పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. ఈ తనిఖీలో ఫ్లైయింగ్ స్క్వాడ్,సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శశికళ,పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలం రెడ్డి,డిపార్ట్‌మెంటల్ అధికారి,పరిశీలకులు,నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, టీజీపీఎస్సీ స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాపక్షం/తుర్కపల్లి; తుర్కపల్లి మండల కేంద్ర గ్రామ పంచాయతీలో నీరు, పారిశుద్ధ్యం పరిశుభ్రత (వాష్) కోసం శుక్రవారం ఎంహెచ్ఆర్సీ ప్రత్యేక పర్యవేక్షకుడు డాక్టర్ అనిమేష్ భట్టాచార్య క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నీటి సరఫరాకు సంబంధించిన పరిసరాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు.ఆయన వెంట డిపిఓ మిషన్ భగీరథ ఈఈ, డిఎంహెచ్ఓ,డిఎల్పిఓ,మిషన్ భగీరథ డిఈఈ, ఎంపిఓ, ఎంఈఓ, మండల వైద్య,విద్యా శాఖ సిబ్బంది, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఇఇ ఇంట్రా,సర్పంచ్ సోమల్ల వెంకటేష్ ఉన్నారు.

పోలీసుల ఆరోగ్యానికి 'ఫిట్ కాప్' భరోసా

90 వేల మందికి పైగా సిబ్బందికి ఆరోగ్య పర్యవేక్షణ..
వ్యాధుల ముప్పును ముందే గుర్తించేలా ప్రత్యేక యాప్



ప్రజాపక్షం/హైదరాబాద్: నిరంతర విధులు.. పని ఒత్తిడి.. సమయాభావం.. వెరసి పోలీసు సిబ్బంది ఆరోగ్యం నిర్లక్ష్యానికి గురవుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించే లక్ష్యంతో 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రత్యేక యాప్ ద్వారా ఆరోగ్య వివరాలను సేకరించి, వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు.హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో రూపొందించిన ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ విధానంపై శుక్రవారం డిజిపి కార్యాలయంలో ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఫిట్ కాప్' అమలు విధానం, కార్యాచరణను డిజిపి వివరించారు. 30 నుంచి 45 రోజుల్లో కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.ప్రత్యేక యాప్‌లో ఎనిమిది ప్రధాన ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పాటు వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. సిబ్బంది తమ సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, శరీర ద్రవ్యరాశి సూచీ (బిఎంఐ), ఇతర ఆరోగ్య సమస్యలు, జీవనశైలి అలవాట్లు, శారీరక శ్రమ, ధూమపానం, మద్యపానం తదితర అంశాలపై సమాచారం సేకరిస్తారు. ఈ వివరాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా గుర్తిస్తారు.ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్‌సెంటర్ ద్వారా సంబంధిత సిబ్బందికి సమాచారం అందిస్తామని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల ద్వారా చికిత్స, ఆరోగ్య సూచనలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.పోలీసుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వ్యాధులు తీవ్రరూపం దాల్చకముందే నివారణ చర్యలు చేపట్టడం 'ఫిట్ కాప్' ప్రధాన లక్ష్యమని డిజిపి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసి ప్రతి పోలీసు ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనర్, ఎడిజి అకున్ సబర్వాల్, ఐజి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్, భద్రత, ఆరోగ్య భద్రత కార్యదర్శి (రిటైర్డ్) ఉదయ్‌కుమార్‌రెడ్డి, టిస్పార్క్ ఎస్‌పి రూపేష్, ఎసపి అవినాష్, ఇతర పోలీసు అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దీపావళి వేళ అప్రమత్తతే అసలైన రక్షణ

7,601 బాణసంచా విక్రయ లైసెన్సులు జారీ
ఏర్పాట్లను సమీక్షించిన ఫైర్ డిజి విక్రమ్‌సింగ్‌మాన్



ప్రజాపక్షం/హైదరాబాద్: దీపావళి వెలుగులు విషాదాలకు దారితీయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ అగ్నిమాపక శాఖ సూచించింది. బాణసంచా వినియోగంలో నిర్లక్ష్యం ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతుందని హెచ్చరిస్తూ.. పండుగను సురక్షితంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ సమీక్షించారు. పండుగ వేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. దీపావళి సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాణసంచా సురక్షిత వినియోగం, వాటిని కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు భద్రతా నియమాలను వివరించడం ద్వారా ప్రమాదాలు, గాయాలను నివారించేందుకు శాఖ చర్యలు చేపట్టింది.రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా విక్రయాలకు సంబంధించి తెలంగాణ అగ్నిమాపక శాఖ 7,601 లైసెన్సులు జారీ చేసింది. నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా విక్రయాలు జరిగేలా పర్యవేక్షణ చేపడుతోంది. పండుగ సమయంలో అగ్నిప్రమాదాల ముప్పును తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. బాణసంచాను అధీకృత విక్రయదారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలని డీజీ సూచించారు. బాణసంచా కాల్చేటప్పుడు తగినంత సురక్షిత దూరం పాటించాలని, పిల్లలు వాటిని వినియోగించే సమయంలో పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని కోరారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే వెంటనే అదుపు చేసేందుకు సమీపంలో నీరు లేదా ఇతర అగ్నిమాపక ఏర్పాట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.అసురక్షిత పద్ధతులకు దూరంగా ఉంటూ అగ్నిప్రమాదాల నివారణలో ప్రజలు అగ్నిమాపక శాఖకు సహకరించాలని విక్రమ్ సింగ్ మన్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సురక్షితమైన, సంతోషకరమైన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఒకే రోజు... టికెట్ తనిఖీలతో
రూ.1.18 కోట్ల ఆదాయం

దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో సరికొత్త రికార్డు.. 11,150 మందిపై కేసులు



ప్రజాపక్షం/హైదరాబాద్: పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని టికెట్ లేకుండా ప్రయాణించే వారిపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు కొరడా ఝుళిపించారు. దీపావళి, ఛఠ్ పండుగల నేపథ్యంలో నవంబర్ 5న నిర్వహించిన ప్రత్యేక టికెట్ తనిఖీల్లో ఒక్కరోజే ఏకంగా రూ.1.18 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి సరికొత్త రికార్డు సృష్టించారు. టికెట్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించిన 11,150 మందిపై కేసులు నమోదు చేసి జరిమానాల రూపంలో ఈ మొత్తాన్ని వసూలు చేశారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ మూడు డివిజన్లలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే ఆదేశాల మేరకు రోజంతా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జోన్ విభజన అనంతరం 2026 జూన్ నుంచి ఇప్పటివరకు ఒకే రోజులో టికెట్ తనిఖీల ద్వారా నమోదైన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషం. సాధారణంగా రోజుకు సగటున 4,373 కేసులు నమోదు కాగా, సుమారు రూ.33.44 లక్షల ఆదాయం వస్తోంది. అలాంటిది ఒక్కరోజే రూ.1.18 కోట్ల ఆదాయం రావడం గమనార్హం.ఈ రికార్డు ఆదాయంలో సికింద్రాబాద్ డివిజన్ అత్యధికంగా రూ.1.02 కోట్ల వాటాను అందించింది. టికెట్ తనిఖీల్లో పురుష ఉద్యోగులతోపాటు 117 మంది మహిళా టికెట్ తనిఖీ సిబ్బంది కూడా చురుగ్గా పాల్గొన్నారు. రిజర్వుడు, అన్‌రిజర్వుడు బోగీల్లో టికెట్ లేకుండా ప్రయాణించేవారిని, సరైన ప్రయాణ అనుమతులు లేనివారిని గుర్తించి చర్యలు తీసుకున్నారు.టికెట్ లేకుండా ప్రయాణించేవారిని నియంత్రించడంతోపాటు చెల్లుబాటు అయ్యే టికెట్లతో ప్రయాణించే నిజమైన ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని రైల్వే అధికారులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి విస్తృత తనిఖీలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య విభాగం, టికెట్ తనిఖీ సిబ్బందిని అభినందించారు. నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడంతోపాటు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంలో సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నల్లవెల్లి రామిరెడ్డి



స్మారక స్థూపావిష్కరణలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/డిండి: ప్రజానాట్యమండలి కళాకారుడిగా నల్లవెల్లి రాంరెడ్డి ప్రజలను చైతన్యం చేస్తూ దేవరకొండ నియోజకవర్గ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నిర్విరామంగా కృషి చేశారని కమ్యూనిస్టు పార్టీకి కామ్రేడ్ నల్లవెల్లి రాంరెడ్డి చేసిన సేవలు మరువలేనివని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం డిండి మండలంంలోని కందుకూరు గ్రామంలో కామ్రేడ్ నల్లవెల్లి రాంరెడ్డి దశదినకర్మలో భాగంగా ఇంటి వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని నూతనంగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని పల్లా వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఆనాడు ప్రజానాట్యమండలి కళాకారునిగా రాంరెడ్డి ప్రజలను చైతన్య పరుస్తూ పార్టీ బలోపేతానికి విరామమెరుగని కృషి చేశారని, ప్రజానాట్యమండలిలో నియోజకవర్గ అధ్యక్షులుగా, జిల్లా సహాయ కార్యదర్శిగా, కమ్యూనిస్టు పార్టీ మండల కార్యవర్గ సభ్యులుగా, పిఏసిఎస్ వైస్ చైర్మన్‌గా, నీటి సంఘం చైర్మన్‌గా, సిపిఐ కందుకూరు గ్రామశాఖ కార్యదర్శిగా ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు. పార్టీ నిర్ణయించే కార్యక్రమాలలో కమ్యూనిస్టు పార్టీలో ఆయన ప్రస్థానం మొదలైన నాటి నుండి పార్టీ నాయకునిగా విరామం ఎరగని కమ్యూనిస్టుగా నల్లవెల్లి రాంరెడ్డి పార్టీలో కొనసాగడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ యాదగిరిరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, శైలేష్, రంగారెడ్డి, రామస్వామి, మండల కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, హుస్సేన్, నాయకులు శ్రీను,చక్రి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు ధర తగ్గింపుపై
అన్నదాతలు ఆగ్రహం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ధాన్యం కొనుగోలు ధర తగ్గింపుపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లోని సాగర్ రోడ్డుపై రైతులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. గత 20 రోజుల నుండి క్వింటాకు సన్న ధాన్యం రూ.4,000 నుండి రూ.4,200కు కొనుగోలు చేసిన మిల్లర్లు నేడు సిండికేట్‌గా మారి రూ.3,700 లకు మాత్రమే తీసుకుంటామని అనడం పట్ల రైతులు నిరసన తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మిల్లర్లు దోచుకోవటం ఏంటని, రైతుల పట్ల ఇంత వివక్ష చూపుతుండటంతో ఆందోళన చెందారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగుంటి పోవడం, పంటలకు తెగుళ్లు సోకి దిగుబడులు దారుణంగా దిగజారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనుకూల వాతావరణంతో మంచి దిగుబడులు వచ్చి క్వింటాకు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు ధర పలకగా, ఈసారి పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి నీటి కొరతతో పంట కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నామని తెలిపారు. కొమ్ము కుళ్లు, ఆకు ముడత వంటి తెగుళ్ళ, చీడపీడల నివారణకు మందులు చల్లి ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమకు మిల్లర్ల కోతతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేకుండా పోతోందని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ధర్నా కారణంగా సాగర్ రోడ్డుపై వందలాది ధాన్యం ట్రాక్టర్లు నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. మిల్లర్లతో మాట్లాడి ధాన్యం క్వాలిటీకి తగ్గ ధరలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. క్వాలిటీ ఉన్న ధాన్యానికి క్వింటాకు రూ.3,950 చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో అన్నదాతలు ధర్నా విరమించారు.

వాహన ఉద్గారాలతోనే భారీగా వాయుకాలుష్యం

దీపావళితో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించాలి
ఆంక్షలు విధించడం వల్లే కాలుష్య సమస్య పరిష్కారం కాదు : సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : దీపావళి వేడుకలతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. కేవలం ఆంక్షలు విధించడం వల్లే కాలుష్య సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పండుగల సమయంలో పాటించే ఆచారాలు, పద్ధతులను కూడా పరిశీలించాలని సూచించింది. ఢిల్లీ వాయు కాలుష్యంపై సుమోటోగా విచారణ జరుపుతున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. కాలుష్య సంక్షోభానికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను నిందించవద్దని హెచ్చరించింది. ఢిల్లీ– ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలే ప్రధాన కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీని గాజియాబాద్, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలతో కలిపే రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోందని ధర్మాసనం ప్రస్తావించింది. రోడ్లపై తిరుగుతున్న వాహనాల రకాలను పరిశీలిస్తే కాలుష్యానికి ప్రధాన కారణం అర్థమవుతుందని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. 'మనం మాట్లాడుతూనే ఉంటాం. కొన్నిసార్లు ప్రకటనలు, సూచనలు చేస్తుంటాం. కానీ అసలు విషయం ఏమిటంటే ఏక్యూఐ ఇప్పటికే 400కి చేరువలో ఉంది అని ఆయన అన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. కాలుష్య నియంత్రణ చర్యల విషయంలోపరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. రోడ్లపై ఆధారపడి జీవనోపాధి పొందే పేద ప్రజలే కాలుష్య సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ముఖ్యంగా పండుగల సమయంలోనే అనేకమందికి ఉపాధి లభిస్తుందని గుర్తుచేసింది. అందువల్ల కాలుష్య నియంత్రణ పేరుతో పేదల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

పంట వ్యర్థాల దహనంపై రైతులకు అవగాహన

పంట గడ్డిని కాల్చడం వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడానికి బదులుగా యంత్రాలను ఉపయోగించేలా ప్రోత్సహించాలని పేర్కొంది. పంట వ్యర్థాలను కాల్చడం వెనుక ఉన్న ఆర్థిక అంశాలను రైతులకు వివరించాలని తెలిపింది. ప్రత్యామ్నాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తే రైతులు పంట వ్యర్థాలను కాల్చడం మానుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

పాఠశాలల నిర్వహణపై నిపుణుల అభిప్రాయం

వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) నిర్దిష్ట స్థాయికి మించి పెరిగితే అన్ని వయసుల విద్యార్థుల కోసం పాఠశాలలను మూసివేయాలని లేదా హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన ధర్మాసనం, నిపుణుల అభిప్రాయాల మేరకే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం వాయు కాలుష్య నియంత్రణ నిబంధనలపై విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం, ఇతర అధికారుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు సంబంధించిన చర్యలను కోర్టుకు వివరించారు.

కాలుష్య నియంత్రణకు ఐదు ప్రధాన రంగాలు

కాలుష్య నియంత్రణకు రూపొందించిన నిబంధనల చట్రంలో ఐదు ప్రధాన రంగాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఐశ్వర్య భాటి తెలిపారు.

పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం, నిర్మాణంకూల్చివేతల వల్ల వెలువడే ధూళి, రోడ్లపై ధూళి, పంట వ్యర్థాలను కాల్చడం వంటి అంశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కొన్ని రకాల వాహనాల ప్రవేశంపై ఆంక్షలు విధించడం, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పియుసి) సర్టిఫికెట్లకు జియోట్యాగింగ్ చేయడం వంటి చర్యలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాప్స్, సోషల్ మీడియా ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మాసనానికి వివరించారు. గురువారం దిల్లీ కాలుష్యంలో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల 14 శాతం కాలుష్యం నమోదవుతోందని ఆమె వెల్లడించారు. దీపావళి సెలవుల అనంతరం కోర్టు తిరిగి ప్రారంభమైన తర్వాత నవంబర్ 16న కొన్ని ఉత్తర్వులు జారీ చేసి, పిటిషన్‌పై విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
07-11-2026
www.prajapaksham.in

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు.

రీక్ష

సిఎం ఆదేశించినా సిఎస్ తాత్సారం!

తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాత్సారం చేస్తున్నారని తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు ఆరోపించారు. కొంత మంది ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, బదిలీలు, పదోన్నతులు తదితర చిన్న, చిన్న సమస్యలకు కూడా ఎన్ని సార్లు చెప్పుకోవాలని వారు ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేదంటే దీపావళి పండగ తర్వాత ప్రత్యక్ష కార్యాచరణ తప్పదని హెచ్చరించింది. హైదరాబాద్‌లోని టిజిఒ భవన్‌లో శుక్రవారం జెఎసి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జెఎసి చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు జి.సదానందం గౌడ్,చావ రవి, కె.గౌతమ్ కుమార్, బి.మధుసూదన్‌రెడ్డి, ముబీజ్ హుస్సేన్ ,బి.శ్యామ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మారం జగదీశ్వర్ మాట్లాడుతూ పిఆర్‌సి రిపోర్ట్ ను వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిసిఎస్ ను రద్దు చేసి ,ఒపిఎస్ పునరుద్ధరణకు తక్షణమే అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్ కు నిధుల కొరత లేదనీ, ట్రస్ట్ వద్ద రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఉన్నాయన్నారు. జెఎసి ప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం ప్రకటించినప్పటికీ సిపిఎస్ పైన అధ్యయన కమిటీని వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ప్రతి రెండు నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించి నప్పటికీ అమలుచేయడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించాలని కోరినా ఒక్క సారి మాత్రమే సంబంధిత ముఖ్యకార్యదర్శి సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈహెచ్‌ఎస్ పేషంట్లను కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు చిన్నచూపు చూడటం మానుకోవాలని హెచ్చరించారు. ఎల్ నినో నేపథ్యంలో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని,జిఒ 317, జిఒ 190లను మిగిలిన శాఖల్లనూ అమలు చేయాలని జెఎసిలోని అన్ని సంఘాలకు ప్రభుత్వ గుర్తింపును పునరుద్ధరించాలని,ఆర్థికేతర సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.




'గోట్' ట్రైలర్ విడుదల

ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం (గోట్) 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం' అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ తన సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 'సుడిగాలి సుధీర్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రమిది. ఆయన క్రేజ్‌కు తగ్గ కథను ఎన్నుకుని ఈ సినిమా నిర్మించాను. ఆయన పాత్ర నేటి యువత కనెక్ట్ అవుతుంది. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆదుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మీ సాయి, నవీన్ నేని, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఈ చిత్రానికి సంగీతం లియోన్ జేమ్స్, నేపథ్య సంగీతం: మణిశర్మ, డిఒపి: రసూల్ ఎల్లోర్, ఆడిషనల్ డిఒపి: సన్నీ కూర పాటి, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, , కో ప్రొడ్యూసర్: నమైరా రెడ్డి.ఎన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ.

'మదరాసి రబ్బరు బొమ్మ' పాట రిలీజ్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టైటిల్ గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'మదరాసి రబ్బరు బొమ్మ'ను పాటను విడుదల చేశారు. హీరో, హీరోయిన్ సంప్రదాయ ఫోక్ లుక్‌లో కనిపిస్తూ, కలర్ ఫుల్ బ్యాక్ డ్రాప్‌లో సందడి చేయడం పాటపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు డైరెక్టర్ సాగర్ కె చంద్ర. ముఖేష్ జ్ఞానేష్/అనిత్ డిఒపి వ్యవహరిస్తుండగా, సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. స్టన్ శివ, విజయ్, వెంకట్, రియల్ సతీష్ సినిమా యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. రచన, దర్శకత్వం: సాగర్ కె చంద్ర.




మహంతి ఝాన్సీ రాణిగా 'టబు'

28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు మరోసారి తెరపై కలసి నటిస్తున్నారు. ఈసారి వారి కథ ప్రేమ చుట్టూ కాదు.. వార్ తో సాగనుంది. ఈ గ్లింప్స్‌లో మహంతి ఝాన్సీ రాణిగా టబు తనదైన ముద్ర వేశారు. హుందాతనం, అధికార దర్పం ఆమె పాత్రలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె కమాండింగ్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటోంది. అందమైన చీరకట్టులో టబు కనిపించిన తీరు, ఆమె పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, రాజసం ఉట్టిపడే హావభావాలు.. ఎలాంటి ప్రతిఘటననైనా ఎదుర్కొనే శక్తిమంతమైన మహిళగా ఆమె పాత్రను ఆవిష్కరిస్తున్నాయి. 'కింగ్ 100' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. టబు పుట్టినరోజు సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలు విజువల్స్‌కు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. సినిమాటోగ్రాఫర్ రాజా మహదేవన్ స్టైలిష్ విజువల్స్ అందించగా, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో గ్లింప్స్ ఇంటన్సిటీ మరింత పెంచారు. నవీన్ నూలి ఎడిటింగ్, సతీష్ కుమార్ ఎన్ ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు.'కింగ్ 100' చిత్రం డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

బిసి స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైపెండ్ పెంపు

సివిల్స్ విద్యార్థులకు రూ.7 వేలు.. ఫౌండేషన్ కోర్సు వారికి రూ.1,500

బుక్ ఫండ్ రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు: మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసి స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్‌ను పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 బిసి స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్ పొందుతున్న నిరుద్యోగ యువతకు ఆర్థికంగా మరింత చేయూతనిచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ పొందుతున్న విద్యార్థుల నెలవారీ స్టైపెండ్‌ను రూ.5 వేల నుంచి రూ.7 వేలకు పెంచారు. అలాగే ఏడాదికి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. గ్రూప్1, 2, 3, 4, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్‌సి తదితర ఉద్యోగాల కోసం నిర్వహించే ఫౌండేషన్ కోర్సు విద్యార్థుల స్టైపెండ్‌ను రూ.1 వెయ్యి నుంచి రూ.1,500కు పెంచినట్లు మంత్రి వెల్లడించారు. బిసి స్టడీ సర్కిల్ చరిత్రలో తొలిసారిగా గత రెండేళ్లలో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ పొందిన పూర్వ విద్యార్థులకు మళ్లీ ప్రవేశం కల్పిస్తున్నారు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపికైన వారికి తాజా అభ్యర్థులతో సమానంగా స్టైపెండ్ సౌకర్యం కల్పిస్తూ పునఃప్రవేశం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు నిరంతర సాధన అవసరమనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి బిసి స్టడీ సర్కిల్లో స్టడీ రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, కమిషనర్ బాలమాయాదేవి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే వేతనం చెల్లించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: 'బస్తిదవాఖాన' ఉద్యోగులకు రావాల్సిన మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 1500 మంది బస్తి దవాఖానలో పనిచేస్తున్నారని, తక్కువ వేతనంతో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాప్‌కు ఆగస్టు , సెప్టెంబర్,అక్టోబర్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్తీదవాఖాన లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో వర్క్ చేస్తున్న ఉద్యోగులందరికీ ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, కార్పొరేషన్ ద్వారా ప్రతినెలా 5వ తేదీన బస్తిదవాఖాన లో పని చేస్తున్న అన్ని క్యాదర్ల ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మహా ధర్నా చేపడుతామని పేర్కొన్నారు.

ఇక నేరుగా ఖాతాల్లోకి

(మొదటి పేజీ తరువాయి)

అవసరాలకు అనుగుణంగా సొంత ఆదాయాన్ని తక్షణమే వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టగా, దాని అమలుకు ఇప్పుడు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిర్ణయంతో గ్రామపంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి ఖాతాల్లో జమ కానుండటంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరింత వేగవంతం కానున్నాయి. స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛను పెంచుతూ గ్రామపంచాయతీలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ చట్ట సవరణ కీలక ముందడుగుగాతీసుకునేలా ఈ మార్పు దోహదపడుతుందని వెల్లడించింది. చట్ట సవరణ అమలుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడటంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు ఇది కీలకమైన ముందడుగని, గ్రామాల అభివృద్ధిని మరింత వేగవంతం చేసే సంస్కరణగా ఈ నిర్ణయం నిలుస్తుందని ఆమె అన్నారు.

నష్టాలు ఉంటే చెల్లింపులు ఫుల్.. లాభాలుంటే నిల్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్‌టిసి కార్మికుల బోనస్‌లు, చెల్లింపుల విషయంలో ప్రభుత్వాలు, యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలపై ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. 'నష్టాలు ఉంటే చెల్లింపులు ఫుల్.. లాభాలుంటే నిల్' అనే ధోరణిలో పరిస్థితులు ఉన్నాయని ఆయన విమర్శించారు. సుమారు రూ. 50 వేల కోట్ల నష్టాలలో ఉన్న తమిళనాడు ఆర్‌టిసిలో 20 శాతం బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు చేస్తున్నారు. రూ. 11 వేల కోట్ల నష్టాలలో ఉన్న మహారాష్ట్ర ఆర్‌టిసి కార్మికులకు రూ.10 వేల చొప్పున 83 వేల మందికి బోనస్ చెల్లింపునకు ఆదేశాలు జారీ అయ్యాయి.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com